జూన్
2026

242

సంపుటి : 22 సంచిక : 1

వెల రూ. 15/-

MARXISTU

# మార్క్సిస్టు

## సైద్ధాంతిక మాసపత్రిక

### ఈ సంచికలో........

అరాచక సంస్కృతిపై సమరం
నయా-ఉదారవాద విధానాలకు భారత్ గుడ్‌బై చెప్పాలి
మోడీకి త్యాగాలు కావాలి, ఆర్థిక వ్యవస్థకు జవాబులు కావాలి
సంక్షుభిత సమయంలో ప్రజలను ఆదుకునే సాధనం ఎర్రజెండా మాత్రమే
నీట్ సంక్షోభం భారతీయ విద్యా వ్యవస్థ అధోగతికి దర్పణం
పెట్టుబడిదారీ విధానాన్ని మార్క్స్ ఇంకా ఎందుకు వెంటాడుతున్నాడు?
ఢిల్లీ సుల్తానుల కాలం వ్యావసాయక సమాజం
ట్రంప్ చైనా పర్యటన నేర్పుతున్న పాఠాలు
మతంతో ముడిపడిన 21వ శతాబ్దపు ఫాసిజం
కొత్త టెక్నాలజీ కొత్త సమాజం
ఉన్నత విద్యావ్యవస్థ నోరునొక్కడం ప్రజాస్వామ్యాన్ని బలహీనపరచడమే
అమెరికా లాభాల కోసం ప్రజలపై భారాలు

సంస్కృతి

# అరాచక సంస్కృతిపై సమరం

**డా॥ జె. రవీంద్రనాథ్**
(రచయిత విశ్రాంత ఆంగ్ల ఆచార్యులు)

నేటి అరాచక సామ్రాజ్య వాద సంస్కృతి క్షీణ దశలో ఉంది. అందుకే ప్రణాళికారహిత అధికోత్పత్తి, ప్రపంచ వనరులపై ఆధిపత్యం, ఆయుధ వ్యాపారం, యుద్ధాలు, విధ్వంస రచన పరిపాటి అయింది. ఏకైక అగ్ర రాజ్యం అమెరికా తన సామ్రాజ్య

విస్తరణ ఆకాంక్షతో ఇరాన్, క్యూబా ఇతర చిరు దేశాలపై ఆంక్షలు పెట్టి యుద్ధాలు చేయడమే కాదు, భూగోళం సరిపోక ఇతర గ్రహాల వనరులు కూడా ఆరగించేందుకు ఆత్రుత చూపిస్తోంది. మరోవైపు దేశీయంగా అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ సమాజ రూపాన్ని పరమ ఆదర్శంగా చూపించే సంస్కృతి పెరిగింది. శ్రామిక వర్గ హక్కులను, ప్రకృతి రక్షణను అభివృద్ధికి అనవసర ఆటంకంగా చూపే ధోరణి ప్రబలింది. ఈ తరుణంలో పెట్టుబడిదారీ సంస్కృతిపై మార్క్సిస్టు విమర్శకుడు క్రిస్టోఫర్ కాడ్వెల్ తన 'మానవుడు – ప్రకృతి' ("ఫర్దర్ స్టడీస్ ఇన్ ఎ డైయింగ్ కల్చర్" పుస్తకంలోని) వ్యాసంలో వెలిబుచ్చిన భావాలు ఎంతో ప్రాసంగికత కలిగి ఉన్నాయి.

క్రిస్టోఫర్ కాడ్వెల్ (1907–37) ఒక పాత్రికేయుడు, సాహితీ విమర్శకుడు, కమ్యూనిస్టు పోరాట యోధుడు. అతడి సృజనాత్మకత కవితలు, కథలు, డిటెక్టివ్ నవలలు, ఏరోనాటిక్ పాఠ్య పుస్తకాలు, విమర్శనా గ్రంథాలుగా రూపుదాల్చింది. చరిత్ర

నిర్మాణంలో ఆయన అంతర్జాతీయ శ్రామిక వర్గ స్ఫూర్తి, నిబద్ధతలు స్పానిష్ అంతర్యుద్ధంలో ప్రజాస్వామ్య శక్తుల తరపున పోరులో అమరత్వంతో రుజువైంది. ఆయన రచనల్లో "ది క్రైసిస్ ఆఫ్ ఫిజిక్స్", "ఇల్యూజన్ అండ్ రియాలిటీ", "స్టడీస్ ఇన్ ఏ డైయింగ్ కల్చర్", "ఫర్ధర్ స్టడీస్ ఇన్ ఏ డైయింగ్ కల్చర్" ముఖ్యమైనవి. బూర్జువా సంస్కృతికి చెందిన ప్రాపంచిక దృక్పథం ఆ సంస్కృతి పొందిన వక్రీకరణల వల్ల అదృశ్య శక్తిగా ఉంటూ బయట నుంచి ఒత్తిడి చేస్తూ ఉంటుంది. అయితే ఆ ప్రాపంచిక దృక్పథం స్థిరమైన చైతన్యం కాదు. తనను పుట్టించిన సమాజంలాగే అది కూడా మారుతుంది. ఒక్కోసారి తనకు తానే వ్యతిరేకంగా కనిపించవచ్చు –ఒక ఫోటోగ్రాఫ్‌కు పాజిటివ్, నెగిటివ్‌లు ఉన్నట్లుగా. అయినా ఆ దృక్పథం వాస్తవికతను గురించి పాక్షిక దృష్టిలానే మిగులుతుంది.

వర్గ సమాజాల లక్షణం ఏమిటంటే అధికారం అనేది అల్ప సంఖ్యాకుల చేతుల్లో ఉంటుంది. సామాజిక విధానం సమాజానికి గల అసంపూర్ణ చైతన్యం వల్ల సమాజ



క్రిస్టోఫర్ కాడ్వెల్

అవసరాలను బట్టి కాక పాలకుల ఇచ్ఛలకు అనుగుణంగా నిర్దేశించబడుతుంది. సమాజ లక్ష్యం – ప్రకృతి శక్తుల నుంచి స్వేచ్ఛకై మానవజాతి చేసే యత్నాలు, వర్గ సమాజాల్లో పాలకుల ఇచ్ఛకు పాలితులు లోబడి ఉండటం వల్ల నెరవేరుతున్నట్లుగా కనిపిస్తుంది. కానీ నిజానికి వర్గాలు శ్రమ విభజన వల్ల తయారైనందున వర్గాల పాత్రలు వాటి ఇచ్ఛను బట్టి కాక సామాజిక ఉత్పత్తిలో ఆయా వర్గాల స్థానాన్ని బట్టి ఉంటాయి. ఒకవైపు సంపన్న జీవితం, మరోవైపు కనీస అవసరాలు తీరని బ్రతుకులు ఉంటాయి.

భౌతిక అసమానత వల్ల ఆలోచన అనేది దోపిడీదారుల ప్రత్యేక హక్కు (ప్రివిలేజ్)గా మారి, ఆచరణ దూరమై ఆ దూరమైన మేరకు దోపిడి వర్గానికి సమాజంలో ఉన్నత మైన స్థానం ఉంటుంది. దీనివల్ల ఆలోచన స్తంభించి, ఆచరణ గందరగోళంగా ఉంటుంది. ఈ పరిణా మం సామాజిక శక్తుల వల్ల ఏర్పడిందే.

ఆదిమ సమాజాల్లో ఉత్పత్తి సాధనాలు మనుషులు, భూమి మాత్రమే కాబట్టి వాటిపై యాజమాన్య హక్కు పాలకవర్గానికి ఆధార భూతమవుతుంది. తర్వాత వచ్చిన నాగరికతల్లో కూడా ఈ హక్కు బలప్రయోగం ద్వారా అమలై, పాలకవర్గానికి మనుష్యుల

పై యాజమాన్య హక్కు లేకున్నా శ్రామిక వర్గాలపై పెత్తనం ఉంటుంది. అత్యంత అభివృద్ధి చెందిన సంస్కృతి కూడా పాలకవర్గ దృక్పథాన్ని – దాని కోరికలు, ఆటుపోట్లు, బలహీనతలు తెలియజేస్తుంది. విప్లవం ద్వారా అధికారం ఒక వర్గం నుంచి మరో వర్గానికి మారినప్పుడు, దానికి అనువుగా సైద్ధాంతిక విప్లవం వస్తుంది. అయితే పాలిత వర్గంలో దోపిడీ వ్యతిరేక చైతన్యం పెరిగినప్పుడే అది జరుగుతుంది. వర్గ సమాజంలో ఆలోచన – ఆచరణల మధ్య అంతరం, ఆ రెండింటి పతనానికి దారితీసి ఆ సమాజ సంస్కృతి క్షీణిస్తుంది. అదే సమయంలో భౌతిక క్షీణత, సైద్ధాంతిక దివాలాకోరుతనం కనిపిస్తాయి.

పాలించే హక్కు వారసత్వంగా వ్యక్తులు స్థాయిని బట్టి లాంఛన ప్రాయమైన మార్పిడిగా జరిగినప్పుడు, సమాజరూపాలన్నీ దానినే కాపాడుతున్నప్పుడు సమస్య మొదలవుతుంది. చైతన్యం అనేది శ్రమ చేయడంలో కాకుండా, పుట్టుక లేదా వంశపారంపర్యం వల్ల ప్రత్యేక హక్కుగా మారితే అది చైతన్యం కాదు, భ్రాంతి మాత్రమే. ఈ భ్రాంతి వర్గ సమాజాలకు మామూలే కానీ గతి తర్క భౌతిక వాదానికి మాత్రం కాదు.

బూర్జువా సంస్కృతి వ్యాఖ్యానించే చరిత్రకూ ఒక శాస్త్రీయ చరిత్రకూ అతి తక్కువ పోలిక ఉంటుంది. ఇది తాము నిజంగా శాస్త్రీయ, నిష్పాక్షిక చరిత్ర కారులం అనుకునే వారికి సైతం వర్తిస్తుంది. నిజానికి చరిత్ర శాస్త్రం బూర్జువా సంస్కృతి వినాశంపై ఆధారపడి ఉంది. దీని వల్లనే బూర్జువా చరిత్రకారులు చరిత్ర ఒక సైన్స్ కాదనే తీర్మానానికి తరచుగా వచ్చారు. ఇంతవరకు వారు చెప్పేది నిజమే ఎందుకంటే చరిత్ర అనేది

(మిగతా 34వ పేజీలో)

## ఈ సంచికలో...


1. అరాచక సంస్కృతిపై సమరం
డా॥ జె. రవీంద్ర నాథ్.......2

2. నయా-ఉదారవాద విధానాలకు భారత్ గుడ్‌బై చెప్పాలి
అరుణ్ మైరా.......4

3. మోడీకి త్యాగాలు కావాలి, ఆర్థిక వ్యవస్థకు జవాబులు కావాలి
మిథాలి ముఖర్జీ......5

4. సంక్షుభిత సమయంలో ప్రజలను ఆదుకునే సాధనం ఎర్ర జెండా మాత్రమే
ఎంఎ బేబీ......7

5. నీట్ సంక్షోభం భారతీయ విద్యా వ్యవస్థ అధోగతికి దర్పణం

6. పెట్టుబడిదారీ విధానాన్ని మార్క్స్ ఇంకా ఎందుకు వెంటాడుతున్నాడు?
హర్జిత్ సింగ్.......14

7. డిల్లీ సుల్తానుల కాలం వ్యావసాయక సమాజం
ఎంవి ఎస్ శర్మ.......17

8. ట్రంప్ చైనా పర్యటన నేర్పుతున్న పాఠాలు
విజయ్ ప్రసాద్..........20

9. మతంతో ముడిపడిన 21వ శతాబ్దపు ఫాసిజం
బొవెంటురా డిసౌజా శాంటోజ్ ......23

10. కొత్త టెక్నాలజీ కొత్త సమాజం
సంజయ్ రాయ్ ......27

11. ఉన్నత విద్యావ్యవస్థ నోరునొక్కడం ప్రజాస్వామ్యాన్ని బలహీనపరచడమే
సిపి రాజేంద్రన్......29

12. అమెరికా లాభాల కోసం ప్రజలపై భారాలు
ఎ కోటిరెడ్డి ......32



**సంపాదకుడు:**
**ఎస్.వెంకట్రావు**

**సంపాదక వర్గం:**
**బి.వి.రాఘవులు**
**తమ్మినేని వీరభద్రం**
**ఎస్.వీరయ్య**
**తెలకపల్లి రవి**

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున

ప్రచురణ కర్త, ముద్రాపకుడు: **బి.వి.రాఘవులు**
సంపాదకుడు : ఎస్.వెంకట్రావు
**ఫోన్: ఎడిటర్ : 94900 99333**

**ముద్రణ:** ప్రజాశక్తి ప్రింటర్స్ అండ్ పబ్లిషర్స్ ప్రై. లి., 14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మ), గుంటూరు(జి)
**మేనేజర్: కె.హరికిషోర్: 94900 99422**
email:venkataraosankarapu@gmail.com
email:marxistap@gmail.com
visit cpi(m) site at : cpim.org


# రాజకీయ దురుద్దేశం

కేరళలో పదేళ్లపాటు మచ్చలేని పరిపాలన నందించిన సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఇంటిపై, ఆయన పదవి నుండి దిగిపోయిన కొద్ది రోజులకే కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఇడి) దాడి చేయడం నూటికి నూరుపాళు కుట్రపూరితమైన కక్షసాధింపు చర్యే. ఈ కుట్రలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంతోపాటు రాష్ట్రంలో కొత్తగా అధికారం చేపట్టిన కాంగ్రెస్ నాయకత్వంలోని యుడిఎఫ్ ప్రభుత్వానికి కూడా భాగస్వామ్యం ఉన్నట్లు కనిపిస్తోంది. యుడిఎఫ్ ముఖ్యమంత్రి విడి సతీసన్ ఢిల్లీ వెళ్లి మోడీని కలిసిన వెంటనే మే 27వ తేదీన విజయన్ అద్దె ఇంటిపై ఇడి అధికారులు దాడి చేయడం పైస్థాయిలో జరిగిన లాలూచీ వ్యవహారాన్ని వెల్లడిస్తోంది.

విజయన్ కుమార్తె టి. వీణకు చెందిన ఎగ్జాలాజిక్ కంపెనీకి, సిఎంఆర్ఎల్ మనీ లాండరింగ్ కంపెనీకి మధ్య జరిగిన లావాదేవీల్లో అవకతవకలు జరిగాయని చాలా కాలం నుండి ప్రత్యర్థులు ఆరోపిస్తూ వస్తున్నారు. ఇడి అనేకసార్లు దర్యాప్తు జరిపింది. కానీ ఒక్క ఆధారం కూడా పట్టుకోలేకపోయింది. రెండు కంపెనీల మధ్య లావాదేవీలు పారదర్శకంగా, చట్టానికి, న్యాయానికి అనుగుణంగా జరిగిన విషయం ఇడికి తెలుసు. అయినప్పటికీ ముఖ్యమంత్రి పదవి నుండి దిగిపోయిన కొద్ది రోజులకే ఆయన ఇంటిపై దాడికి దిగడం రాజకీయ దురుద్దేశంతో తీసుకున్న చర్య మినహా మరేమీ కాదు. ఈ దాడులకు నిరసనగా తిరువనంతపురంలో విజయన్ ఇంటి వద్ద, రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో ప్రజలు రోడ్లపైకి వచ్చి ఆందోళన నిర్వహించారు. ఢిల్లీతో సహా దేశంలోని అనేక ప్రాంతాల్లో సిపిఐ(ఎం) శ్రేణులు నిరసన ప్రదర్శనలు జరిపాయి.

ఏ తప్పూ చేయకపోతే ఇడి దాడులకు ఎందుకు భయపడాలి అని కొందరు ప్రశ్నిస్తున్నారు. నిజమే కానీ బిజెపి ప్రభుత్వం ఈ దర్యాప్తు సంస్థలను ఎంతగా దుర్వినియోగం చేస్తున్నదో, అవినీతి పరులను ప్రోత్సహిస్తూ నిజాయితీ పరులపై వేధింపులకు ఈ సంస్థలను ఎంతగా ఉపయోగించుకుంటున్నదో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 12 ఏళ్లలో అది జరిపిన నిర్వాకాలు చూస్తే అర్థమవుతుంది. ప్రతిపక్షంలో ఉండగా ఇడీతో సహా ఇతర అవినీతి కేసులు ఎదుర్కొన్న అనేక మంది నాయకులు, పార్టీలు ఫిరాయించి తన పార్టీలో చేరిన వెంటనే వారిపై కేసులు మూలపడేసింది. అటువంటి తీవ్రమైన అవినీతి కేసుల్లో ఉన్న వారు బిజెపి ముఖ్యమంత్రులు కూడా అయ్యారు. కానీ ఎటువంటి ఆధారాలు లేని వారిపై కక్షసాధింపు కోసం ఇడి కేసులు బనాయిస్తున్నారు.

రాజకీయ అవినీతే కాదు, కార్పొరేట్ అవినీతికి బిజెపి ప్రభుత్వం ఎలా కొమ్ముకాస్తున్నదో తెలిపే గొప్ప ఉదాహరణ మోడీ అనుంగు కార్పొరేట్ మిత్రుడు ఆదానీపై అమెరికా కోర్టులో ఉన్న కేసు వ్యవహారంలో ఇటీవల మోడీ ప్రభుత్వం వ్యవహరించిన తీరు. అమెరికా న్యాయ విభాగంలో అదానీ గ్రూపుపై ఉన్న కేసులు ఎత్తివేయడానికీ, మోడీ ప్రభుత్వం అమెరికాకు లొంగి వాణిజ్య ఒప్పందం చేసుకోడానికీ మధ్య లింకు ఉందని ప్రచారం జరగుతున్న సమయంలోనే అదానీపై ఉన్న కేసులను అమెరికా ప్రభుత్వం ఎత్తివేసింది. దీనికి పరిహారంగా అదానీ గ్రూపు అమెరికాలో 1,000 కోట్ల డాలర్ల పెట్టుబడి పెట్టడానికి అంగీకరించింది. దీని వల్ల 15,000 మంది అమెరికన్లకు ఉద్యోగాలు వస్తాయని ట్రంప్ ప్రభుత్వం సమర్థించుకుంది. కానీ దీనివల్ల భారతీయులకు జరిగిన హాని ఏమిటి? ఒకవైపు సంక్షోభం వచ్చింది, ప్రజలు పొదుపు పాటించాలని దేశ ప్రజలకు హితబోధలు చేస్తున్న మోడీ ఒక నేరాన్ని మాఫీ చేసుకోడానికి తన కార్పొరేట్ మిత్రుడు 1000 కోట్ల డాలర్ల విలువైన విదేశీ మారకాన్ని అమెరికాకు తరలించడంపట్ల నోరు మెదపలేదు.

భారత దేశంలో అవినీతిపై దర్యాప్తు నిజాయితీతో కాకుండా ప్రత్యర్థులను వేధించడానికీ, మిత్రులను రక్షించడానికీ ఒక ఆయుధంగా మారింది. ఈ నేపథ్యంలోనే విజయన్ ఇంటిపై ఇడి దాడులను చూడాలి. మోడీ ప్రభుత్వ నయా-ఉదారవాద విధానాల విషయంలో కాంగ్రెస్‌కు పేచీలేదు. మతతత్వ విధానాలతో కూడా రాజీపడుతోంది. కానీ మోడీ కార్పొరేట్-మతోన్మాద విధానాలను నికరంగా వ్యతిరేకించి ప్రజలను సమీకరిస్తున్నది సిపిఐ(ఎం). అందువల్లనే కుట్రలు కుయుక్తులతో సిపిఐ(ఎం)నూ, ప్రజల్లో దాని ప్రతిష్టనూ దెబ్బతీయడానికి మోడీ ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్నది. కేరళలో పార్టీ నేతృత్వంలోని ఎల్‌డిఎఫ్ ఓడిపోవడంతో పార్టీపై దాడులకు అది మరింత బరితెగిస్తున్నదని విజయన్‌పై దాడులు తెలియజేస్తున్నాయి. చరిత్రలో ఇంతకన్నా పెద్ద దాడులను, హింసాకాండను ఎదుర్కొని కమ్యూనిస్టులు పైకి లేచారు. మోడీ విధానాలకు వ్యతిరేకంగా విశాలమైన ప్రజానీకాన్ని సమీకరించడంలో సిపిఐ(ఎం)కు ఈ దాడులు, వేధింపులు అడ్డుకాబోవన్న విషయాన్ని మోడీ, ఆయన పార్టీ గ్రహించడం మంచిది.

**ఈ మాసం ముఖ్యాంశం**

# నయా-ఉదారవాద విధానాలకు భారత్ గుడ్‌బై చెప్పాలి



రచయిత ప్లానింగ్ కమిషన్ మాజీ సభ్యులు. 'రీ ఇమేజినింగ్ ఇండియాస్ ఎకానమీ' పుస్తక రచయిత

**అరుణ్ మైరా**

సోవియట్ యూనియన్ పతనంతో పెట్టుబడిదారీ, సోషలిస్టు సిద్ధాంతాల మధ్య యుద్ధం ముగిసిందని, అదే "చరిత్ర అంతం (ది ఎండ్ ఆఫ్ హిస్టరీ)" అని ఫ్రాన్సిస్ ఫుకుయామా తన సిద్ధాంతంలో పేర్కొన్నారు. కానీ బావజాల సంఘర్షణ చరిత్ర మాత్రం ముగియ లేదు. 1991 తర్వాతి ఆర్థిక ప్రపంచీకరణ, నయా-ఉదారవాద పెట్టుబడిదారీ విధానాల ఆధారంగా రూపొందిన భారత వాణిజ్య, ఆర్థిక విధానాల్లో ఇప్పుడు సమూలమైన సంస్కరణలు చేయాల్సిన అవసరం ఉంది.

పెట్టుబడులు, ఆర్థికవనరులు, వస్తు-సేవలు సరిహద్దులు లేకుండా స్వేచ్ఛగా ప్రవహించే ప్రపంచీకరణ కాలం నాలుగు పెద్ద ఎదురుదెబ్బలతో ముగిసిపోయింది.

(అ) 2008 ఆర్థిక సంక్షోభం,

(ఆ) 2020 ప్రారంభంలో కోవిడ్-19 వల్ల గ్లోబల్ సప్లై చెయిన్‌లు స్తంభించిపోవడం

(ఇ) అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రపంచ దేశాలతో మొదలుపెట్టిన వాణిజ్య యుద్ధాలు (2024 నుండి కొనసాగుతున్నాయి)

(ఈ) ఇరాన్, అమెరికా ఉద్రిక్తతల నేపథ్యంలో హార్ముజ్ జలసంధి మూతపడి, ప్రపంచ ఇంధన సరఫరా నిలిచిపోవడం. ఈ పరిణామాలు ప్రపంచీకరణకు ఎదురుదెబ్బలు తెచ్చాయి.

ఈ ఆర్థిక సంక్షోభం వల్ల ఆర్థికవేత్తలు మేల్కొని, ఆర్థిక ప్రవాహాలను నియంత్రించాల్సిన అవసరాన్ని గుర్తించారు. అయినప్పటికీ పాతపద్ధతులే కొనసాగుతున్నాయి. ఎందుకంటే ఆర్థికవృద్ధి కోసం పెట్టుబడులకూ, వాణిజ్యానికీ ఎంతమేర స్వేచ్ఛ ఉండాలనే విషయంలో నిపుణుల మధ్య ఏకాభిప్రాయం లేదు.

కోవిడ్ -19 మహమ్మారి వల్ల గ్లోబల్ సప్లై చెయిన్‌లపై ఆధారపడే ఆర్థిక వ్యవస్థలు ఏమాత్రం తట్టుకోలేవని స్పష్టమైంది. అలాగే ఆర్థిక సంక్షోభం, కోవిడ్-19 ప్రభావాలు సమాజంలోని అత్యంత బలహీన వర్గాలపై తీవ్ర ప్రభావం చూపించాయి. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలైనా, ఇతర ప్రభుత్వాలైనా ప్రజా సేవలను, సామాజిక భద్రతను సమానంగా అందించడం ఎంత అవసరమో ఈ సంక్షోభాలు నిరూపించాయి.

1925లో వెలువడిన 'ది మేజర్ ఎకనామిక్ సైకిల్స్' పుస్తకంలో ఆర్థికవేత్త నికోలాయ్ కొండ్రాటీవ్ రాజకీయ ఆర్థిక వ్యవస్థలో మార్పులు 40-60 ఏళ్ళ పాటు కొనసాగే దీర్ఘ తరంగాల (Long Waves) రూపంలో వస్తాయని వివరించారు. ఈ దీర్ఘ తరంగాల లోపలే పెట్టుబడిదారీ ఆర్థికవ్యవస్థలో స్వల్పకాలిక ఆర్థిక మాంద్యాలు, వ్యాపార లాభనష్టాలు, రోజువారీ స్టాక్ మార్కెట్ హెచ్చు తగ్గులు ఉంటాయి. ఆధునిక పెట్టుబడిదారీ వ్యవస్థ పనితీరును వ్యాపార మాధ్యమాలు వీటితోనే కొలుస్తున్నాయి.

సామాజిక శాస్త్రవేత్త వోల్ఫ్‌గ్యాంగ్ స్ట్రీక్ తన 'హౌ విల్ క్యాపిటలిజం ఎండ్?' (పెట్టుబడిదారీ వ్యవస్థ ఎలా అంతమవు తుంది?) గ్రంథంలో పెట్టుబడిదారీ వ్యవస్థ ఒక్కసారిగా కుప్పకూలదని పేర్కొన్నారు. 2008 సంక్షోభం తర్వాత పెట్టుబడిదారీ వ్యవస్థ క్షీణించే దశలోకి ప్రవేశించిందని అభిప్రాయపడ్డారు. పెట్టుబడిదారీవ్యవస్థ అంతానికి విప్లవాత్మక ప్రత్యామ్నాయం అవ సరం లేదు. దాన్ని భర్తీ చేసే మెరుగైన సమాజ నమూనా కూడా అవసరం లేదు. సమకాలీన పెట్టుబడిదారీ వ్యవస్థ తన అంతర్గత వైరుధ్యాల వల్ల, ప్రత్యర్థులను ఓడించిన ఫలితంగానే క్రమంగా కూలిపోతోంది అని స్ట్రీక్ పేర్కొన్నారు.

**నయా-ఉదారవాద పెట్టుబడిదారీ వ్యవస్థలో వైరుధ్యాలు**

నేటి పెట్టుబడిదారీ వ్యవస్థలోని ప్రధాన వైరుధ్యాల్లో ఒకటి ప్రజలను కేవలం వినియోగదారులుగా చూడటం. ఎక్కువగా కొనుగోలు చేయాలనే కోరికే ఆర్థిక వృద్ధికి ప్రధాన శక్తి అని భావించడం. ఆర్థిక వృద్ధి అనే "అదృశ్య హస్తం" ప్రజలకు సరిపడ ఆదాయం కల్పిస్తుందని భావించడం. కానీ సమాజంలో గౌరవప్రదమైన జీవితం, ఆత్మగౌరవం వంటి ప్రజల అవసరాలు నిర్లక్ష్యం చేయబడుతున్నాయి. సాంకేతికత ఆధారిత ఉత్పాదకత పెరుగుదలతో ఉపాధి అవకాశాలు తగ్గిపోతున్న పరిస్థితుల్లో ఎక్కువ సంపాదించి, ఎక్కువ వినియోగించడం ప్రజలకు మరింత కష్టమవుతోంది.

మరో వైరుధ్యం ఏమిటంటే... ప్రైవేటు రంగం అభివృద్ధి కోసం ప్రభుత్వాలు ఆర్థికరంగం నుంచి తప్పుకోవాలని డిమాండ్ చేస్తోంది. ప్రభుత్వ వ్యయాల్లో కోతల వల్ల ప్రజల కొనుగోలు శక్తి తగ్గినప్పుడు, అసంతృప్తి పెరిగినప్పుడు ఫైనాన్స్ కంపెనీలు అప్పులు ఇచ్చి సంక్షోభాలకు దారితీస్తున్నాయి. ఇందుకోసం రుణ మార్కెట్ల నియంత్రణలను సడలించాయి.

1980లలో ప్రారంభమైన ఈ ధోరణి చివరకు 2008 ఆర్థిక సంక్షోభానికి దారితీసింది. 1990ల నుంచి, ముఖ్యంగా 2008 తర్వాత సమాజంలోని అగ్రశ్రేణి 1% ధనికులు, మిగతా ప్రజల మధ్య సంపద అసమానతలు వేగంగా పెరిగాయని ఆర్థికవేత్త థామస్ పికెట్టి, ఆక్స్‌ఫామ్ వంటి సంస్థలు నమోదు చేశాయి.

ఫైనాన్స్ రంగం ఆధిపత్యం పెరగడం వల్ల అసమానతలు అధికమయ్యాయి. అత్యంత సంపన్నులైన 0.1% వారి సంపద విపరీతంగా పెరిగింది. వారి సంపదతో

పాటు రాజకీయ ప్రభావం కూడా పెరిగింది. మీడియా, ప్రజాభిప్రాయం, పరిశోధనా సంస్థలపై వారు ప్రభావం చూపుతున్నారు. ఆర్థిక వ్యవస్థ బలహీనపడినప్పుడు వారు సూచించే పరిష్కారం, తక్కువ నియంత్రణలు, ప్రైవేటు రంగానికి మరింత స్వేచ్ఛ నివ్వడం, సంపన్నులపై పన్నులు తగ్గించడం. ఇలా చేస్తే పెట్టుబడులు పెరుగుతాయని వాదిస్తున్నారు. దీంతో పేద ప్రజలకు అవసరమైన సామాజిక భద్రతా వ్యవస్థలు ఏర్పాటు చేయడం ప్రభుత్వాలకు కష్టమవుతోంది.

**❝ 1990ల నుంచి భారత ఆర్థిక వ్యూహం ప్రపంచీకరణ ధోరణులతో అనుసంధానమైంది. అయితే 1990లలో ప్రారంభమైన సాంకేతిక, ఆర్థిక ప్రపంచీకరణ ఇప్పుడు గరిష్ట స్థాయికి చేరి తగ్గుముఖం పట్టింది. సరిహద్దుల్లేని అంతర్జాతీయ వాణిజ్యం, పెట్టుబడులపై ఆధారపడే భావజాలం కూడా బలహీన పడుతోంది. భారత దేశంలో ఉత్పత్తి జరిగి, దాని విలువ ఇతర దేశాలకు వెళ్లి పోయే విధంగా ప్రపంచ సరఫరా గొలుసుల్లో భాగస్వామ్యం పెంచడం అనేది అభివృద్ధికి సరైన వ్యూహం కాదని స్పష్టమవుతోంది. ❞**

**భారత ఆర్థిక విధానాల్లో మార్పు అవసరం**

1990ల నుంచి భారత ఆర్థిక వ్యూహం ప్రపంచీకరణ ధోరణులతో అనుసంధానమైంది. అయితే 1990లలో ప్రారంభమైన సాంకేతిక, ఆర్థిక ప్రపంచీకరణ ఇప్పుడు గరిష్ట స్థాయికి చేరి తగ్గుముఖం పట్టింది. సరిహద్దులు లేని అంతర్జాతీయ వాణిజ్యం, పెట్టుబడులపై ఆధారపడే భావజాలం కూడా బలహీన పడుతోంది. భారతదేశంలో ఉత్పత్తి జరిగి, దాని విలువ ఇతర దేశాలకు వెళ్లిపోయే విధంగా ప్రపంచ సరఫరా గొలుసుల్లో భాగస్వామ్యం పెంచడం అనేది అభివృద్ధికి సరైన వ్యూహం కాదనే విషయం స్పష్టమవుతోంది.

భారత ఆర్థిక వ్యవస్థ తన అభివృద్ధికి తానే ప్రధాన శక్తిగా మారగలదు. భారతదేశ విధాన నిర్మాతలు 1990లలో వదిలేసిన కఠినమైన మార్గాన్ని తిరిగి ఎంచుకుని, దేశీయ పారిశ్రామిక పునాదులను బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. ప్రపంచంలోకెల్లా అత్యధిక ఉపాధి సామర్థ్యం కలిగిన మానవ వనరులు భారతదేశంలో ఉన్నాయి. వారికి సరైన ఆదాయం లభిస్తే ప్రపంచంలోనే అతిపెద్ద మార్కెట్‌గా మారగలదు.

**మనమెందుకు వెనుకపడ్డాం?**

1980వ దశకంలో భారత దేశం పారిశ్రామికోత్పత్తిలో చైనా కన్నా వెనుకబడి లేదు. ఇంకా చెప్పాలంటే కొన్ని రంగాల్లో మనమే ముందున్నాం. భారత పరిశ్రమలకు డిజైనింగ్, అభివృద్ధి, ఉత్పత్తి, అమ్మకం సామర్థ్యాలుండేవి. ట్రక్కులు, బస్‌లు వంటి సంక్లిష్టమైన ఉత్పత్తులను డజన్ల కొద్దీ దేశాలకు ఎగుమతి చేసేది. ఇదంతా 1991కి ముందు మాట. సరళీకరణ విధానాలకు ముందు భారత్ అభివృద్ధి వేగంగా సాగింది.

అందువల్ల మనం ఇప్పుడు ఒక కఠినమైన ప్రశ్న వేసుకోవాలి. అప్పుడు భారత దేశానికి అంత మంచి పారిశ్రామిక సామర్థ్యం ఉండగా ఆ తరువాతి కాలంలో చైనా మనను మించి చాలా దూరం ఎలా వెళ్లిపోయింది? ఇక్కడ భారతీయులు నిర్మించగలరా లేదా అన్నది

## మోడీకి త్యాగాలు కావాలి, ఆర్థిక వ్యవస్థకు జవాబులు కావాలి



**మిథాలి ముఖర్జీ**

**(రచయిత రాజకీయ-ఆర్థిక జర్నలిస్టు. అనేక మీడియా సంస్థల్లో రెండు దశాబ్దాలుగా పనిచేసిన అనుభవం ఉంది. ప్రస్తుతం ఆమె ఆక్స్‌ఫర్డ్ విశ్వ విద్యాలయం లోని రాయిటర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ జర్నలిజంలో ప్రోగ్రామ్స్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు.)**

భారత దేశంలో స్టాండప్ కమేడియన్లకు పండగొచ్చింది. భారత పౌరులు బంగారం కొనొద్దనీ, విదేశీ ప్రయాణాలు చేయొద్దనీ, చివరికి కార్యాలయాలకు కూడా వెళ్లకుండా ఇంటినుండే పనిచేయాలనీ ప్రధాన నరేంద్ర మోడీ ఇటీవల చేసిన ప్రసంగం చాలా సంవత్సరాల తరువాత భారతీయ కమేడియన్లకు మంచి మేత అందించింది. ఒక రకంగా చెప్పాలంటే ప్రధాని ప్రకటనలు పొదుపు చర్యలపై అర్థవంతమైన చర్చకు కాకుండా అపహాస్యపు వ్యాఖ్యానాల్లో చోటు సంపాదించుకున్నాయి.

వంటనూనెలు తగ్గించుకోవాలి, ఇంటినుండి పనిచేయాలి, స్వదేశీ వస్తువులే కొనాలి అని ప్రధాని చెప్పిన పనులకు తోడు భారతీయ పౌరులు మరికొన్ని పనులు కూడా చేయాల్సి ఉంటుంది.

వాటిలో మొదటిది.. ఇదంతా పౌరులు ఎందుకు చేయాలి అని ప్రశ్నించాలి. భారత దేశం నుండి ప్రమాదకరంగా డబ్బు పారిపోవడం వల్ల, మన చమురు అవసరాలన్నిటికీ దిగుమతుల మీదనే ఆధారపడ్డం వల్ల, దేశంలో ప్రజలకు ఉద్యోగాలు లేకపోవడం వల్ల అని సమాధానం వస్తుంది.

మొదటి విషయం, విదేశీ మదుపు దారులు ఈ ఏడాది సుమారు 2,000 కోట్ల డాలర్ల పెట్టుబడులు అమ్మేశారు. మార్చి నెలలో విదేశీ సంస్థాగత మదుపు దారులు దాదాపు ప్రతిరోజూ తమ స్టాక్స్ అమ్మేస్తూ వచ్చారు. వారికి భారతీయ ఈక్విటీ మీద నమ్మకం పోయిందన్నదానికి ఇది స్పష్టమైన నిదర్శనం. ఇదంతా చపలచిత్తమైన డబ్బు అనీ, భయంతో పారిపోతోందనీ కొందరు సమర్థించవచ్చు. మరయితే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి మాటేమిటి? దాని పరిస్థితి కూడా ఏమీ బాగాలేదు. భారత దేశంలోకి వస్తున్న ప్రపంచ పెట్టుబడులు ప్రధానంగా సర్వీసు రంగంలోకి వస్తున్నాయనీ, వస్తూత్పత్తి, డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రంగంలోకి కొద్ది మొత్తం మాత్రమే వస్తున్నదనీ ప్రపంచ బ్రోకరేజి సంస్థ మోర్గన్ స్టాన్లే వెల్లడించింది.

దానికి విరుద్ధంగా బయటకు వెళ్లిపోతున్న పెట్టుబడులు అన్ని రంగాల నుండి

**“ కాంగ్రెస్, బీజేపీ రాజకీయంగా ప్రత్యర్థులే అయినప్పటికీ 2004-14 వరకు కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ పదేళ్ల పాలనలోనూ, 2014-24 వరకు బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ పాలనలోనూ భారత ఆర్థిక విధానాల సిద్ధాంతంలో పెద్దగా మార్పు లేదు. అంతర్జాతీయ వాణిజ్యాన్ని విస్తరించడం, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆకర్షించడం, దేశీయ పారిశ్రామిక పునాదులు బలోపేతం చేయడానికి విదేశీ సంస్థల నుంచి సాంకేతిక పరిజ్ఞానం బదిలీ చేయాలనే షరతులను బలహీనపరచడం కొనసాగాయి. ”**

సమస్య కాదు. మనకా సామర్థ్యం ఉందని మనం నిరూపించుకున్నాం. అందువల్ల ఇక్కడ సమస్య ఏమంటే మన వ్యవస్థ అటువంటి సామర్థ్యాలను పెద్ద ఎత్తున ఆర్థిక వ్యవస్థలోని అన్ని రంగాల్లో లోతుగా కొనసాగించగలదా అని. పారిశ్రామిక సామర్థ్యం కేవలం నైపుణ్యాలతోనే రాదు. అది సంస్థలచేత, వైజ్ఞానిక వ్యవస్థలచేత, ఓర్పుతో కూడిన జాతీయ లక్ష్యాలచేత నిర్మించబడుతుంది.

### చైనా నుంచి పాఠాలు

కాంగ్రెస్, బీజేపీ రాజకీయంగా ప్రత్యర్థులే అయినప్పటికీ 2004–2014 వరకు కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ పదేళ్ల పాలనలోనూ, 2014–2024 వరకు బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ పాలనలోనూ భారత ఆర్థిక విధానాల సిద్ధాంతంలో పెద్దగా మార్పులేదు. అంతర్జాతీయ వాణిజ్యాన్ని విస్తరించడం, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆకర్షించడం, దేశీయ పారిశ్రామిక పునాదులు బలోపేతం చేయడానికి విదేశీ సంస్థల నుంచి సాంకేతిక పరిజ్ఞానం బదిలీ చేయాలనే షరతులను తగ్గించడం వంటి విధానాలు కొనసాగాయి.

1991లో సోవియట్ కూలిపోయినప్పుడు చైనా భయపడలేదు. అది తన ‘సామ్యవాద’ బాటలోనే సాగింది. చైనా తన దేశీయ పరిశ్రమలను అభివృద్ధి చేసింది. ఆర్థిక నియంత్రణ వ్యవస్థలను ప్రభుత్వ ఆధీనంలోనే ఉంచుకుంది. ప్రభుత్వ నియంత్రిత ఆర్థిక వ్యవస్థ, బలమైన ప్రభుత్వ రంగం, కృత్రిమ మేధస్సు (ఏఐ), అరుదైన ఖనిజాల ప్రాసెసింగ్ వంటి వ్యూహాత్మక రంగాల్లో పరిశ్రమలను నిర్మించే పారిశ్రామిక విధానాలు, ప్రపంచంలోనే అతిపెద్ద పునరుత్పాదక ఇంధన పరిశ్రమను నిర్మించడం వంటి చర్యల ద్వారా చైనా ముందడుగు వేసింది. వ్యూహాత్మక రంగాలను అభివృద్ధి చేసుకుంది. మొత్తంగా చైనా తన సోషలిస్టు వ్యవస్థను నిలబెట్టుకుంది. డెంగ్ జియావోపింగ్ దీనిని “చైనా ప్రత్యేక లక్షణాలతో కూడిన సోషలిజం”గా అభివర్ణించారు.

చరిత్ర ముందుకు సాగిపోయింది. భారతదేశ విధాన నిర్మాతలు, ఆర్థికవేత్తలు కూడా ముందుకు కదలాలి. భారత ఆర్థిక విధానాల మార్పు కోసం రాజకీయ నాయకులు ప్రయత్నిస్తుంటే, పాత సిద్ధాంతాలకు అలవాటు పడిన ఆర్థికవేత్తలు మాత్రం భారతదేశం ప్రపంచీకరణ నుంచి వెనక్కి వెళ్లి, సోషలిజం వైపు వెళ్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రపంచ ఆర్థిక, రాజకీయ, సామాజిక వాస్తవాలను పరిగణనలోకి తీసుకుని తమ సిద్ధాంతాలను పునఃసమీక్షించుకోవాలి. చరిత్రతో పాటు తాము కూడా ముందుకు సాగాలి.

**(అనువాదం : కె. హరికిషోర్)**

---

పారిపోతున్నాయి. భారతీయ సంస్థలు రాను రాను భారత దేశంలో పెట్టుబడులు తగ్గించేసి విదేశాల్లో విస్తరిస్తున్నాయి. ఇంక రూపాయి పతనానికి సంబంధించిన విషాధ గాథ గురించి ఎంతైనా చెప్పవచ్చు. ఇదంతా బయటి ప్రపంచపు ప్రభావం వల్ల జరుగుతోందని బిజెపి ప్రభు త్వం సమర్థించుకుంటోంది. కానీ వాస్తవం ఏమంటే రూపాయి పతనానికి భారత ఆర్థిక వ్యవస్థలో ఏర్పడిన అఖాతం కారణం. విదేశీ ఈక్విటీ పెట్టుబడులు మరింతగా దేశంలోకి వస్తే సరి లేకుంటే దేశ ఆర్థికం ప్రమాదంలో పడిపోయే పరిస్థితిలోకి మన ఆర్థిక వ్యవస్థ వెళ్లిపోయింది.

దేశం తరువాత చేయాల్సిన పనేంటి? ప్రధాన మంత్రి ప్రకటించిన పొదుపు చర్యలు ఏం సాధిస్తాయి? పౌరులు సాధ్యమైనంత వరకు ఇంటి నుండి పనిచేయాలి అన్న దానికి అర్థమేమిటి? ఎన్నాళ్లలా పనిచేయాలి? ఒక ఏడాదా? రెండేళ్లా? లేక ఒక దశాబ్దం పాటా? అలా చేస్తే సంస్థలు ఆఫీసు స్థలాల్ని ఏం చేస్తాయి? ఆఫీసుల్లో లైట్లు వేయకపోవచ్చు కానీ నెలనెలా అద్దె కట్టాలి కదా! చూశారా ప్రధాన మంత్రి వంట గదిలో వంట నూనెల దగ్గర నుండి ఎంత శ్రద్ధ తీసుకుంటున్నారో అని ఇటీవల ఒక వార్తా పత్రికలో వ్యాఖ్యాత రాయగా, మరో వార్తపత్రికలో ప్రధానిగారు చెప్పింది చేస్తే, వేపుడు కూరలు తినడం మానేస్తే వచ్చే ఆరోగ్య ప్రయోజనాల గురించి రాసింది.

“కొవ్వు తగ్గించుకుని ఫిట్‌నెస్ పెంచుకుంటే” ఆర్థిక సంక్షోభం ఆగిపోతుందనుకుంటే మనందరం రోజూ జాగింగ్ చేస్తే దేశ ఆర్థిక పురోగమనం ఉరకలుపరుగులు పెట్టేది కదా! గత ఏడాదే ఆహారం, పాల ఉత్పత్తులు, వంటనూనెల ధరలు మండిపోయి భారతీయులు అధిక ద్రవ్యోల్బణాన్ని ఎదుర్కొన్న విషయం బహుశా ఈ రచయితలకు గుర్తుండే ఉంటుంది. అంటే మన ప్రజలు కావాలనే కూరల్లో వంటనూనెలు వలకబోస్తున్నారనా, లేక అవసరం లేకున్నా ఇంటిలోకి వస్తువులు అధికంగా కొనేస్తున్నారనా? ఇలా చేయడానికి మన పౌరులు అంత తెలివి తక్కువ వాళ్లేం కాదు. పైగా గత 12 సంవత్సరాలుగా దేశంలో పెరిగిపోయిన ఆర్థిక అసమానతలు వాళ్ల దగ్గర అసలు వస్తువులు కొనే శక్తే లేకండా చేశాయి.


ఇంక చివరిగా, “ఎలా” అనే ప్రశ్న మిగిలే ఉంది. నిరుద్యోగం, దిగజారిపోతున్న ఆర్థిక వ్యవస్థ, ధనికులకూ పేదలకూ మధ్య పెరిగిపోతున్న ఆర్థిక తారతమ్యాలు, పూర్తిగా ఆగిపోయిన ప్రయివేటు పెట్టుబడులు, కార్పొరేట్ రేట్ సంపదపై కొద్దిమంది గుత్తాధికారం, ఆ కొద్దిమంది మాత్రమే వ్యాపార సామ్రాజ్యాలు కలిగి ఉండడం, గ్రామీణ పట్టణ పేదలకు కనీస మద్దతిచ్చే పథకాలను ఒక పద్ధతి ప్రకారం నిర్వీర్యం చేయడం.... ఇవన్నీ జరుగుతున్నా వీటిని పట్టించుకోని ఆర్థిక శాఖ ఉన్నప్పుడు మనం ఈ సంక్షోభం నుండి ఎలా బయటపడగలం?

### ప్రపంచానికి సంక్షోభం కొత్త కాదు

బిజెపీకి చరిత్ర అంటే ఎన్నికలప్పుడు అవసరాన్ని బట్టి ఇష్టం వచ్చినట్లు మార్చుకోగల అంశం. గత దశాబ్దంలోనే కరోనా సంక్షోభం, పశ్చిమాసియా యుద్ధ సంక్షోభాలను చవి చూసింది. కానీ మీరు నమ్మినా నమ్మకపోయినా భారద దేశం చరిత్రలో అనేక ఆర్థిక, రాజకీయ

**(మిగతా 22వ పేజీలో)**

# సంక్షుభిత సమయంలో ప్రజలను ఆదుకునే సాధనం ఎర్ర జెండా మాత్రమే



రచయిత సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి

ఎంఎ బేబీ

ఇటీవల జరిగిన శాసన సభ ఎన్నికల ఫలితాలు భారత రాజకీయ యవనికపై జరుగుతున్న అనేక మథనాలను సూచిస్తున్నాయి. అందులో మొదటిది, కేరళలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించి చారిత్రాత్మక చొరవ తీసుకున్నప్పటికీ సిపిఐ(ఎం) నేతృత్వం లోని ఎల్‌డిఎఫ్ ఓడిపోవడం పట్ల మనం తీవ్రమైన అందర్మథనం చేసుకోవాలి. రెండవది, పశ్చిమ బెంగాల్‌లో బిజెపి విజయం, అస్సాంలో అది తిరిగి గెలవడం, పాండిచెరిలో ఎన్డీఏ అధికారం నిలుపుకోవడం..ఇవన్నీ బిజెపి ఎన్నికల బల సమీకరణను సూచిస్తున్నాయి. మూడవది, తమిళనాడులో టివికె వంటి కొత్త పార్టీ ఎన్నికల విజయంతో ముందుకురా వడం అనేది సానుకూల మార్పుపట్ల ప్రజలు ఆతృతగానూ, ఆశావహంగానూ ఉన్నారని సూచిస్తోంది.

### కేరళ

కేరళకు సంబంధించినంతవరకు గత ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం ప్రజలకు తన ఎన్నికల ప్రణాళికలో చేసిన వాగ్దానాలన్నిటినీ నెరవేర్చింది. కటిక పేదరికాన్ని నిర్మూలించడం, సామాజిక భద్రత ఫించన్లను అందరికీ వర్తింపజేయడం మొదలైన విజయాలద్వారా అది సాంఘిక సంక్షేమం విషయంలో మొత్తం దేశానికే ఆదర్శంగా నిలిచింది. కేంద్ర ప్రభుత్వం ఆర్థికంగా, పరిపాలనా పరంగా అనేక అడ్డంకులు సృష్టించినప్పటికీ రాష్ట్రం వ్యవసాయ రంగం లోనూ, పారిశ్రామిక రంగంలోనూ, ప్రాథమిక సదుపాయాల అభివృద్ధిలోనూ గొప్ప ముందడుగు వేసింది. ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం కింద కేరళ మన దేశ ఫెడరల్ లక్షణాలను కాపాడే పోరాటంలో భారత దేశంలోని రాష్ట్రాలన్నిటిలో మొనగాడిగా మారింది. గత పదేళ్లలో దేశంలో ఒక్క మతపరమైన ఘర్షణ కూడా తలెత్తని రాష్ట్రంగా కేరళ గణితికెక్కింది. ఇన్ని విజయాలున్నప్పటికీ పదేళ్ల పరిపాలన తరువాత ఎల్‌డిఎఫ్ ఓడిపోయింది.

అంతేకాకుండా బిజెపి చరిత్రలో మొదటిసారి కేరళ అసెంబ్లీలో మూడు స్థానాలు గెలుచుకోగలిగింది. ఇది చాలా ప్రమాదకరమైన పరిణామం. దీన్ని అరికట్టడానికి పార్టీ చాలా కష్టపడి పనిచేయాల్సి ఉంటుంది. అయితే, కాంగ్రెస్ పార్టీ వంచనాపూరిత ప్రవర్తనతో మతతత్వ శక్తులపట్ల మెతకగా వ్యవహరించడం కూడా కేరళలో బిజెపి ఎదుగుదలకు కారణమైంది. దీన్ని కూడా ఎండగట్టాల్సిన అవసరం ఉంది.

ఈ ఎన్నికల్లో సిపిఐ(ఎం), ఎల్‌డిఎఫ్‌లకు తగిలిన ఎదురు దెబ్బ గతంలో ఎన్నడూ ఎరగనిది. అయిదు జిల్లాల్లో ఎల్‌డిఎఫ్‌కు అసెంబ్లీలో ప్రాతినిధ్యమే లేకుండా పోయింది. అయితే, 1977లో మొత్తం దేశ ప్రజలు కాంగ్రెస్‌కూ, ఎమర్జెన్సీలో అది చేసిన అరాచకాలకు వ్యతిరేకంగా ఓటు చేసినప్పుడు కేరళ ప్రజలు మాత్రం కాంగ్రెస్ నాయకత్వం లోని సంఘటనను తిరిగి ఎన్నుకున్నారు. అప్పుడు సిపిఐ(ఎం) నాయకత్వంలోని ప్రతిపక్షానికి అసెంబ్లీలో 30 స్థానాలు మాత్రమే వచ్చాయి. లోభ ఎన్నికల్లో మనం కనీసం ఒక్క స్థానం కూడా గెలవలేదు. అయితే 1980లో మనం తిరిగి అధికారంలోకి వచ్చాము.

పార్టీ సానుభూతిపరులు, ఎల్‌డిఎఫ్ మద్దతుదారుల్లో కొంతమంది మనకు ఎందుకు ఓటు వేయలేదో తెలుసుకోడానికి రాష్ట్రంలోని సుమారు 5 లక్షల మంది సిపిఐ(ఎం) సభ్యుల్లో ప్రతి ఒక్కరినీ కలిసి, 35,000 శాఖలు, స్థానిక కమిటీలు, ఏరియా కమిటీలు, జిల్లా కమిటీలను సమావేశపరిచి లోతుగా చర్చించేందుకు పార్టీ కేరళ రాష్ట్ర కమిటీ ఒక సంస్థాగతమైన ప్రణాళిక సిద్ధం చేసింది. మొత్తం పార్టీ సభ్యుల్లోనూ, మన సానుభూతిపరుల్లోనూ స్వేచ్ఛాయుతమైన, నిర్మొహమాటమైన చర్చలు జరపడం ద్వారా తప్పులు సరిదిద్దుకునే మార్గాన్ని మనం ప్రతిపాదించడం జరుగుతుంది. మన లోటుపాట్లపై పైనుండి కింది వరకు విమర్శ, ఆత్మవిమర్శ చేసుకోవాలనుకుంటున్నాం. అన్ని స్థాయిల్లో తప్పులు దిద్దుకోవడం జరుగుతుంది.

### అస్సాం, పాండిచెరి, పశ్చిమ బెంగాల్

అస్సాం, పాండిచెరి, పశ్చిమ బెంగాల్‌లో బిజెపి విజయాలు హిందూత్వ–మతతత్వ, మితవాద శక్తుల ఎదుగుదలను సూచిస్తోంది. ఇది లౌకిక, పురోగామి, ప్రజాతంత్ర శక్తులకు తీవ్రంగా ఆందోళన కలిగించే విషయం. పశ్చిమ బెంగాల్‌లో అవినీతికర టిఎంసి ప్రభుత్వంపై ప్రజల అసంతృప్తితో పాటు కేంద్ర ప్రభుత్వ సంస్థలను దుర్వినియోగం చేయడం, భారత ఎన్నికల సంఘం (ఇసిఐ) కుతంత్రాల వల్ల, 'సర్' కార్యక్రమాల వల్ల బిజెపి లాభం పొందింది. అస్సాం, పశ్చిమ బెంగాల్‌లో మతపరమైన, విచ్ఛిన్నకర, విద్వేష ప్రచారంతో బిజెపి విజయం సాధించింది. రెండు రాష్ట్రాల్లో పెద్ద మొత్తంలో డబ్బు కూడా ఖర్చు చేశారు. రెండు రాష్ట్రాల్లో మనం మన ఓటింగు శాతాన్ని నిలుపుకున్నాం. పశ్చిమ బెంగాల్‌లో మనం ఒక స్థానాన్ని గెలుచుకున్నాం. ఆ విధంగా పశ్చిమ బెంగాల్ అసెంబ్లీలో కార్మిక హక్కులు, లౌకిక తత్వం, ఫెడరలిజం కోసం సిపిఐ(ఎం) గళం వినిపిస్తుందన్నమాట.

### తమిళనాడు

తమిళనాడులో సిపిఐ(ఎం) నేతృత్వంలో వామపక్ష పార్టీలు సమయానుకూలంగా జోక్యం చేసుకోవడం వల్ల ప్రజా తీర్పును వమ్ము చేసేందుకు బిజెపి చేసిన ప్రయత్నం విఫలమైంది. ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో గవర్నర్లు బిజెపి–ఆర్ఎస్ఎస్ రాజకీయ ఏజెంట్లుగా పనిచేస్తున్న సంగతి మనకు తెలుసు. తమిళనాడులో కూడా ఎన్నికల ఫలితాలు ప్రకటించిన వెంటనే పరిస్థితి అలాగే తయారైంది. బిజెపితో జతకట్టి ఎన్నికల్లో పోటీచేసిన అన్నా డిఎంకె నాయకత్వంలో ఒక అవకాశవాద

**"ప్రజల జీవితాలు, జీవన ప్రమాణాలు దెబ్బతింటున్న ఈ సంక్షుభిత సమయంలో ప్రజలను ఆదుకునే సాధనం ఎర్రజెండా మాత్రమే. ఇటీవల జరిగిన శాసన సభ ఎన్నికల్లో ప్రజలిచ్చిన సంకేతాల ఆధారంగా మనం ప్రజా సమస్యలను మరింత ఉధృతంగా చేపట్టాలి. ఈ సవాళ్లన్నిటి మధ్య పార్టీ పురోగమించే విధంగా మనం దిద్దుబాటు చర్యలు తీసుకోవాలి."**

సంఘటనను రూపొందించి ఆర్‌ఎస్‌ఎస్ అనుకూల ప్రభుత్వాన్ని గద్దెనెక్కించాలన్న ప్రయత్నాలు కూడా జరిగాయి. అసెంబ్లీలో అతి పెద్ద పార్టీగా అవతరించిన పార్టీ నాయకుడు గవర్నర్‌ను అనేక సార్లు కలిసినప్పటికీ అతని చేత ప్రమాణం స్వీకారం చేయించడానికి గవర్నర్ ఇష్టపడక పోవడం ఈ నేపథ్యంలోనే చూడాలి. అందువల్ల బిజెపి ఒక భాగంగా ఉన్న ఏ కూటమికూడా అధికారంలోకి రాకుండా చూడ్డం, లేక నేరుగా బిజెపి చేతిలోకి రాష్ట్ర పాలనా పగ్గాలు వెళ్లే రాష్ట్రపతి పాలన విధించకుండా చూడ్డం సిపిఐ(ఎం) బాధ్యతగా మారింది.

### పొదుపు చర్యలు

ఎన్నికల ఫలితాలు ప్రకటించిన వెంటనే ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పొదుపు చర్యలు ప్రకటించారు. భారత ఆర్థిక వ్యవస్థ స్థిరంగా ఉందనీ, భద్రంగా ఉందనీ పదేపదే బిజెపి ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలన్నీ డొల్లేనని ప్రధాని ప్రకటన రుజువు చేసింది. ప్రధానంగా పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఘర్షణ వల్ల, మొత్తం ప్రపంచ ఆర్థికవ్యవస్థపై దాని పర్యవసానాల వల్ల మన దేశం ఆర్థిక మాంద్యంవైపుకు ప్రయాణిస్తున్నదని ఆర్థిక పరిణామాలు తెలియజేస్తున్నాయి. బిజెపి ప్రభుత్వం వినియోగం తగ్గించుకోండి, పొదుపు పాటించండి అని చెబుతూ యుద్ధ భారాలను సామాన్య ప్రజలపై వేయడానికి బదులు, అమెరికా దురాక్రమణ ఆపాలనీ, హార్ముజ్ జలసంధి ద్వారా నౌకలు యధేచ్ఛగా తిరిగేట్లు చూడాలనీ వర్ధమాన దేశాలతో కలిసి డిమాండ్ చేయడం అవసరం. కేంద్ర ప్రభుత్వం వ్యూహాత్మక దూరదృష్టితో చమురు దిగుమతులను వికేంద్రీకరించి ఉంటే నేడు దేశానికి ఈ గతి పట్టేది కాదు.

వచ్చే నెల వ్యవసాయ సీజన్ ప్రారంభం కానుంది. రైతులకు సమయానికి ఎరువులు అందించడం అత్యవసరం. ఎరువుల సరఫరాలో ఏ మాత్రం అంతరాయం కలిగినా ఆహారో త్పత్తిపై తీవ్ర ప్రభావం పడుతుంది. దాని వల్ల దేశంలోని కోట్లాది మంది ప్రజల జీవన పరిస్థితులు దెబ్బతింటాయి, భారత దేశ ఆర్థిక వ్యవస్థకు కూడా దెబ్బ తగులుతుంది. ఎరువుల సరఫరా అందుబాటులో ఉంచడం, ఆలస్యం లేకుండా వాటిని రైతులకు అందించడం కేంద్ర ప్రభుత్వ బాధ్యత. కానీ ఏ అమెరికా–ఇజ్రాయిల్ కూటమి అయితే ఇరాన్‌పై దురాక్రమణకు పాల్పడి భారత దేశానికి ఈ ఆర్థిక తిప్పలు తీసుకొచ్చిందో ఆ అమెరికా–ఇజ్రాయిల్ కూటమితో పూర్తిగా జతకట్టడం ద్వారా మోడీ ప్రభుత్వం దేశ ఆర్థిక ప్రయోజనాలు కాపాడ్డంలో పూర్తిగా విఫలమైంది. ఎన్నికల్లో గెలుపు కోసం బిజెపి నాయకత్వం ఎన్నికల ప్రచారంలో ఈ ఆర్థిక ఇబ్బందులను కప్పిపెట్టడం దేశాన్ని తప్పుతోవపట్టించడం, మోసం చేయడమే.

### కార్మిక కోడ్‌లు

ఎన్నికల ఫలితాలు వెలువడి నాలుగు రోజులు గడవక ముందే కేంద్ర నియమావళి ద్వారా కార్మిక కోడ్‌లను అమలు చేయడానికి బిజెపి నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఉపక్రమించడం దాని మోసపూరిత వైఖరిని మరోసారి బహిరంగపరిచింది. ప్రభుత్వం 2026 ఏప్రిల్ 1 నుండి కార్మిక కోడ్‌లను అమలు చేయాల్సి ఉండగా, శాసన సభ ఎన్నికలు జరిగేంతవరకు అది కావాలనే వాటి అమలును వాయిదా వేసింది. న్యాయమైన కనీస వేతనాలు అమలు చేయాలనీ, మానవీయమైన పనిగంటలు, గౌరవ ప్రదమైన జీవన పరిస్థితులు ఉండాలనీ కార్మికులు చేసిన విస్తారమైన పోరాటాలనూ, ఆందోళనలనూ పట్టించుకో కుండా ప్రభుత్వం ఈ కార్మిక కోడ్‌ల అమలుకు పూనుకున్నది. ఇది బిజెపి కార్మిక వ్యతిరేక వైఖరిని మరోసారి లోకానికి చాటి చెప్పింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాలు కొత్తగా నోటీపై చేసిన కేంద్ర నిబంధనల ప్రకారం లేబర్ కోడ్‌లను ఉన్నవి ఉన్నట్లు అమలు చేయకుండా, రాజ్యాంగం తమకు ఇచ్చిన శాసనపరమైన అధికారాలను ఉపయోగించుకుని వాటికి తగిన సవరణలు చేయాలనీ, కార్మికుల హక్కులు కాపాడాలనీ సిపిఐ(ఎం) రాష్ట్ర ప్రభుత్వాలను కోరుతున్నది.

గత రెండు మాసాలుగా జాతీయ రాజధాని ప్రాంతం (ఎన్‌సిఆర్)లో వెల్లువలా మిలిటెంట్, స్పాంటేనియస్ కార్మికవర్గ ఆందోళనలు జరుగుతున్నాయి. కాంట్రాక్టు కార్మికులు, వలస కార్మికులు, అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికులు ముందుండి ఈ నిరసన ఆందోళనలను నిర్వహిస్తున్నారు. వీరిలో చాలా మంది ఇటీవలే పనుల్లో చేరిన యువ కార్మికులు. దాదాపు అన్ని సందర్భాల్లోనూ ఈ ఆందోళనలు పాతుకుపోయి ఉన్న ట్రేడ్ యూనియన్ల నాయకత్వం లేకుండానే జరుగుతున్నాయి. వీటిపై రాజ్యం అణచివేతకు దిగింది. వందలాది మంది కార్మికులను అరెస్టు చేసింది. వారిలో చాలా మందిని నిర్బంధంలో ఉంచింది. అయితే నిరసన ప్రదర్శనల విస్తృతీ, ప్రదర్శన కారుల పట్టుదల, వాటితోపాటు దేశవ్యాపితంగా ఇవి ప్రజల దృష్టిని ఆకర్షించడంతో ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు కనీస వేతనాలను ప్రకటించాల్సి వచ్చింది. అయితే ఈ వేతనాల పెంపు ఏమాత్రం చాలదు.

ప్రజల జీవితాలు, జీవన ప్రమాణాలు దెబ్బతింటున్న ఈ సంక్షుభిత సమయంలో ప్రజలను ఆదుకునే సాధనం ఎర్ర జెండా మాత్రమే. ఇటీవల జరిగిన శాసన సభ ఎన్నికల్లో ప్రజలిచ్చిన సంకేతాల ఆధారంగా మనం ప్రజా సమస్యలను మరింత ఉధృతంగా చేపట్టాలి. ఈ సవాళ్లన్నిటి మధ్య పార్టీ పురోగమించే విధంగా మనం దిద్దుబాటు చర్యలు తీసుకోవాలి.

*

## 'మార్క్సిస్టు' పై మీ అభిప్రాయాలు తెలపండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!


**ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి ,**

**పిన్ : 522501, గుంటూరు జిల్లా. సెల్: 9490098977**

ఈ మాసం ప్రత్యేకం

# నీట్ సంక్షోభం

## భారతీయ విద్యా వ్యవస్థ అధోగతికి దర్పణం




వివాదాలకు కేంద్రంగా మారిన నేషనల్ ఎలిజిబిలిటి అండ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్) ప్రశ్నాపత్రం లీక్ కావటంతో అభ్యర్థులు తీవ్ర ఆందోళన చెందారు. మే నెల 3వ తేదీన ఈ పరీక్ష నిర్వహించిన కేంద్ర సంస్థ నేషనల్ టెస్టింగ్ ఏజన్సి (ఎన్‌టిఏ) పేపర్ లీక్ సంక్షోభంతో ఈ పరీక్షను రద్దుచేసింది. మరుసటి వారంలో తిరిగి పరీక్షను నిర్వహిస్తామని ఎన్‌టిఏ ప్రకటించింది.

3వ తేదీన పరీక్ష రాసిన శర్మ అనే అభ్యర్థి ఇది తనను షాక్‌కు గురిచేసిందని చెప్పాడు. అక్టోబరు నుండి తాను టివి చూడటం, స్నేహితులతో కలవటాలను కూడా పక్కన పెట్టి, రోజుకు 12 గంటల చొప్పున పరీక్షల కోసం చదివినట్లు చెప్పాడు. తద్వారా దేశంలోని మంచి మెడికల్ కాలేజిలలోని ఒకదానిలో సీటు సంపాదించుకోగలనని అతను భావించాడు. కోచింగ్ సెంటర్లు విడుదల చేసిన అనధికారిక సమాధాన పత్రాల ప్రాతిపదికగా పరీక్ష పేపరులో నిర్దేశించిన 720 కి 615 మార్కులు సాధించగలననే విశ్వాసంతో అతను ఉన్నాడు.

మే నెల 3వ తేదీన జరిగిన నీట్ పరీక్షలలో దేశవ్యాపితంగా 22.8 లక్షల మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఎన్‌టిఏ పరీక్షను రద్దుచేయటంతో వారంతా తీవ్రమైన విచారంలో మునిగిపోయారు. ప్రభుత్వ, కొన్ని పేరున్న ప్రైవేటు వైద్య కళాశాలలలో పరిమితంగా ఉన్న అండర్ గ్రాడ్యుయేట్ మెడికల్ సీట్లకోసం లక్షలాది మంది మధ్య తీవ్ర పోటి ఉన్నది.

**2026 నీట్ యుజి పరీక్షలో అక్రమాలు**

2026 నీట్ పరీక్ష రద్దుకు దారితీసిన ఆరోపణలపై సిబిఐ విచారణ ప్రారంభించింది. పేపర్ లీక్‌ను మొదటగా సికార్‌కు చెందిన ఒక లెక్చరర్ వెల్లడించాడు. తద్వారా ఈ అంశం విచారణ సంస్థల దృష్టికి వచ్చింది. ఈ అక్రమాన్ని వెలుగులోకి తెచ్చిన కెమిస్ట్రీ ఉపాధ్యాయుడు మే 3వ తేది నుండి జాతీయ స్థాయిలో సంచలనం కలిగించిన సంఘటనల వరకు జరిగిన క్రమాన్ని వివరించాడు. మే 3వ తేదీన పరీక్ష పూర్తి అయిన తర్వాత సాయంత్రం 5 గంటల సమయంలో ప్రశ్నా పత్రాన్ని పరిశీలిస్తుండగా, వాట్సయాప్ గ్రూపులలో ప్రచారంలో ఉన్న ఒక ప్రశ్నాపత్రాన్ని సంస్థ యజమాని అతనికి చూపించాడు. అసలైన క్వశ్చన్ పేపరుతో దానిని పోల్చిచూసినపుడు రెండింటిలోనూ 45 కెమిస్ట్రీ ప్రశ్నలు యధాతధంగా ఉన్నాయి. తర్వాత ఆయన ఆ పేపరును తన సహచరుడైన బయాలజీ లెక్చరర్‌కు చూపించగా, 90 బయాలజీ ప్రశ్నలు కూడా రెండింటిలోనూ ఒకే విధంగా ఉన్నట్లు స్పష్టమైంది.

ఈ విషయం అత్యంత తీవ్రమైనదని ఆ లెక్చరర్ భావించాడు. తన సహోపాధ్యా యులతో చర్చించిన తర్వాత ఆ రాత్రికే పోలీసులకు ఫిర్యాదు చేయటం కోసం సికార్‌లోని ఉద్యోగ్ నగర్ పోలీస్ స్టేషన్‌కు వెళ్ళాడు. కానీ పోలీసులు కేసు నమోదు చేయటానికి ముందు రాతపూర్వకమైన సాక్ష్యాలు, దానిని బలపరిచే డాక్యుమెంట్లు ఇవ్వాలని అడిగారు. దానితో ఆయన స్క్రీన్ షాట్లు, వైరల్ అవుతున్న పిడిఎఫ్ డాక్యుమెంట్లు, ఇతర సాక్ష్యాలను సమీకరించటం కోసం రెండు రోజులు కేంద్రీకరించాడు. తన సంస్థ యజమాని ప్రోత్సాహంతో మే 6వ తేదీన ఈ మెయిల్ ద్వారా రాతపూర్వక ఫిర్యాదును కేంద్ర హెూం శాఖ, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సికి పంపాడు.

ఫిర్యాదు పంపిన గంటల వ్యవధిలోనే తనకు సీనియర్ ఎన్‌టిఏ, సిబిఐ అధికారుల నుండి ఫోన్‌లు వచ్చాయని ఆయన చెప్పాడు. మే 7వ తేది ఉదయం హెూం మంత్రిత్వ శాఖ నుండి సికార్ వచ్చిన అధికారుల బృందం ఆయన సాక్ష్యాన్ని నమోదు చేసింది. వైరల్ అవుతున్న పేపర్ ఫైల్స్, ఇతర సాక్ష్యాలను ఆయన వారికి అప్పగించాడు. ఆ తర్వాత రాజస్థాన్ స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్, స్థానిక పోలీసు అధికారులు కూడా ఆయనను ప్రశ్నించారు. విచారణ జరుపుతున్న సంస్థలతో సహకరిస్తానని, ఇతరంగా అవసరమైన సాక్ష్యాలను అందజేస్తానని ఆయన వారికి హామి ఇచ్చాడు.

విద్యార్థుల భవిష్యత్‌ను, పారదర్శకతను కాపాడటం కోసం తాను ఈ చర్య తీసుకున్నట్లు ఆయన చెప్పాడు. సకాలంలో ఫిర్యాదు చేయకపోయినట్లైతే ఈ అంశాన్ని మరుగున పడేసేవారని కూడా ఆయన వెల్లడించాడు.

**ఎన్‌టిఏ వైఫల్యం**

ఈ సంవత్సరం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సి వైఫల్యం అత్యంత తీవ్రమైనది. దీనిపై విచారణ జరిపి, భవిష్యత్‌లో ఇటువంటి వైఫల్యాలు సంభవించకుండా తీసుకోవాల్సిన చర్యలను సూచించటం కోసం అంతరిక్ష శాస్త్రవేత్త నేతృత్వంలో ఉన్నతాధికారాలు కలిగిన కమిటిని జాతీయ విద్యామంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసింది. ఆ సంస్థను తీవ్రమైన వివాదాలు చుట్టుముట్టాయి. ఈ పరిణామాలు దేశంలోని ఉన్నత విద్యా సంస్థలలోకి విద్యార్థులు ప్రవేశించటానికి అవసరమైన పరీక్షలను సక్రమంగా నిర్వహించి, అర్హులైన విద్యార్థులకు ఆ సంస్థలలోకి ప్రవేశం కల్పించగల శక్తి ఎన్‌టిఏకు ఉన్నదా అన్న సందేహాన్ని కలిగిస్తున్నాయి. ఇప్పటి వరకు వెలుగు చూసిన అక్రమాలు సముద్రంలో నీటి బొట్టంత మాత్రమే.

**2024లో పరీక్షలో జరిగిన అక్రమాలు**

2024లో ఎంబిబిఎస్, బిడిఎస్, డిఏఎంఎస్, బియుఎంఎస్, బిహెచ్ఎంఎస్ అండర్

> **❝ పరీక్షల నిర్వహణలో ఎన్‌టిఎ వైఫల్యం క్షమించరాని విధంగా ఉంది. అభ్యర్థులు సాధించిన మార్కులు, మెరిట్ లిస్టులు తయారు చేయటంలో గతంలో తప్పులు జరిగాయి. సాంకేతిక లోపాలు, పరీక్షలను వాయిదా వేయటం, తేదీలను రీ షెడ్యూల్ చేయటం తదితరాలు తరచుగా జరుగుతున్నాయి. కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ (సియుఇటి) పరీక్షల నిర్వహణ బాధ్యతను ఎన్‌టిఎ తీసుకున్నప్పటి నుండి తమ తాము సాధించాలనుకున్న లక్ష్యాలకు విఘాతం కలుగుతున్నట్లు అభ్యర్థులు భావిస్తున్నారు. ❞**

గ్రాడ్యుయేట్ కోర్సులలో ప్రవేశానికి జరిగిన నీట్ పరీక్షలో కూడా అవతకవకలు జరిగాయి. అనేకమంది అభ్యర్థులు అసాధారణంగా అత్యధిక మార్కులు (720 కి 720) సాధించారు. అంతకు ముందు సంవత్సరాలలో నీట్ అండర్ గ్రాడ్యుయేట్ పరీక్షలలో ఇద్దరు లేక ముగ్గురు అభ్యర్థులు మాత్రమే పూర్తి మార్కులు 720 సాధిస్తుండగా, ఆ సంవత్సరం 67 మంది అభ్యర్థులు పూర్తి మార్కులు సాధించారు. దేశంలో కెల్లా అత్యంత తీవ్రమైన పోటీ నెలకొన్న ప్రవేశ పరీక్షలలో పూర్తి మార్కులు సాధించటం అరుదుగా జరుగుతుంది. 1.25 లక్షల కన్నా కొంచెం ఎక్కువగా ఉన్న సీట్లకోసం పరీక్షలు రాయడానికి 24 లక్షల మంది అభ్యర్థులు ఆ సంవత్సరం తమ పేర్లను నమోదు చేసుకున్నారు.

పూర్తి మార్కులు సాధించిన వారిలో కొందరు ఒకే కోచింగ్ సెంటర్ నుండి పాల్గొన్నారని, కొందరు తాము నివసిస్తున్న ప్రాంతానికి కొన్ని వేల కిలోమీటర్ల దూరం నుండి ఈ కోచింగ్ సెంటర్లలో చేరారని వెల్లడి కావటంతో దీనిపై సందేహాలు మరింతగా బలపడ్డాయి. కొన్ని సెంటర్లలో పరీక్ష ఆలస్యంగా ప్రారంభమైందని, తప్పు దొర్లిన ప్రశ్నలకు సమాధానాలు రాయటంలో వెచ్చించిన సమయానికి పరిహారం పేరుతో ఎన్‌టిఎ 1,567 మంది అభ్యర్థులకు గ్రేస్ మార్కులు ఇచ్చింది. వారికిచ్చిన గ్రేస్ మార్కుల వల్లనే 67 మందిలో 44 మంది పూర్తి మార్కులు సాధించటం ఆసక్తికరమైన విషయం. ఇటువంటి లోపాలు జరిగిన సమయంలో వాటిని పరిహరించటం కోసం ఈ విధంగా మార్కులు ఇవ్వవచ్చునని కామన్ లా అడ్మిషన్ టెస్ట్‌పై 2018లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఉదహరిస్తూ ఎన్‌టిఎ తన చర్యను సమర్థించుకున్నది.

**సుప్రీంకోర్టు జోక్యం**

గ్రేస్ మార్కులు ఇవ్వటాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటీషన్లపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు గ్రేస్ మార్కులను రద్దు చేయాలని, అభ్యర్థులు తమకు వచ్చిన మార్కులతో సరిపెట్టుకోవటం లేదా తిరిగి పరీక్ష రాయటంలలో ఏదో ఒకదాన్ని ఎంచుకోవాలని తీర్పు చెప్పింది. జూన్ 23వ తేదీన మళ్ళీ జరిపిన పరీక్షలో గ్రేస్ మార్కులు పొందిన 1,567 మందిలో 813 మంది అంటే 52 శాతంమంది మాత్రమే పాల్గొన్నారు. జులై 1 తేదీన ఫలితాలు ప్రకటించగా వారిలో ఒక్కరు మాత్రమే పూర్తి మార్కులు సాధించారు.

ఇవి చాలవన్నట్లుగా మొదట బీహార్, తర్వాత హర్యానా, జార్ఖండ్, కర్ణాటక, మహారాష్ట్రలలో పరీక్ష పేపరు లీకవటం ఎన్‌టిఎ ప్రతిష్ఠను మరింతగా దిగజార్చింది. ఈ రాష్ట్రాలకు చెందిన అభ్యర్థులు నీట్ అండర్ గ్రాడ్యుయేట్ పరీక్ష రాయటం కోసం సుదూరంలో ఉన్న గుజరాత్‌లోని కోచింగ్ సెంటర్లకు రావటం ఆశ్చర్యకరంగా ఉన్నది. పరీక్షలకు ఉన్న విలువను ధ్వంసం చేయటం కోసం కొన్ని సంఘటితమైన సిండికేట్లు, పరీక్షల మాఫియా ముఠాలు ప్రయత్నం చేస్తున్నాయి.

పేపర్ లీకవటం స్థానికంగా కొన్ని సెంటర్లకు మాత్రమే పరిమితమైనదని, తిరిగి పరీక్ష నిర్వహించటం వలన లక్షలాది మంది అభ్యర్థులు తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొంటారని, విద్యా సంవత్సరం ఆలస్యమౌతుందనే నెపంతో ఎన్‌టిఎ, విద్యామంత్రిత్వశాఖలు నీట్ పరీక్షను రద్దు చేయలేదు. పరీక్షల నిర్వహణలో వీసమెత్తు తప్పు జరిగినా సహించేది లేదని సుప్రీంకోర్టు హెచ్చరించింది. అయినప్పటికీ 2024లో జరిగిన నీట్ అండర్ గ్రాడ్యుయేట్ పరీక్షలో వచ్చిన మార్కులతో మెడికల్ కాలేజీలలో ప్రవేశం కోసం జరిగే కౌన్సిలింగ్‌పై స్టే ఇవ్వటానికి నిరాకరించింది.

ఈ కాలంలోనే నీట్ అండర్ గ్రాడ్యుయేట్ పరీక్షలకు సంబంధించిన కేసులను సిబిఐ తీసుకొని, వివిధ ప్రాంతాలలోని కొంతమంది వ్యక్తులను అరెస్టు చేసింది. నీట్ అండర్ గ్రాడ్యుయేట్ పరీక్షను రద్దు చేసి, తిరిగి నిర్వహించాలని, ఎన్‌టిఎను రద్దు చేయాలనే డిమాండ్లతో విద్యార్థులు, తల్లిదండ్రులు దేశవ్యాప్తంగా ఆందోళన చేశారు. ప్రతిపక్ష పార్టీలు ఈ అంశాన్ని పార్లమెంటులో లేవనెత్తాయి.

**నిర్వహణ లోపాలు**

పరీక్షల నిర్వహణలో ఎన్‌టిఎ వైఫల్యం క్షమించరాని విధంగా ఉంది. అభ్యర్థులు సాధించిన మార్కులు, మెరిట్ లిస్టులు తయారు చేయటంలో గతంలో తప్పులు జరిగాయి. సాంకేతిక లోపాలు, పరీక్షలను వాయిదా వేయటం, తేదీలను రీ షెడ్యూల్ చేయటం తదితరాలు తరచుగా జరుగుతున్నాయి. కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ (సియుఇటి) పరీక్షల నిర్వహణ బాధ్యతను ఎన్‌టిఎ తీసుకున్నప్పటి నుండి తమ తాము సాధించాలనుకున్న లక్ష్యాలకు విఘాతం కలుగుతున్నట్లు అభ్యర్థులు భావిస్తున్నారు. సియుఇటి పరీక్షల నిర్వహణ బాధ్యతను ఎన్‌టిఎ తీసుకున్న మొదటి సంవత్సరమే విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు పీడకలగా మారింది. అడ్మిషన్ అప్లికేషన్లు తీసుకొనే క్రమం పూర్తి అయినతర్వాత కూడా, చివరి నిముషం వరకు భాగస్వాములు అయ్యే యూనివర్సిటిలు, ప్రోగ్రామ్‌లను మారుస్తూ వచ్చారు. అడ్మిట్ కార్డులు ఇచ్చినప్పటి నుండి చివరి నిముషం వరకు టెస్ట్ రాసే కేంద్రాలను రద్దుచేయటం, మార్చటం చేశారు.

సియుఇటిలో భాగస్వాములుగా ఉన్న యూనివర్సిటీలు కూడా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. ఫలితాలు ప్రకటించిన తర్వాత నెలల తరబడి వారి యూనివర్సిటీలలోని సీట్లు భర్తీ కావటం లేదు. అనేక కాలేజీలు మొదట వచ్చిన వారికి మొదటి ప్రాధాన్యత ప్రాతిపదికన సీట్లు భర్తీ చేయటంతో చేరిన వారిలో ప్రతిభ కలిగిన వారు తక్కువ మంది ఉంటున్నారు. అడ్మిషన్ల ప్రక్రియ పూర్తయి, విద్యా సంవత్సరం ప్రారంభం కావటంలో అసాధారణమైన జాప్యం జరుగుతున్నది.

నాణ్యత కలిగిన ఉన్నత విద్యను పొందటం కోసం తమకు నచ్చిన సంస్థలు, ప్రోగ్రామ్స్‌లో చేరటానికి విద్యార్థులు ఎదుర్కొనే ఇబ్బందులు తగ్గించటానికి, అందరికీ సమాన అవకాశాలు కల్పించటంలో సియుఇటి శక్తివంతంగా పని చేస్తుందని చెబుతున్నారు. కానీ గత రెండు సంవత్సరాలుగా దీనికి పూర్తి వ్యతిరేకంగా నిర్వహించటానికి అవసరమైన సిబ్బంది, క్వాలిటి పరీక్షా కేంద్రాలు దానికి లేవు.

**సియుఇటిని ప్రవేశపెట్టి ధ్వంసమైన ఎన్‌టిఎ**

కామన్ యూనివర్శిటీ ఎంట్రన్స్ టెస్ట్

(సియుఇటి)ని ప్రవేశపెట్టటంతో ఎన్‌టిఎ పతనమైందని చెప్పటం అతిశయోక్తి కాదు. ఈ సంవత్సరం జరిగిన పరిణామాలు దానిని రుజువు చేశాయి. 2017, నవంబరులో మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ ఈ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ)ను ఏర్పాటు చేసింది. 1860 సంవత్సరం సొసైటిల రిజిస్ట్రేషన్ చట్టం కింద 2018, మే 15వ తేదీన సొసైటిగా రిజిస్టర్ చేశారు. కేంద్ర క్యాబినెట్ ఆమోదంతో ఏర్పడిన ఈ సంస్థ "ఉన్నత విద్యాసంస్థలలో ప్రవేశం, ఫెలోషిప్‌లు ఇవ్వటం కోసం ప్రవేశ పరీక్షలను నిర్వహించటానికి స్వతంత్రమైన, స్వయం పోషక, నైపుణ్యం కలిగిన మార్గదర్శక సంస్థ"గా ఉంటుందని ఆశించారు. "ప్రతిభ ప్రాతిపదికగా అభ్యర్థులను అంచనా వేయటం, సామర్థ్యాన్ని పరిగణనలోకి తీసుకొని, అంతర్జాతీయ ప్రమాణాలతో అడ్మిషన్లు, రిక్రూట్‌మెంట్లు జరపటంలో ఎదురయే సవాళ్ళను" పారదర్శకతతో అధిగమించి, అంకితభావంతో పనిచేస్తుందని భావించారు.

ఐదు సంవత్సరాల స్వల్ప సమయంలో 17 భిన్నమైన రంగాలలో పరీక్షలు నిర్వహించే బాధ్యతను ఎన్‌టిఎకు అప్పగించారు. మీడియాలో వచ్చిన వార్తల ప్రకారం 2023లో ఎన్‌టిఎ నిర్వహించే వివిధ రకాల పరీక్షలలో పాల్గొటం కోసం 1.23 కోట్లమంది అభ్యర్థులు తమ పేర్లు నమోదు చేసుకున్నారు. ఆ సంవత్సరం ప్రపంచంలోనే అత్యధికంగా 1.29 కోట్ల మందికి పరీక్షలు నిర్వహించిన చైనాలోని గావోకావో తర్వాత, 1.23 కోట్లమందికి పరీక్షలు నిర్వహించిన ఎన్‌టిఎ రెండవ స్థానంలో ఉన్నది.

కేంద్ర విద్యామంత్రిత్వశాఖ నివేదికననుసరించి 2022-23 సంవత్సరంలో ఎన్‌టిఎ నిర్వహించిన 26 రకాల భిన్నమైన పరీక్షలలో 1.36 కోట్లమంది పాల్గొన్నారు. దీనికి అదనంగా 2022లో సియుఇటిలో 1.49 లక్షల మంది పాల్గొన్నారు. ప్రపంచంలో పరీక్షలు నిర్వహించే సంస్థలలో ఎన్‌టిఎ అతి పెద్దసంస్థ అని అంకెలు తెలుపుతున్నాయి. పరీక్షలలో అక్రమాలకు పాల్పడిన నేరస్తులను గుర్తించి శిక్షలు విధించటం తాత్కాలిక ఉపశమనంగా ఉంటుంది. విద్యార్థులు గతంలో చూపిన ప్రతిభ ప్రాతిపదికపై ఉన్నత విద్యాసంస్థలలోకి ప్రవేశం కల్పిస్తే ఈ సమస్య శాశ్వతంగా పరిష్కారం అవుతుంది.

### సరైన సదుపాయాలు లేవు

ఎన్‌టిఎ తాను భరించగలిగిన దానికన్నా ఎక్కువ భారం మోస్తున్నట్లుగా కనిపిస్తున్నది.

**"ఎన్‌టిఎ ఇందుకు విరుద్ధంగా తిరోగమన మార్గంలో పయనిస్తున్నది. అది మొదట సిబిటితో ప్రారంభించి, తర్వాత కొన్ని కీలకమైన, పెద్ద పరీక్షలకు పెన్ను, పేపరు విధానానికి తిరిగి వచ్చింది. చివరికి సిబిటిని కూడా సాంప్రదాయక పద్ధతిలో, అభ్యర్థులందరూ ఒకటి, రెండు స్లాట్లలో నిర్ణీత కేంద్రాలకు హాజరై పరీక్షలు రాసే విధంగా ఎన్‌టిఎ అమలు చేసింది."**




నీట్ పేపర్ లీక్‌కు నిరసన తెలుపుతున్న ఎస్‌ఎఫ్‌ఐ కార్యకర్తలపై వాటర్ కానన్ ప్రయోగం

దాని నిర్మాణం, ఉద్యోగులను గురించి వెబ్‌సైట్‌లో తక్కువ సమాచారం మాత్రమే ఉన్నది. ఛైర్మన్, డైరెక్టర్ జనరల్, మరొక సభ్యుని పేరు మాత్రమే వెబ్‌సైట్‌లో ఉన్నది. ఇతర సభ్యుల హొదా, అనుబంధాలను పేర్కొనటం మినహా వారి పేర్లు వెల్లడించలేదు. వీరంతా పార్ట్‌టైమ్ సభ్యులుగానే ఉన్నారు. ఇతర అధికారుల పేర్లు ప్రస్తావించకుండా అయా విభాగాలు నిర్వహించే పరీక్షలు, కార్యకలాపాల జబితా, వారి ఇ మెయిల్ అడ్రసులు మాత్రమే ఎన్‌టిఎ వెల్లడించింది. అన్ని ఆఫీసులకు కలిపి రెండు లాండ్‌లైన్ ఫోన్ నంబర్‌లు మాత్రమే ఉన్నాయి. ఎన్‌టిఎ వార్షిక నివేదికలు, ఆడిట్ వివరాలను కూడా వెల్లడించటం లేదు.

సాధారణంగా ఎక్కువ మంది ఉద్యోగులు, పెద్దస్థాయిలోని ప్రభుత్వ సంస్థ పారదర్శకంగా వ్యవహరిస్తూ ప్రజల విశ్వాసం పొందటం కోసం ఎక్కువ వివరాలు వెల్లడిస్తుంది. ఉన్నత విద్యాసంస్థలలో ప్రవేశానికి అర్హత పరీక్షలు నిర్వహించటం వంటి సున్నితమైన బాధ్యతలు మాత్రమే కాకుండా, పాఠశాలలలో ప్రవేశాలు, స్కాలర్ షిప్‌లతో పాటు కొన్ని రకాల ఉద్యోగాలలోకి కూడా రిక్రూట్‌మెంట్ నిర్వహిస్తున్న ఎన్‌టిఎ మరింత పారదర్శకంగా వ్యవహరించటం అవసరం.

తాను నిర్వహిస్తున్న పరీక్షలు, టెస్ట్‌ల సంఖ్య కన్నా కొద్దిగా ఎక్కువ మంది సీనియర్ ఉద్యోగులు మాత్రమే ఎన్‌టిఎలో శాశ్వత సిబ్బందిగా పని చేస్తున్నారు. వ్యూహాత్మకమైన, కీలకమైన, విశ్వసనీయత కల్పించే విధంగా వ్యవహరించాల్సిన కార్యక్రమాల కోసం అవుట్ సోర్సింగ్, కన్సల్టెంట్స్, తృతీయపక్ష సేవలపై ఆధారపడాల్సి వస్తున్నది. అవసరమైనంత మంది పూర్తికాలం ఉద్యోగులు లేకపోవటం తీవ్రమైన వత్తిడికి కారణమౌతున్నది. ఫలితంగా అది తన లక్ష్యానికి దూరమౌతున్నది.

ఎన్‌టిఎ ఇందుకు విరుద్ధంగా తిరోగమన మార్గంలో పయనిస్తున్నది. అది మొదట సిబిటితో ప్రారంభించి, తర్వాత కొన్ని కీలకమైన, పెద్ద పరీక్షలకు పెన్ను, పేపరు విధానానికి తిరిగి వచ్చింది. చివరికి సిబిటిని కూడా సాంప్రదాయక పద్ధతిలో, అభ్యర్థులందరూ ఒకటి, రెండు స్లాట్లలో నిర్ణీత కేంద్రాలకు హాజరై పరీక్షలు రాసే విధంగా ఎన్‌టిఎ అమలు చేసింది.

వీటన్నింటిని కలిపిచూస్తే రొటీన్‌గా, అత్యవసరంగా చేయాల్సిన కార్యక్రమాలకే ఎన్‌టిఎ పరిమితం అవుతున్నదని, కీలకమైన అంశాలపై కేంద్రీకరించటానికి అవకాశం ఉండటం లేదని స్పష్టమౌతున్నది. ఉనికిలోకి వచ్చిన ఆరు సంవత్సరాల తర్వాత కూడా ఈ

> **" కోచింగ్ విధానం విద్యా రంగాన్ని అనేక విధాలుగా దిగజార్చింది. అవి విద్యార్థులను పాఠశాలల నుండి పక్కదారి పట్టించాయి. అవి విద్య నేర్పని-ఘోస్ట్- పాఠశాలలు ఏర్పడటానికి దారితీశాయి. అవి విద్యార్థులను చేర్చుకొని, హాజరు వేసి, తమ విద్యార్థులుగా బోర్డు పరీక్షలలో పాల్గొనటానికి అవకాశం కల్పిస్తు న్నాయి. కానీ పాఠాలు బోధించకుండా విద్యా ర్థులు కోచింగ్ సెంటర్లకు హాజరు కావటానికి అవి స్వేచ్ఛ నిస్తున్నాయి. "**

సంస్థ రూపొందించిన అతి ముఖ్యమైన కార్యక్రమాలు కేవలం కాగితాలకే పరిమితమై వాగ్దానాలుగా మిగిలిపోయాయి.

ఉన్నతస్థాయి ప్రశ్నలు, జవాబుల బ్యాంక్ ద్వారా కీలకమైన డేటా బేస్‌ను ఏర్పాటు చేసుకోవటం ఏ ప్రతిష్ఠాత్మక సంస్థకైనా అత్యంత కీలకమైనది. సమగ్రంగా భారీ ప్రశ్నాపత్రాల భాండాగారాన్ని అభివృద్ధి చేసుకున్న తర్వాతే ప్రతిష్ఠాత్మకమైన సంస్థలు తమ కార్యకలాపాలను ప్రారంభిస్తాయి. టెస్టింగ్, అభ్యర్థులను సమగ్రంగా అంచనా వేయటాన్ని పరిగణనలోకి తీసుకుని సంస్థల విశ్వసనీయతను అంచనా వేస్తారు. టెస్టింగ్ ఏజెన్సీ క్రమబద్ధంగా నిర్వహించే సమగ్ర అంచనాల స్థిరత్వం, తర్కబద్ధత, విశ్వసనీయత తదితరాలకు సంబంధించిన లెక్కలను భద్రపరుస్తారు. ఇప్పటి వరకు ఎన్‌టిఎ అటువంటి వివరాలను వెల్లడించలేదు.

ఎన్‌టిఎ పనితీరు, నిర్మాణంలోని లోపాలలో ఇవి కొన్ని మాత్రమే. పైపై అంశాలను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటే ఈ వ్యవస్థను సక్రమంగా పని చేయించటానికి అవసరమైన సిఫార్సులు చేయటం సాధ్యం కాదు. ఉన్నతస్థాయి కమిటి ఈ సమస్యను సమగ్రంగా పరిశీలన చేయకపోతే అక్కడక్కడ కొన్ని లోపాలను గుర్తించటం, తర్వాత ఈ టెస్టింగ్ ఏజెన్సీ తప్పనిసరిగా అమలు జరపవలసిన కొన్ని నిర్వహణ పద్ధతులు సూచించటంతో ముగిసిపోతుంది. ఇది కొంత వెసులుబాటు కల్పించినప్పటికీ సమస్యను పూర్తిగా పరిష్కరించటానికి దోహదం చేయదు. సమస్య చాలా లోతైనది. దీనిని పరిష్కరించటం కోసం వ్యవస్థాగత సంస్కరణలు చేయాలి.

### ప్రవేశ పరీక్షను ఏకైక అర్హతగా నిర్ణయించటం సరికాదు

ఉన్నత విద్యకు అర్హతను నిర్ణయించటం, సీట్లు కేటాయించటం కోసం పూర్తిగా ప్రవేశ పరీక్షలపై ఆధారపడటం విద్యావ్యవస్థలో అక్రమ పద్ధతులు చోటు చేసుకోవటానికి దారితీసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు లేదా ఉన్నత విద్యాసంస్థలు నిర్వహిస్తున్న ప్రవేశ పరీక్షలు పాఠశాలల ప్రాధాన్యత, వాటి కీలక పాత్రను దిగజారుస్తున్నాయి. పిల్లలకు నేర్పటంతో పాటు వారి జీవితాలలో ప్రధాన పాత్రను నిర్వహిస్తున్న పాఠశాల విద్యను ఇవి పరిగణనలోకి తీసుకోవటం లేదు.

ప్రవేశ పరీక్షలలో సంపాదించే మార్కులపై అతిగా ఆధారపడటం కోచింగ్ సెంటర్లు, సంస్థలు విస్తారంగా పుట్టుకురావ టానికి దారితీసింది. విద్యార్థులు సమగ్రంగా ఆలోచించటం కాకుండా మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలకు వేగంగా సమాధానాలు రాయటం మాత్రమే ఈ సంస్థలు నేర్పుతున్నాయి.

కోచింగ్ విధానం విద్యా రంగాన్ని అనేక విధాలుగా దిగజార్చింది. అవి విద్యార్థులను పాఠశాలల నుండి పక్కదారి పట్టించాయి. అవి విద్య నేర్పని–ఘోస్ట్– పాఠశాలలు ఏర్పడటానికి దారితీశాయి. అవి విద్యార్థులను చేర్చుకొని, హాజరు వేసి, తమ విద్యార్థులుగా బోర్డు పరీక్షలలో పాల్గొనటానికి అవకాశం కల్పిస్తున్నాయి. కానీ పాఠాలు బోధించకుండా విద్యార్థులు కోచింగ్ సెంటర్లకు హాజరు కావటానికి అవి స్వేచ్ఛ నిస్తున్నాయి.

కోచింగ్ కేంద్రాలు, సంస్థలు ఆన్‌లైన్‌లో అయినా, ఆఫ్‌లైన్‌లో అయినా లాభాలు చేసుకోవటమే లక్ష్యంగా పని చేస్తున్నాయి. విద్యార్థుల కుటుంబాలు చెల్లించగలిగినంత వసూలు చేస్తూ వారికి తీవ్రభారంగా పరిణమిస్తున్నాయి. ఇది ఉన్నత విద్యా విధానాన్ని పూర్తిగా పోటీపై ఆధారపడినదిగా, లోపభూయిష్టమైనదిగా చేస్తున్నది.

### అంతర్గత లోపాలు

ప్రవేశ పరీక్షలలో సాధించిన మార్కులపై పూర్తిగా ఆధారపడి ఉన్నత విద్యాలయాలలో ప్రవేశం కల్పించే విధానం పూర్తిగా లోపభూయిష్టమైనది. అవాంఛనీయ శక్తులు దీనిని ఉపయోగించుకోవటానికి, తప్పుడు పద్ధతులకు పాల్పడటానికి అవకాశం ఇస్తున్నది. రాష్ట్రాలు, యూనివర్సిటీలు నిర్వహిస్తున్న ప్రవేశ పరీక్షలలో కూడా ఇవే లోపాలు చోటు చేసుకుంటున్నాయి. పేపర్ లీక్ బాధ్యులను పట్టుకోవటం, వారిని శిక్షించటం తాత్కాలికమైన పరిష్కారంగా మాత్రమే పనిచేస్తుంది. మౌలికమైన సంస్కరణలతో పునాది విధానాలకు తిరిగి వెళ్ళటంలోనే పూర్తి పరిష్కారం ఉన్నది. గత తరగతులలో విద్యార్థులు చూయించిన ప్రతిభ, అర్హత పరీక్షలలో సాధించిన మార్కులు, గ్రేడ్‌ల ఆధారంగా పై తరగతులలో ప్రవేశం కల్పించటమే దీనికి పరిష్కారం.

భారతదేశంలో 48కి పైగా స్కూల్ బోర్డ్‌లు, వెయ్యికి పైగా యూనివర్సిటీలు ఉన్నాయి. వీటిలో పరీక్షలు నిర్వహించటం, విద్యార్థులను అంచనా వేయటం, అర్హతలు నిర్ణయించటం, మార్కులు వేయటంలో సాధ్యమైనంత వరకు ఒకే విధమైన ప్రమాణాలు రూపొందించటం అవసరం. విద్యార్థులను సమగ్రంగా అంచనా వేయటం, విద్యలో సాధించిన ఫలితాలకు ఇవ్వాల్సిన ప్రాధాన్యతను గురించి కేంద్ర విద్యాశాఖ మంత్రి, అన్ని రాష్ట్రాల, కేంద్రపాలిత ప్రాంతాల విద్యా మంత్రులు సభ్యులుగా ఉన్న సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఎడ్యుకేషన్ సమావేశాలలో చర్చించాలి. అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలోని శాసనసభలలో చర్చలు జరిపి సరైన నిర్ణయాలు తీసుకోవాలి.

పై తరగతులలో ప్రవేశానికి ఈ విధమైన విధానాన్ని అనుసరిస్తే పాఠశాల విద్య, బోర్డు పరీక్షల ప్రాధాన్యతను తిరిగి నొక్కిచెప్పవచ్చు. ఒకే కామన్ ఎంట్రన్స్ విధానంలో ఎదురౌతున్న వత్తిళ్ళ నుండి విద్యార్థులను రక్షించవచ్చు. పై తరగతులలో ప్రవేశానికి నిజమైన వికేంద్రీకృత విధానంగా దీనిని అమలు జరపటం తేలిక అవుతుంది. ఒకే దేశం, ఒకే పరీక్ష అన్న తప్పుడు విధానం నుండి దేశాన్ని రక్షిస్తుంది. భారతదేశం వంటి విస్తారమైన, భిన్నత్వంతో కూడిన దేశంలో ఈ విధమైన కేంద్రీకృత ప్రవేశ పరీక్షల విధానం పనికిరాదు.

కేంద్రం, రాష్ట్రాలతో కూడి ఉన్న భారత దేశంలో రాజ్యాంగంలో విద్యను కేంద్ర, రాష్ట్రాల ఉమ్మడి జాబితాలో ఉంచారు. విద్యకు సంబంధించిన అన్ని అంశాలలోనూ, అధికారాలు, బాధ్యతల నిర్వహణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా వ్యవహరించాలి. ఉన్నత విద్యలో సమన్వయం, ప్రమాణాలను కాపాడటాన్ని కేంద్ర జాబితాలో పెట్టటాన్ని ఆసరాగా చేసుకొని కేంద్రం విద్యారంగంలో రాష్ట్రాల

పాత్రను పక్కన పెట్టటం సరికాదు.

**విద్యార్థులను తీవ్ర ఒత్తిడికి గురిచేస్తున్న విద్యా విధానం**

భారతదేశంలోని తల్లిదండ్రులలో అనేకులు తమ పిల్లలు డాక్టర్లు, ఇంజనీర్లు కావాలని భావిస్తూ, 7, 8 తరగతులకు వచ్చే సరికి ఐఐటి, జెఇఇ తదితర కోర్సులకు శిక్షణ ఇచ్చే పాఠశాలలలో చేరుస్తున్నారు. కొందరైతే ఐదవ తరగతిలోనే పూర్తిస్థాయి జెఇఇ శిక్షణ ఇచ్చే పాఠశాలలకే పంపటానికి ప్రయత్నం చేస్తున్నారు. ఈ విధంగా తల్లి ఒడిలో ఉన్నప్పటి నుండే అత్యున్నత విద్యలో చేరాలనే ఒత్తిడిని విద్యార్థులు ఎదుర్కొంటున్నారు.

> **"భారతదేశంలోని తల్లిదండ్రులలో అనేకులు తమ పిల్లలు డాక్టర్లు, ఇంజనీర్లు కావాలని భావిస్తూ, 7, 8 తరగతులకు వచ్చే సరికి ఐఐటి, జెఇఇ తదితర కోర్సులకు శిక్షణ ఇచ్చే పాఠశాలలలో చేరుస్తున్నారు. కొందరైతే ఐదవ తరగతిలోనే పూర్తిస్థాయి జెఇఇ శిక్షణ ఇచ్చే పాఠశాలలకే పంపటానికి ప్రయత్నం చేస్తున్నారు. ఈ విధంగా తల్లి ఒడిలో ఉన్నప్పటి నుండే అత్యున్నత విద్యలో చేరాలనే ఒత్తిడిని విద్యార్థులు ఎదుర్కొంటున్నారు."**

రాజస్థాన్‌లోని కోట నగరం మూడు దశాబ్దాల క్రితం కోచింగ్ సెంటర్ల కేంద్రంగా ఉనికిలోకి వచ్చిన తర్వాత ఈ సంవత్సరం అత్యధికంగా 24 మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారు.

ఇంజనీరింగ్‌లో ప్రవేశానికి అత్యంత తీవ్రమైన పోటీ ఉండే జాయింట్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ (జెఇఇ), వైద్యవిద్యలో ప్రవేశం కోసం నేషనల్ ఎలిజిబిలిటి కం ఎంట్రెన్స్ టెస్ట్ (నీట్) లలో పొందిన మార్కులు విద్యార్థులు ప్రతిష్ఠాత్మకమైన ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజి (ఐఐటి), ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎఐఐఎంఎస్)లలో ప్రవేశం పొందటానికి దోహదం చేస్తాయి. ఈ సంస్థలలో సీటు పొందటంతో ఆర్థికంగా ఉన్నతస్థాయిలో జీవించటానికి అవసరమైన ఉద్యోగం దొరకటంతో పాటు సామాజిక హోదా కూడా పెరుగుతుంది. ఈ కోర్సులలో చేరటం కోసం జరిగే ప్రవేశ పరీక్షలలో ఉత్తీర్ణత సాధించటానికి ఇచ్చే కోచింగ్ సంస్థలలో చేరటానికి రాజస్థాన్‌లోని కోట నగరానికి ప్రతి సంవత్సరం కనీసం రెండు లక్షల మంది విద్యార్థులు వస్తుంటారు. నేషనల్ క్యాపిటల్ రీజియన్ (ఎన్‌సిఆర్), తమిళనాడు, కేరళ తదితర రాష్ట్రాల్లోని కోచింగ్ సెంటర్లలో లక్షల మంది చేరుతున్నారు.

ఈ కేంద్రాలలో విద్యార్థుల జీవితాలు అంత సంతోషకరంగా ఉండవు. అక్కడి విద్యార్థుల జీవితాలపై రూపొందించిన వెబ్ సిరీస్ వారి వ్యక్తిత్వం, గౌరవం, మానసికోల్లాసం హరించుకుపోయి, జీవితాలు ఎంత నిస్సారంగా ఉంటున్నాయో వెల్లడించింది. మత్తుమందులకు బానిసలు కావటం, నిద్రకు సంబంధించిన సమస్యలు, తీవ్రమైన ఆందోళన కోట విద్యార్థులలో సాధారణ సమస్యలుగా ఉన్నాయి. ఈ సమస్యలతో పాటు తమ లక్ష్యాల సాధనలో విఫలమవటంతో అప్పటి వరకు కన్నకలలు పీడకలలుగా మారుతున్నాయి.

**పెరుగుతున్న విద్యార్థుల మరణాలు**

నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సిఆర్‌బి)లెక్కల ప్రకారం 2021లో దేశంలో జరిగిన ఆత్మహత్యలలో విద్యార్థుల ఆత్మహత్యలు 8 శాతం (13,089)గా ఉన్నాయి. పరీక్షలలో ఉత్తీర్ణులు కాలేకపోవటం ఆత్మహత్యలకు ఒక కారణంగా ఉంటున్నది. 2011లో 7,696 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. 2011తో పోల్చు కుంటే 2021లో విద్యార్థుల ఆత్మహత్యలు 70 శాతం పెరిగాయి.

కోట నగరంలో ఈ సంవత్సరం 24 మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారు. మూడు దశాబ్దాల క్రితం ప్రధాన విద్యాకేంద్రంగా అభివృద్ధి జరగటం ప్రారంభమైన తర్వాత ఈ సంవత్సరమే అత్యధికంగా ఆత్మహత్యలు జరిగాయి. విద్యార్థులపై పెరుగుతున్న వత్తిడే ఇందుకు ప్రధాన కారణం. పోటీ పరీక్షలలో ఉత్తీర్ణులు కావటం కోసం పోటి తీవ్రంగా ఉంటున్నది. 2023లో జెఇఇ అడ్వాన్స్ పరీక్షల కోసం 1.95 లక్షల మంది విద్యార్థులు నమోదు చేసుకోగా, 22 శాతం మాత్రమే మెయిన్స్‌కు అర్హత సాధించారు. జెఇఇ మెయిన్స్ పూర్తి చేసిన వారు మాత్రమే అడ్వాన్స్ పరీక్షలు రాయటానికి అర్హత సాధిస్తారు.

విద్యార్థులు ఎదుర్కొంటున్న ఈ పరిస్థితులకు ఆర్థిక సమస్యలు ప్రధాన కారణంగా ఉన్నాయని రాజస్థాన్ మంత్రి మహేశ్ జోషి చెప్పారు. తమను చదివించటం కోసం తల్లిదండ్రులు పెద్ద మొత్తంలో అప్పులు చేశారని, తాము అర్హత సాధించలేకపోతే తమ కుటుంబాలు అప్పులలో కూరుకుపోతాయని విద్యార్థులు భయపడుతున్నారని ఆయన చెప్పాడు. ఐఐటిలలో చేరిన తర్వాత కూడా విద్యావ్యవస్థ వత్తిడితో క్రమంగా నిరాశలో కూరుకుపోతున్నారు. దేశంలోని 23 ఐఐటిలలో ఏడుగురు విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారు. 2020లో ముగ్గురు, 2021లో నలుగురు, 2022లో తొమ్మిది మంది ఐఐటి విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారు.

ఢిల్లీలోని ఐఐటిలో బిటెక్, కంప్యూటింగ్ డిపార్ట్‌మెంటు విద్యార్థులు ఇద్దరు గత రెండు నెలలలో ఆత్మహత్య చేసుకున్నారు. ఆగస్టు నెలలో వారి కోర్సు పూర్తి అవుతుంది. కానీ వారు అవసరమైన మార్కులు పొందలేకపోయారు. కొందరు అధ్యాపకులు విద్యార్థులకు తక్కువ గ్రేడ్‌లు ఇస్తున్నారని, దానితో వారిలో మానసిక వత్తిడి పెరుగుతున్న దని కొందరు విద్యార్థులు చెప్పారు. విద్యార్థి, అధ్యాపకుల నిష్పత్తి తక్కువ ఉండటం వలన విద్యార్థుల వైవిధ్యపూరితమైన అవసరాలను అధ్యాపకులు తీర్చలేకపోతున్నారు.

2023లో ఐఐటి మద్రాసులో నలుగురు విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారు. అక్కడ వెల్‌నెస్ సెంటర్, నలుగురు క్లినికల్ సైకాలజిస్టులు, ఒక ఫిజియాలజిస్టు ఉన్నాడు.

కేంద్ర విద్యాశాఖ మంత్రి 2022-27 సంవత్సరాలకు ఐఐటిఎంల వ్యూహాత్మక ప్రణాళికను విడుదల చేశాడు. రానున్న నాలుగు సంవత్సరాల కాలంలో ప్రపంచంలోని 50 ప్రథమశ్రేణి యూనివర్సిటిల జాబితాలో ఐఐటిలు స్థానం సంపాదించటం లక్ష్యంగా పేర్కొన్నారు. నూతన కోర్సులను ప్రవేశపెట్టటం, వివిధ యూనివర్సిటీలతో సహకారం, రీసెర్చ్ తదితరాలను గురించి పేర్కొన్నారు. కానీ పెరుగుతున్న విద్యార్థుల ఆత్మహత్యలపై మౌనం వహించారు.

ఐఐటిఎంలు అంతర్గత విచారణ కమిటీలను నియమించటం, విద్యార్థులకు మద్దతుగా ఉన్న వ్యవస్థలను అంచనా వేయటం చేస్తున్నాయి. కానీ విద్యార్థుల పట్ల అవసరమైనంత పారదర్శకత, సానుకూలత, స్పష్టమైన దృక్పథంతో వ్యవహరించటం లేదు. కులం కూడా ముఖ్యమైన పాత్ర నిర్వహిస్తున్నది. క్లాస్‌రూమ్‌లలోనూ, బయట విద్యార్థులు వివక్షకు గురవుతున్నారు.

**(అనువాదం: ఎ కోటిరెడ్డి)**

నివాళి

# పెట్టుబడిదారీ విధానాన్ని మార్క్స్ ఇంకా ఎందుకు వెంటాడుతున్నాడు?

హర్జీత్ సింగ్



రచయిత పంజాబ్‌లోని అకాల్ యూనివర్సిటీలో చరిత్ర సహాయ ఆచార్యులు

ప్రతి సంవత్సరం మే 5న, వివిధ ఖండాలలో వసంతకాలం వికసిస్తున్న తరుణంలో, అభిమానులు మేధావులు చారిత్రాత్మక నగరమైన ట్రియర్‌లో 1818లో జన్మించిన కార్ల్ మార్క్స్ జయంతిని జరుపుకుంటారు. ఈ సంవత్సరం, 2026, కేవలం సింహావలోకనానికే పరిమితం కాకుండా ఒక వాస్తవాతీతమైన ప్రశ్నను మన ముందు ఉంచుతుంది. కార్ల్ మార్క్స్ అస్సలు జన్మించకపోతే మన ప్రపంచం ఎలా ఉండేది? అంతర్జాతీయ కార్మిక దినోత్సవంగా పిలువబడే ‘మే డే’ను మనకు అందించిన కార్మిక విజయాలు అదే ప్రపంచ స్థాయి గుర్తింపుతో రూపుదిద్దుకునేవా? విప్లవాల నుండి సంక్షేమ రాజ్య సంస్కరణల వరకు 20వ శతాబ్దపు గొప్ప ఉత్థానపతనాలు పూర్తిగా భిన్నమైన మార్గాన్ని ఎంచుకునేవా? పెరుగుతున్న అసమానతలు, వాతావరణ సంక్షోభం, సాంకేతిక అంతరాయాలు ఉన్న మన ప్రస్తుత కాలంలో, ఆధునిక జీవితంలోని వైరుధ్యాలను గుర్తించి, ఎదుర్కోవడానికి మనకు ఇటువంటి విశ్లేషణాత్మక సాధనాలు ఉండేవా?

మార్క్స్ సుదూరాన ఉన్న ప్రవక్త కాదు. ఆయన తీవ్రమైన మేధస్సు, గాఢమైన భావోద్వేగాలు కలిగిన వ్యక్తి; జెన్నీ వాన్ వెస్ట్‌ఫాలెన్‌కు అంకితభావం గల భర్త, అనారోగ్యం, పేదరికం కారణంగా పిల్లలను కోల్పోయిన దుఃఖార్తుడైన తండ్రి, బ్రిటిష్ మ్యూజియంలో పుస్తకాలు, ఫ్యాక్టరీ నివేదికలను గంటల తరబడి శ్రద్ధగా పరిశోధించిన అలసట లేని పరిశోధకుడు. జర్నలిజం వృత్తిలో ఉండి తాను రాసిన రాతల కారణంగా పదేపదే దేశ బహిష్కరణకు గురైన మార్క్స్ తన వ్యక్తిగత కష్టాలను, తాత్విక అభిలాషను చరిత్రను తీర్చిదిద్దే ఆలోచనలుగా మలిచాడు. మార్క్స్ కేవలం సిద్ధాంతకర్త కాదు, మానవులను ఆయన వారి సామర్థ్యానికి తగిన ప్రపంచాన్ని నిర్మించగల సృజనాత్మక, సామాజిక జీవులుగా చూసాడు. చరిత్ర దృక్కోణం నుండి చూస్తే, పెట్టుబడిదారీ విధానం అంతర్గత పనితీరును ఆయన విశ్లేషించిన తీరు సమకాలీన పోరాటాలను అద్భుతమైన స్పష్టతతో మనకు వివరిస్తుందని తెలియవస్తుంది.

వివక్షాపూరిత చట్టాల మధ్యన, నిరసన వాతావరణంలో ప్రొటెస్టంట్‌గా మారిన ఒక యూదు వంశానికి చెందిన కుటుంబంలో జన్మించిన మార్క్స్, నెపోలియన్ యుద్ధాల తర్వాత మారుతున్న యూరప్ ఉద్రిక్తతలను గమనిస్తూనే, తన న్యాయవాది తండ్రి నుండి పునర్వికాస (ఎన్‌లైటెన్‌మెంట్) విలువలను వంటబట్టించుకున్నాడు. బాన్, బెర్లిన్‌లలోని విశ్వవిద్యాలయ జీవితం మార్క్స్ ను హెగెలియన్ తత్వశాస్త్రంలో తలమునకలుగా చేసేసింది. చరిత్ర వైరుధ్యాల నుండి ఆవిర్భవించి, అభివృద్ధి చెందుతుందనే ఆలోచనను మార్క్స్ వాస్తవిక ఆర్థిక పరిస్థితులలో కాళ్లూనుకున్న ఒక భౌతికవాద చట్రంగా మార్చాడు.

1840ల నాటికి, యూరప్ అంతటా విప్లవాలు రేగుతున్న సమయంలో, మార్క్స్ తాత్విక విమర్శ నుండి తన కాలపు రాజకీయ ఉద్యమాలలో చురుకుగా పాల్గొన్నాడు. ఇంగ్లాండ్ ఫ్యాక్టరీ జీవితంపై తన స్వంత పరిశీలనల ద్వారా వైవిధ్యభరితమైన, స్పష్టమైన ఆచరణాత్మక ఆధారాలను అందించిన ఫ్రెడరిక్ ఎంగెల్స్‌తో కలిసి, మార్క్స్ తన సిద్ధాంతాన్ని సజీవ వాస్తవికతతో ముడిపెట్టాడు. వారు ఇరువురూ కలిసి భావి తరాలను ప్రభావితం చేసే రచనలను ఈ ప్రపంచానికి అందించారు.

1848 నాటి ‘కమ్యూనిస్ట్ మేనిఫెస్టో’లో వారు చరిత్రను నడిపించే శక్తులను అద్భుతమైన స్పష్టతతో వెలుగులోకి తెచ్చారు. ఇప్పటివరకు ఉన్న మానవ సమాజాల చరిత్ర అంతా వర్గ పోరాటాల చరిత్రే. ఫ్యూడల్ ప్రభువులు ఎదుగుతున్న బూర్జువా (పెట్టుబడిదారీ) వర్గానికి లొంగిపోయారు. ఇవాళ, అపారమైన ఉత్పాదక శక్తులు కలిగిన పారిశ్రామిక పెట్టుబడిదారీ విధానం, క్రమానుగత సంక్షోభాలు, శ్రమ దోపిడీ, యజమానులకు–కార్మికులకు మధ్య పెరుగుతున్న అసమానతలతో సహా అనేక వైరుధ్యాలను ఎదుర్కొంటుంది

“ప్రపంచ కార్మికులారా, ఏకంకండి. మీరు జయించడానికి ఒక ప్రపంచం” ఉందంటూ ఆ కరపత్రం నేరుగా కార్మిక వర్గానికి అంతిమ పిలుపు నిచ్చింది. దీని ప్రభావం కార్చిచ్చులా వేగంగా వ్యాపించి, 1848 నాటి విప్లవాలలో, తదనంతర కాలంలో కూడా ఒక ఉత్తేజభరిత నినాదంగా నిలిచింది. పెట్టుబడి మొదటి సంపుటి 1867లో ప్రచురితమయ్యింది. మార్క్స్ మరణానంతరం తదుపరి సంపుటాలను ఎంగెల్స్ పరిష్కరించి ప్రచురించాడు. దానితో పెట్టుబడి గ్రంథం సమగ్రంగా వెలువడింది.

సాంప్రదాయ రాజకీయ ఆర్థిక వ్యవస్థ, ఫ్యాక్టరీ నివేదికలు, చారిత్రక సమాచారాన్ని నిశితంగా అధ్యయనం చేయడం ద్వారా, శ్రమ నుండి అదనపు విలువ ఎలా ఉత్పన్నమవుతుందో మార్క్స్ నిరూపించాడు. పెట్టుబడిదారులు కార్మికులకు వారి శ్రమశక్తికి వేతనాలు చెల్లిస్తారు, కానీ కార్మికులు ఉత్పత్తి చేసే సరుకుల విలువ వారు పొందే వేతనాల కంటే చాలా ఎక్కువగా ఉంటుంది. లాభంగా పిలవబడే ఈ వ్యత్యాసమే వ్యవస్థను నడిపిస్తుంది. సరుకులు వాటి వెనుక ఉన్న సామాజిక సంబంధాలను అరూపం చేసే ఒక రహస్య స్వభావాన్ని ఎలా సంతరించుకుంటాయో కూడా మార్క్స్ అన్వేషించాడు, దీనినే “కమొడిటీ ఫెటిషిజం” (సరుకుల పట్ల వ్యామోహం) అని మార్క్స్ పేర్కొన్నాడు. పెట్టుబడిదారీ విధానం మానవులను వారి సృజనాత్మక సామర్థ్యాల నుండి, పరస్పర

సంబంధాల నుండి, వారి శ్రమ పూర్తి ఫలితాల నుండి దూరం చేస్తూ 'పరాయీకరణ భావనకు లోనూ చేస్తుంది అని మార్క్స్ సూత్రీకరించాడు.

అయినప్పటికీ, మార్క్స్ పెట్టుబడిదారీ విధానం సాధించిన విజయాలను అభినందించాడు. పెట్టుబడిదారీ విధానం ఉత్పత్తిని ప్రపంచీకరించింది, సాంకేతికతను అభివృద్ధి చేసింది అలాగే మునుపెన్నడూ లేని స్థాయిలో ప్రకృతిని లొంగదీసుకోగల మానవాళి సామర్థ్యాన్ని నిరూపించింది. సమస్య ఈ ప్రగతిలో లేదు, మానవ అవసరాలను, సామర్థ్యాలను అంతులేని సంపద పోగువేతకు లోబడేలా చేసే వ్యవస్థలో ఉన్నది. చారిత్రక భౌతికవాదం సమాజ అభివృద్ధిని అర్థం చేసుకోవడానికి ఒక సమగ్ర దృక్పథాన్ని అందించింది.


ఉత్పత్తి విధానంలో మార్పులు, అంటే ఉత్పత్తి శక్తులు, ఉత్పత్తి సంబంధాలు, సామాజిక, రాజకీయ, మేధో జీవితాన్ని నిర్దేశిస్తాయి. ఉత్పత్తి శక్తులు అత్యున్నత స్థాయికి చేరుకుని, ప్రస్తుత సంబంధాల పరిధిని దాటినప్పుడు, ఉద్రిక్తతలు పెరిగి మార్పునకు తావు ఇస్తాయి. చరిత్ర కోణం నుండి చూస్తే, ఇది గిడసబారిన సూత్రం కాదు, ప్రాచీన సమాజాల నుండి భూస్వామ్య విధానం, దాని నుండి పెట్టుబడిదారీ విధానం వరకు వివిధ యుగాల పరిణామాలను అర్థం చేసుకోవడానికి ఉపకరించే ఒక సరళమైన సూత్రం.

> **❝ మార్క్స్ చరిత్రను ముందే నిర్ణయించబడిన విధిగా కాకుండా, భౌతిక పరిమితులకు లోబడి నిజ మానవాళి చేపట్టే కార్యకలాపాల ద్వారా నడిచే ఒక సజీవ ప్రక్రియగా చూశాడు. ఈ దృక్పథం ప్రపంచ మానవాళికి ఒక ఆశను ప్రసాదించింది. మునుపటి వ్యవస్థలు కొత్త వాటికి దారి ఇచ్చినట్లే, పెట్టుబడిదారీ విధానం కూడా తన పరిధిని దాటిన ఒక కొత్త వ్యవస్థకు సంబంధించిన విత్తనాలను తనలోనే కలిగి ఉంది అంటాడు మార్క్స్. ❞**

మార్క్స్ చరిత్రను ముందే నిర్ణయించబడిన విధిగా కాకుండా, భౌతిక పరిమితులకు లోబడి నిజ మానవాళి చేపట్టే కార్యకలాపాల ద్వారా నడిచే ఒక సజీవ ప్రక్రియగా చూశాడు. ఈ దృక్పథం ప్రపంచ మానవాళికి ఒక ఆశను ప్రసాదించింది. మునుపటి వ్యవస్థలు కొత్త వాటికి దారి ఇచ్చినట్లే, పెట్టుబడిదారీ విధానం కూడా తన పరిధిని దాటిన ఒక కొత్త వ్యవస్థకు సంబంధించిన విత్తనాలను తనలోనే కలిగి ఉంది అంటాడు మార్క్స్.

**పెట్టుబడి యొక్క మానవ మూల్యం**

మార్క్స్ ఆలోచనలు కార్మిక ఉద్యమంలో స్పష్టమైన రూపాన్ని దాల్చాయి. 1864లో స్థాపించబడిన 'ఫస్ట్ ఇంటర్నేషనల్' (అంతర్జాతీయ కార్మిక సంఘం) నాయకుడిగా, ఆయన కార్మికుల మధ్య అంతర్జాతీయ సంఘీభావం పెంపొందాలని ప్రబోధించాడు. పెట్టుబడి ప్రపంచవ్యాప్త విస్తరణకు కార్మికుల నుండి ఐక్య ప్రతిస్పందన అవసరమని మార్క్స్ ప్రతిపాదించాడు. మార్క్స్ రచనలూ,



కారల్ మార్క్స్

నిర్మాణాత్మక కృషీ.. పని గంటలను తగ్గించాలి, పని ప్రదేశంలో సముచిత గౌరవాన్ని కల్పించాలి అన్న డిమాండ్లను పెంపొందించడానికి ఎంతగానో తోడ్పడ్డాయి. ఎనిమిది గంటల పని దినం కోసం శాంతియుతంగా జరిగిన ప్రదర్శనలను పోలీసులు హింసాత్మకంగా అణచివేసిన 1886 నాటి చికాగో 'హేమార్కెట్ ఉదంతం' ప్రపంచంలో ఒక శక్తివంతమైన చిహ్నంగా మారింది.

1889లో, రెండవ ఇంటర్నేషనల్ మే 1వ తేదీని అంతర్జాతీయ కార్మిక దినోత్సవంగా ప్రకటించింది,. ఇది మార్క్స్ ప్రతిపాదించిన సరిహద్దులు లేని అంతర్జాతీయ సంఘీభావానికి ప్రత్యక్ష ఫలితం. పని గంటల తగ్గింపు డిమాండ్‌గా ప్రారంభమైనది, కాలక్రమేణా ప్రపంచవ్యాప్తంగా కార్మికుల ఆత్మగౌరవం, వారి సామూహిక శక్తిని చాటే వేడుకగా రూపాంతరం చెందింది. నేడు, ఆ వారసత్వం అనేక దేశాలలో కనీస వేతనాలు, గిగ్ కార్మికుల హక్కులు, యూనియన్ల పునరుజ్జీవన ఉద్యమాలలో సజీవంగా ఉంది. తీవ్రమైన నిఘాను ఎదుర్కొంటున్న వేర్‌హౌస్ కార్మికుల నుండి, దోపిడీ దాగి ఉన్న గ్లోబల్ సప్లై చైన్ల వరకు శ్రమ విలువను ఉత్పత్తి చేస్తే, పెట్టుబడి దానిని పిండుకుంటుందనే మార్క్స్ అంతర్దృష్టి నేటికీ ప్రతిధ్వనిస్తూనే ఉంది. ఆయన ఆలోచనలు ఈ పోరాటాలకు మానవీయ కోణాన్ని సంతరించాయి. పని అనేది ఆత్మను నిర్వీర్యం చేసేదిగానో, శరీరాన్ని అలసటకు గురిచేసేదిగానో ఉండకూడదు, అది మన మానవ జాతికి తగిన సృజనాత్మక, సహకార కార్యకలాపాల ద్వారా మానవ వికాసానికి తోడ్పడేలా ఉండాలి.

చరిత్ర కోణం నుండి చూస్తే మార్క్స్ సిద్ధాంత చట్రం మన కాలపు అలజడులను అద్భుతమైన ప్రాసంగికతతో వివరించడానికి సహాయపడుతుంది. మేనిఫెస్టోలో వివరించినట్లుగా, ప్రతిచోటా విస్తరించాలనే పెట్టుబడి ఆరాటానికి ప్రతిరూపమైన 'ప్రపంచీకరణ', వివిధ దేశాల మధ్యనా, ఏ దేశానికి ఆ దేశంలో అంతర్గతంగానూ అపూర్వమైన సంపదను, అదే సమయంలో విపరీతమైన అసమానతలను సృష్టించింది. వాతావరణ మార్పు దీనికి ఒక ముఖ్యమైన ఉదాహరణ. పెట్టుబడిదారీ విధానపు అంతులేని వృద్ధి, స్వల్పకాలిక లాభాల అన్వేషణలు ప్రపంచ పర్యావరణ పరిమితులను సవాలు చేస్తున్నాయి. సరుకుల వ్యామోహం (Commodification) మార్క్స్ చేసిన విశ్లేషణ, సాంకేతిక కంపెనీల డేటా సేకరణ నుండి హౌసింగ్ మరియు ఆరోగ్య సంరక్షణ రంగాల ఆర్థికీకరణ (Financialisation) వరకు ఆధునిక పరిణామాలపై వెలుగునిస్తుంది.

కృత్రిమ మేధస్సు (ఏఐ), ఆటోమేషన్ యుగంలో పరాయీకరణ గురించి మార్క్స్ వెలిబుచ్చిన ఆందోళన ఇవాళ సరికొత్త ప్రాధాన్యతను సంతరించుకుంది. అల్గారిథమ్‌లు పని వేగాన్ని నిర్దేశిస్తున్నప్పుడు లేదా తగిన పరిహారం లేకుండా శిక్షణ నమూనాల

**" మార్క్స్ ఆలోచనలు, పంతొమ్మిదో శతాబ్దపు పాత అవశేషాలు కావు. అవి 21వ శతాబ్దపు సవాళ్లను ఎదుర్కోవడానికి సజీవ సాధనాలను అందిస్తాయి. ఇవి కృత్రిమ మేధస్సు మధ్య పని యొక్క స్వభావాన్ని, ఉద్దేశ్యాన్ని పునర్నిర్మించడం నుండి, అదుపు లేని సంపద సేకరణ కంటే మానవ అభ్యున్నతికి, గౌరవానికి ప్రాధాన్యత ఇచ్చే స్థిరమైన, శ్రేయోదాయకమైన ప్రపంచ వ్యవస్థలను నిర్మించడం వరకు విస్తరించి ఉన్నాయి. "**

(Training Models) కోసం సృజనాత్మక పనులను దొంగిలిస్తున్నప్పుడు, కార్మికులు తమ స్వంత సామర్థ్యాల నుండి మరింత దూరం అయ్యే ప్రమాదం ఉంది. అదే సమయంలో, సాంకేతికతను ప్రైవేట్ లాభాల కోసం కాకుండా ప్రజాస్వామ్యబద్ధంగా ఉపయోగించుకుంటే, దానికి ఉండే విముక్తి సామర్థ్యాన్ని మార్క్స్ కొనియాడాడు. ఆయన అంతర్దృష్టులతో నడిచే సమాజం.. పని దినాలను తగ్గించడానికి, ఉత్పాదకత లాభాలను విస్తృతంగా పంపిణీ చేయడానికి, ఆవిష్కరణలను మానవ పర్యావరణ అవసరాల వైపు మళ్లించడానికి ప్రాధాన్యత ఇస్తుంది.

సాంస్కృతిక , రాజకీయ ధ్రువీకరణలు కూడా మార్క్స్ ఆలోచనలను ప్రతిధ్వనిస్తాయి. సిద్ధాంతం అనేది ఉన్నత వర్గాల ఆధిపత్య సంబంధాలను సహజమైనవిగా చూపే ఆలోచనల సమూహమని మార్క్స్ స్పష్టం చేశాడు. ఎకో ఛాంబర్లు, అల్గారిథమిక్ ఫీడ్‌లు, వివాదాస్పద సత్యాలతో కూడిన నేటి సమాచార ప్రపంచంలో, ఆర్థిక ఆధిపత్యం ప్రజా కథనాలను ఎలా రూపొందిస్తుందనే దానిపై ఇది విమర్శనాత్మక అవగాహనను కలిగిస్తుంది. చరిత్ర కోణం నుండి చూస్తే, జాతి, లింగ, పర్యావరణ న్యాయం కోసం జరిగే ఉద్యమాలు సాంప్రదాయ మార్క్సిజానికి అతీతంగా విస్తరించినప్పటికీ, అవి తరచుగా వర్గ విశ్లేషణతో ముడిపడి ఉంటాయి. విభిన్న అణచివేతలు తరచుగా ప్రజలను విభజించే లాభాలకే ప్రాధాన్యత ఇచ్చే ఆర్థిక వ్యవస్థల క్రింద వృద్ధి చెందుతాయి. మార్క్స్ ప్రవచించిన అంతర్జాతీయవాదం వలసల సంక్షోభాలు, ప్రపంచ మహమ్మారులు, సప్లై చైన్ బలహీనతలకు శక్తివంతంగా అన్వయించుకోవచ్చు. సంక్షోభాలకు సరిహద్దులు లేవు, అలాగే శ్రామిక ప్రజలు , బాధ్యతాయుత పౌరుల మధ్య సంఘీభావానికి కూడా సరిహద్దులు ఉండకూడదు.

### మార్క్స్ లేని ప్రపంచం

మార్క్స్ లేకపోయినా చరిత్ర స్థంభించిపోయేది కాదు. భౌతిక పరిస్థితులే సంఘర్షణలకు మార్పులకు దారి తీస్తాయి. మార్క్స్ ముందు నాటి నుండి ఉన్న సోషలిస్ట్ ధోరణులు, కార్మిక సంఘాలు, సంస్కర్తలు కార్మికుల హక్కులను ముందుకు తీసుకెళ్లేవారు. అయినప్పటికీ, తత్వశాస్త్రం, ఆర్థిక శాస్త్రం చరిత్రల శక్తివంతమైన కలయిక అయిన మార్క్స్ సమగ్ర దృక్పథం లేకపోతే, ప్రగతిశీల ఉద్యమాలు మరింత విచ్ఛిన్నమై ఉండేవి. పెట్టుబడిదారీ విధానాన్ని ఒక సంపూర్ణ వ్యవస్థగా విమర్శించే సమన్వయ శక్తిని కోల్పోయేవి. విప్లవాలు మరింత సంకుచితంగా, సులభంగా అణచివేయబడేవి.

ప్రచ్ఛన్న యుద్ధపు సైద్ధాంతిక రూపాలు, వలసరాజ్యాల విముక్తి నమూనాలు, రాడికల్ డిమాండ్లకు పాక్షిక ప్రతిస్పందనలుగా సంక్షేమ రాజ్యాల అభివృద్ధి వంటి అంశాల్లో కూడా తీవ్రమైన మార్పులు చోటు చేసుకుని ఉండేవి. మన కాలంలో మార్క్స్ విశ్లేషణాత్మక సిద్ధాంతం అందుబాటులో లేకపోయి ఉంటే అసమానత, ఆటోమేషన్, పర్యావరణ పతనానికి సంబంధించిన ప్రతిస్పందనలు లోతైన నిర్మాణాత్మక ప్రశ్నలను లేవనెత్తడానికి బదులుగా, తాత్కాలిక స్వచ్ఛంద సేవ లేదా సాంకేతిక సర్దుబాట్ల వైపు మాత్రమే మొగ్గు చూపేవి. మనం ఇప్పటికీ పరాయీకరణను అనుభవిస్తూనే ఉండేవాళ్లం, కానీ బహుశా వాటిని వ్యక్తపరచడానికి గానీ, వ్యవస్థాగత స్థాయిలో ప్రత్యామ్నాయాలను ఊహించడానికి గానీ అత్యంత పదునైన భావజాలాన్ని కోల్పోయి ఉండేవాళ్లం.

లక్షలాది మంది ప్రజానీకం తమను తాము చరిత్రలో కేవలం ప్రేక్షకులుగా గాక చురుకైన భాగస్వాములుగా మారేందుకు మార్క్స్ ఎంతగానో తోడ్పడ్డాడు. ప్రజా చైతన్యంలో వచ్చిన ఈ మార్పు మార్క్స్ అందించిన అత్యంత ఘనమైన సహకారాలలో ఒకటిగా మిగిలిపోయింది.


అన్నింటికంటే మించి మార్క్స్, చేతనతో కూడిన సమిష్టి కార్యాచరణ ద్వారా మానవాళి విముక్తిని బలంగా నమ్మిన ఒక మానవతావాది. ఆయన చవిచూసిన దేశ బహిష్కరణలు, ఆర్థిక కష్టాలు, వ్యక్తిగత నష్టాలను ఒక సన్యాసిలా కాకుండా, ఒక మెరుగైన ప్రపంచం సాధ్యమని నమ్మిన వ్యక్తిగా భరించాడు; ఈ ప్రపంచంలో "ప్రతి ఒక్కరి సముచిత అభివృద్ధే అందరి అభివృద్ధికి దోహదం చేస్తుంది" అని గాఢంగా నమ్మిన విశ్వనరుడు మార్క్స్.

మార్క్స్ ఆలోచనలు, పంతొమ్మిదో శతాబ్దపు పాత అవశేషాలు కావు. అవి 21వ శతాబ్దపు సవాళ్లను ఎదుర్కోవడానికి సజీవ సాధనాలను అందిస్తాయి. ఇవి కృత్రిమ మేధస్సు మధ్య పని యొక్క స్వభావాన్ని, ఉద్దేశ్యాన్ని పునర్నిర్మించడం నుండి, అదుపు లేని సంపద సేకరణ కంటే మానవ అభ్యున్నతికి, గౌరవానికి ప్రాధాన్యత ఇచ్చే స్థిరమైన, శ్రేయోదాయకమైన ప్రపంచ వ్యవస్థలను నిర్మించడం వరకు విస్తరించి ఉన్నాయి.

మే 5న, మార్క్స్ జన్మదినాన్ని మనం స్మరించుకుంటున్నాం అంటే పారిశ్రామికీకరణ చెందుతున్న యూరప్ శకంలో రూపుదిద్దుకుని, మన వర్తమానాన్ని, భవిష్యత్తును నిరంతరం వెలిగిస్తున్న ఒక మేధావిని మనం గౌరవించుకుంటున్నాం అని అర్థం. చరిత్ర విశ్లేషణ, సంఘీభావం, సాహసోపేతమైన ఊహాశక్తితో కలిసినప్పుడు అర్థవంతమైన మార్పు సాధ్యమవుతుందని మార్క్స్ మనకు గుర్తుచేస్తాడు. మార్క్స్ విశ్లేషించిన వైరుధ్యాలతో నేటికీ కొట్టుమిట్టాడుతున్న ప్రపంచంలో, సమసమాజ నిర్మాణం కోసం ఆయన ఇచ్చిన పిలుపు పిడి వాదం కాదనీ, అత్యున్నత మానవ సామర్థ్యానికి తగిన సమాజాన్ని సృష్టించాలనే ఆహ్వానమనీ మనం గ్రహించాలి. ఈ అసాధారణ మేధావి జన్మదినాన, మార్క్స్ నుండి మనం ఎంతటి వారసత్వాన్ని స్వీకరించాం, ఆయన దార్శనికతలోని విముక్తి వాగ్దానాన్ని నెరవేర్చడానికి మనం ఇంకెంత కృషి చెయ్యాలో అంచనా కట్టి అందుకు తగిన కార్యాచరణ చేపట్టడమే మార్క్స్ కు మనం అర్పించే ఘన నివాళి.

**(అనువాదం : కె. సత్యరంజన్)**

# డిల్లీ సుల్తానుల కాలం వ్యావసాయక సమాజం



రచయిత ప్రజాశక్తి మాజీ సంపాదకులు

ఎంవిఎస్ శర్మ

(గత మాసంలో వ్యవసాయంలో పండించిన వివిధ వంటల గురించి తెలుసుకున్నాం. ఇక కొనసాగింపు)

రాజ్యంలో వలు ప్రాంతాల్లో వ్యవసాయానికి అనుబంధంగా పశుపాలన ఉండేది. రైతులు పాడి పశువులను, ఎద్దులను కలిగివుండేవారు. కొన్ని ప్రాంతాల్లో మాత్రమే అచ్చంగా పశుపోషణ మీద ఆధారపడిన ప్రజలు ఉండేవారు. గేదెలు, ఆవులు ఇచ్చే పాలనుండి వచ్చే నెయ్యిని బట్టి వాటి విలువ ఉండేది. ఏడాదికి 109 కిలోల నెయ్యి వచ్చే మేరకు పాలను ఇచ్చే గేదెను, 64 కిలోల నెయ్యివచ్చే మేరకు పాలిచ్చే ఆవును ఉత్తమ జాతి పాడి పశువులుగా పరిగణించారని ఆనాటి లేఖకుడు అబ్దుల్ హమీద్ ఘుజ్నవి పేర్కొన్నాడు. అటువంటి గేదె ఖరీదు 10 నుండి 12 టంకాలు ఉండేదని, ఆవు ఖరీదు 3 నుండి 4 టంకాలు ఉండేదని తెలిపాడు. (టంకం అంటే వెండి నాణెం) పశువులను బండ్లు లాగేందుకు, గానుగలను తిప్పేందుకు, మోట తోడేందుకు వినియోగించేవారు.

పత్తి పంటను విరివిగా సాగు చేసేవారు. ప్రతీ గ్రామంలోనూ పత్తిని పండించడంతోబాటు ఆ పత్తినుండి నూలు వడకడం కూడా చేసేవారు. 14వ శతాబ్దం నాటికి రాట్నం (చరఖా) ను ఉపయోగించడం విస్తృతమైంది. నీలిమందు సాగు ఈ కాలంలోనే బాగా పెరిగింది. నీలి చెట్ల బెరళ్ళనుండి నీలి రంగును వేరు చేయడం కోసం జిప్సం, సున్నపురాయిని కలిపిన నీటిలో నానబెట్టడం తెలుసుకున్నారు. చెరకును గానుగ ఆడి తీసిన రసం నుండి బెల్లం ఉత్పత్తి చేయడంతోబాటు సారా తయారీ కూడా డిల్లీ చుట్టుపక్కల బాగా వ్యాపించింది.

ఉత్పత్తి ప్రక్రియల్లో 13-15 శతాబ్దాల కాలంలో అభివృద్ధి కనిపిస్తుంది. ఐతే సామాన్య రైతుకు గ్రామీణ కూలీకి మాత్రం భారీ భూమిశిస్తుల భారంతోబాటు అణచివేత విధానాలు తప్పలేదు. వాటికి తోడు కరువులు, వరదలు వచ్చిపడుతూవుండేవి. లభిస్తున్న సమాచారం బట్టి డిల్లీలో 1251లో, గుజరాత్‌లో 1256-58 మధ్య తీవ్ర కరువు పరిస్థితులు ఏర్పడ్డాయి. జలాలుద్దీన్ ఖిల్జీ పాలనాకాలంలో 1290-96 మధ్య కరువు కారణంగా ధరలు చాలా తీవ్ర స్థాయిలో పెరిగాయి. శివాలిక్ ప్రాంతం (తూర్పు రాజస్తాన్, హర్యానా ప్రాంతం) లో ప్రజలు నీటి చుక్క లేక వేల సంఖ్యలో డిల్లీ వచ్చి యమునానదిలో మునిగి ప్రాణాలు నిలుపుకున్నారు. 1333-34లో మొదలై దాదాపు ఏడేళ్ళు కొనసాగిన భయంకరమైన కరువు వేలాదిమంది ప్రాణాలను తీసింది. చచ్చిన జంతు కళేబరాలను పీక్కు తినే దృశ్యాలతోబాటు నరమాంసాన్ని తిన్న దృశ్యాలను కూడా ఆనాటి లేఖకులు నమోదు చేశారు.

**వ్యవసాయ రంగం-వర్గాలు**

ఇతర ప్రపంచంలో మధ్య యుగాల్లో పాలితులుగా ఉండే పేదలందరూ దాదాపు సమాన స్థాయిలో ఉండే పరిస్థితిని చూస్తాం. దానికి భిన్నంగా భారత ఉపఖండంలో మొత్తం గ్రామీణ ప్రజల మధ్య పెద్ద ఎత్తున అంతరాల దొంతరలు నెలకొడాన్ని చూస్తాం. అట్టడుగున భూమి లేని, హీన కులాలవారు ఉండేవారు. వీరికి సంబంధించిన ఎటువంటి చారిత్రిక ఆధారాలూ నమోదు కానేలేదు. ఎక్కడైనా ప్రస్తావన వస్తే అది వారు చేసే పారిశుధ్య పనికి సంబంధించి ఉండేది. వారిని భంగీలు అని పేర్కొనేవారు. దాదాపు వారి స్థాయిలోనే చాలా చిన్న స్థాయి రైతులు ఉండేవారు. వీరిని బలాహర్‌లు, ధానుక్‌లు, థోరీలు వంటి పేర్లతో పిలిచేవారు. వీరిలోనే గ్రామసేవకులు, వ్యవసాయ కూలీలు కూడా ఉండేవారు. తోటలను పెంచే మాలీలు, క్షురకులు, సారాయి కాచేవారు, వస్త్రాల నేతపని చేసేవారు కూడా అతి తక్కువ స్థాయికి చెందినవారిగా పరిగణింపబడేవారు. భూమిని దున్ని సాగు చేసే రైతులు వీరికన్నా పైస్థాయికి చెందినవారికింద లెక్క.

ఐతే ఈ రైతులను గౌరవప్రదంగా చూసేవారని భావించలేము. రైతుల భూమిని కలిగివుండే హక్కు ఉన్న స్వేచ్ఛాపౌరులు అయినప్పటికీ, వారు తమ భూమిని విడిచిపెట్టి పోవడానికి వీలు లేదు. ఒక విధమైన అర్థబానిస జీవితం వారిది. ఆ కాలంలో సాగులోకి రాకుండా ఖాళీగా ఉన్న భూములు ఎక్కువగా ఉండేవి. అందుచేత రైతు ఎక్కడికైనా పోయి వ్యవసాయం చేసుకోడానికి వీలు ఉంది. ఆ అవకాశాన్ని లేకుండా చేసినప్పుడే రైతు ప్రస్తుతం సాగు చేస్తున్న భూమిలోనే కొనసాగుతాడు. భూమి శిస్తూ చెల్లిస్తాడు. అందుచేతనే రైతులను తమ తమ భూములను వదలిపెట్టిపోడానికి వీలు లేని విధంగా నిర్బంధవిధానాలను అమలు చేసేవారు పాలకులు.

ఈ రైతుల్లో బలహీనంగా, ఎటువంటి వనరులూ లేని రైతులూ ఉండేవారు. తగినంత పెట్టుబడి కలిగివుండి కూలీలను నియోగించి వ్యవసాయం చేసే ధనిక రైతులూ ఉండేవారు. ఈ ధనిక రైతులనుండే గ్రామ పెద్ద ఉండేవాడు. వారిని ఖోట్ అని, ముకద్దమ్ అని పిలిచేవారు. వాళ్ళు ప్రభుత్వం తరపున రైతులనుండి పన్నులు వసూలు చేసేవాళ్ళు. ఆ పన్నును ఖోటీ అని అనేవారు. గ్రామ పెద్దలకే గ్రామ సేవకులమీద, వృత్తిదారులమీద పెత్తనం ఉండేది. ఏ రైతు ఎంత పన్ను చెల్లించాలో వారే నిర్ణయించేవారు. గ్రామపెద్దలకు పన్ను మినహాయింపు ఉండేది. అల్లావుద్దీన్ ఖిల్జీ అధికారంలోకి వచ్చేనాటికి ఈ గ్రామపెద్దలు స్తోమత కలిగి, గుర్రాలమీద ప్రయాణం చేస్తూ, ఆయుధాలను కూడా ధరించి మంచి దుస్తులతో కనపడేవాళ్ళు.

ఈ గ్రామపెద్దలు పరిపాలనలో కీలక స్థానంలో ఉండడంతో అల్లావుద్దీన్ ఖిల్జీ

> **" ఈ కొత్త పన్ను విధానం అమలు కావాలంటే ప్రతీ గ్రామానికీ సంబంధించి రికార్డులను నిర్వహించడం అవసరం. ఈ పని చేయడానికి పట్వారీ అనే కొత్త తరగతి వచ్చింది. పన్ను వసూళ్ళను పెంచుకోవడం తోబాటు వ్యవసాయ ఉత్పత్తుల ధరలను తక్కువ స్థాయిలోనే ఉండేట్టు చూడడం కూడా అవసరం అని అల్లావుద్దీన్ గ్రహించాడు. అప్పడే తక్కిన ఇతర ఉత్పత్తుల ధరలు కూడా తక్కువగా ఉంటాయి. అందుకోసం కొంత ప్రాంతంలో శిస్తులను ధాన్యం రూపంలో వసూలు చేయ డానికి ఆదేశించాడు. "**




(1296–1316) వాళ్ళని అదుపులో పెట్టడానికి పూనుకున్నాడు. ముందుగా వారికి అంతవరకూ ఉండిన పన్ను మినహాయింపును రద్దు చేశాడు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన ఘియాసుద్దీన్ తుగ్లఖ్ (1320–1324) గ్రామపెద్దలకు భూమి శిస్తునుండి మాత్రం మినహాయింపునిచ్చి పంట శిస్తును కొనసాగించాడు. అతడి అనంతరం వచ్చిన మహమ్మద్ తుగ్లఖ్(1324–1351) మళ్ళీ గ్రామపెద్దల పట్ల కఠిన వైఖరినే చేపట్టాడు. దాంతో గంగా–యమున డెల్టా ప్రాంతంలో గ్రామపెద్దలు తిరుగుబాటు చేశారు. వారి సైన్యంలో ముస్లిం సైనికులు కూడా ఉన్నట్టు అప్పటి లేఖకుడు ఇబన్ బట్టూటా నమోదు చేశాడు. ఆ తర్వాత గద్దెనెక్కిన సుల్తాన్ ఫిరోజ్ షా గ్రామపెద్దలకు చాలా అనుకూలంగా వ్యవహరించాడు. దాంతో గ్రామపెద్దల జీవన స్థాయి చాలా మెరుగుపడింది.

7, 8 శతాబ్దాలనుండి ఆశ్విక దళాలలో చేరి యుద్ధాలు చేయడంలో నైపుణ్యం కలిగిన తరగతి తలెత్తింది. వీరే రాజపుత్రులు. గ్రామ్యం లో వీరిని 'రౌతులు' అని అనేవారు. ఈ సైనిక వర్గం క్రమంగా తమను తాము ఒక వేరే కులంగా చెప్పుకోడం మొదలుపెట్టారు. క్రమంగా వేరువేరు తెగలనుండి పలువురు వచ్చి తమదీ ఉన్నత వంశమేనని చెప్పుకుంటూ ఈ రాజపుత్రులలో చేరారు. క్రమంగా సైనిక శక్తితోబాటు భూమి పైన హక్కులు కూడా కలిగిన వర్గంగా రాజపుత్రులు రూపొందారు. తమ ఆధీనంలో ఉండే భూముల మీద సాగు చేసే రైతులనుండి శిస్తు వసూలు చేసి రాజ్యానికి చెల్లించడంతోబాటు అవసరమైనప్పుడు సైనిక బలగాలను కూడా సరఫరా చేసేవారు. సుల్తాన్‌కు, రాజపుత్రులకు మధ్య స్థాయిలో రణకులు లేదా రాణాలు ఉండేవారు. సుల్తాను సార్వభౌమాధికారానికి లోబడివుంటూనే ఈ రాణాలు విశాల భూభాగాలమీద పట్టు కలిగివుండేవారు. వీరే తర్వాత కాలంలో జమీందారులు అనే ఒక కొత్త తరహా వర్గంగా రూపొందారు. సుల్తాన్‌కు లోబడివుంటూ తమ పరిధిలోని భూభాగాలమీద పెత్తనం చెలాయిస్తూ సుల్తాన్‌కు శిస్తు చెల్లిస్తూవుండేవారు.

**వ్యవసాయ పన్నుల విధానం**

డిల్లీ సుల్తానుల పాలన మొదలయేనాటికి శిస్తును ధనం రూపేణా చెల్లించే విధానం ఉనికిలోకి వచ్చింది. ఐతే ఎంత శిస్తును చెల్లించాలి అన్న విషయంలో స్పష్టమైన విధానం ఉండేది కాదు. చాలా సందర్భాల్లో శిస్తు వసూలు పేరుతో గ్రామాలను కొల్లగొట్టడం జరుగుతూవుండేది. అల్లావుద్దీన్ ఖిల్జీ తన రాజ్యం ఆదాయాన్ని బాగా పెంచుకోవాలనుకున్నాడు. ఐతే అందుకోసం భూమి శిస్తును నిర్ణయించే విధానాన్ని, వసూలు పద్ధతులను క్రమబద్ధం చేశాడు. పంట దిగుబడి ఎక్కువగా వచ్చే డెల్టా ప్రాంతంలో దిగుబడిలో సగం భాగాన్ని పన్నుగా నిర్ణయించాడు. పన్ను ఆదాయాన్ని పెంచుకునే ప్రయత్నంలో భాగంగా అన్ని రకాల పన్ను రాయితీలనూ రద్దు చేశాడు. పాడి పశువులమీద, గొర్రెలు, మేకలతో సహా, పన్ను విధించాడు.

ఈ కొత్త పన్ను విధానం అమలు కావాలంటే ప్రతీ గ్రామానికీ సంబంధించి రికార్డులను నిర్వహించడం అవసరం. ఈ పని చేయడానికి పట్వారీ అనే కొత్త తరగతి వచ్చింది. పన్ను వసూళ్ళను పెంచుకోవడం తోబాటు వ్యవసాయ ఉత్పత్తుల ధరలను తక్కువ స్థాయిలోనే ఉండేట్టు చూడడం కూడా అవసరం అని అల్లావుద్దీన్ గ్రహించాడు. అప్పుడే తక్కిన ఇతర ఉత్పత్తుల ధరలు కూడా తక్కువగా ఉంటాయి. అందుకోసం కొంత ప్రాంతంలో శిస్తులను ధాన్యం రూపంలో వసూలు చేయడానికి ఆదేశించాడు. అలా పోగుబడిన ధాన్యాన్ని తన కోటలో నిల్వ ఉంచి ఎక్కడైనా ఆహారధాన్యాల కొరత వచ్చినప్పుడు ధరలు పెరగకుండా అక్కడ తన నిల్వలను మార్కెట్ లోకి విడుదల చేయించేవాడు. తద్వారా ఆ ధాన్యం రేటును తానే నిర్ణయించగలిగేవాడు. అల్లావుద్దీన్ పాలనాకాలం అంతా ఒకే స్థాయి వద్ద ఆహారధాన్యాల ధరలు కొనసాగడం విశేషం.

ఐతే పన్నుల భారం మోయలేనిదిగా మారి రైతుల జీవితాలు అతలాకుతలం అయిపోసాగాయి. దానికి తోడు కరువు కాటకాలు పరిస్థితిని దుర్భరం చేయసాగాయి. ఈ సమయంలో మహమ్మద్ తుగ్లఖ్ రాజ్య ఖజానా నుంచి భారీ మొత్తాలను రైతులకు రుణాలుగా పంపిణీ చేయించాడు. పంటల మార్పిడి విధానాన్ని కూడా అమలు చేశాడు. దానితో దిగుబడి పెరిగింది. వ్యవసాయం నిర్వహణలో ప్రభుత్వం ప్రత్యక్ష జోక్యం చేసుకోడానికి ఇది తొలి ఉదాహరణగా చెప్పవచ్చు. ఐతే ఈ జోక్యం వలన ఎక్కువగా లాభపడినది గ్రామపెద్దలు, ధనిక రైతులు మాత్రమే.

**పాలనావ్యవస్థ–ఇక్తా పద్ధతి**

సుల్తాను తరఫున వివిధ ప్రాంతాల్లో పన్నులు వసూలు చేసే అధికారం సుల్తాను

నియమించిన ప్రాంతీయ అధికారులకు ఉండేది. వాళ్ళు వసూలు చేసిన పన్నుల్లో కొంత భాగాన్ని మాత్రం సుల్తానుకు చెల్లించి తక్కిన భాగాన్ని వారివద్దే అట్టిపెట్టుకునేవారు. దాంతో తమ పోషణ, తమ సైనిక దళాల పోషణ సాగించేవారు. ఇలా కొంత భూభాగాన్ని ప్రాంతీయ అధికారులకు కేటాయించడాన్ని 'ఇక్తా' అనేవారు. ఇక్తా కేటాయించబడిన ప్రాంతీయ అధికారిని ముఖ్తి అనేవారు. వీరి ద్వారా సుల్తానుకు లభించే ఆదాయం పరిమితంగానే ఉండేది. ఇది గాక సుల్తానుకు నేరుగా ఆదాయం లభించేందుకు కొన్ని ప్రాంతాలను అట్టిపెట్టుకునేవాడు. అటువంటి ప్రాంతాలను ఖాలిసా అనేవారు. డిల్లీ పరిసర ప్రాంతాల్లో ఎక్కువ భూభాగాన్ని ఇలా ఖాలిసాలుగా పరిగణించేవారు. ఆ ప్రాంతాల్లో పన్నులు వసూలు చేసి జమ చేయడానికి పర్యవేక్షకులను నియమించేవారు. (చూ. 14వ శతాబ్దం నాటి ఉత్తర భారతదేశ పటం)

### 13, 14 శతాబ్దాల నాటి పట్టణాలు, వృత్తులు, వాణిజ్యం, ఆర్థిక విధానాలు – పట్టణాలు

మధ్య యుగాలలో జనాభాలో అత్యధిక భాగం గ్రామాల్లోనే జీవించేవారు. ఆ గ్రామాలు కూడా చిన్న చిన్నవిగానే ఉండేవి. గ్రామం సైజు ఎంత పెద్దదైతే ఆ గ్రామం పొలాలు ఆ ఊరికి అంత దూరంగా ఉండవలసివచ్చేది. కనుక వాటి సైజు చిన్నగానే ఉండేది. ఇక పట్టణాలలో వ్యవసాయేతర జనాభా జీవించేవారు. ముఖ్యంగా చేతివృత్తుల వారు వేరు వేరు వృత్తులలో ఉన్నప్పటికీ, ఒక దగ్గరే జీవించ వలసిన అవసరం ఉండేది. చేనేత వృత్తిదారుడికి కావలసిన మగ్గం తయారు చేయడానికి ఒక వడ్రంగి కావాలి. ఆ వడ్రంగి ఉపయోగించే పనిముట్లను తయారు చేయడానికి ఒక కమ్మరి కావాలి. ఆ కమ్మరి కొలిమిని ఏర్పాటు చేసుకోడానికి ఇటుకల బట్టీ, కొలిమి తిత్తి కోసం తోలు కావాలి. ఇవన్నీ ప్రత్యేకంగా వేరు వేరు వృత్తులవారు తయారు చేయగలిగేవి. ఈ వృత్తులవారందరూ ఒకేదగ్గర ఉండడం అవసరం. వీళ్ళు తయారు చేసిన సరుకుల అమ్మకానికి, వీరికి కావలసిన ముడిసరుకులను అందించడానికి మార్కెట్ అవసరం. ఇటువంటివన్నీ కేంద్రంగా ఉండే పట్టణాలు రూపొందాయి. ఐతే, వీటితోబాటు రాజ్య పాలనావ్యవస్థ, ఉన్నతాధికారులు, రాజ బంధువులు, సైన్యం ఒకే దగ్గర ఉండాలి. వారందరికీ సేవ చేయడానికి సేవకులు కావాలి.

" మధ్య యుగాలలో జనాభాలో అత్యధిక భాగం గ్రామాల్లోనే జీవించేవారు. ఆ గ్రామాలు కూడా చిన్న చిన్నవిగానే ఉండేవి. గ్రామం సైజు ఎంత పెద్దదైతే ఆ గ్రామం పొలాలు ఆ ఊరికి అంత దూరంగా ఉండవలసివచ్చేది. కనుక వాటి సైజు చిన్నగానే ఉండేది. ఇక పట్టణాలలో వ్యవసాయేతర జనాభా జీవించేవారు. ముఖ్యంగా చేతివృత్తుల వారు వేరు వేరు వృత్తులలో ఉన్నప్పటికీ, ఒక దగ్గరే జీవించ వలసిన అవసరం ఉండేది. "




ఈ పరిపాలనా యంత్రాంగం కూడా పట్టణాలలో ప్రధాన భాగం అయింది.

క్రీ.శ. 300–1000 మధ్య కాలంలో మధ్యయుగాల భారతంలో పట్టణాలు క్రమేపీ క్షీణిస్తూవచ్చాయి. ఐతే, 13వ శతాబ్దం నుంచీ పరిస్థితి మారింది. కొత్త వృత్తులు, కొత్త సాంకేతికత ప్రవేశించాయి. సుల్తానులు భారీ మొత్తంలో రైతాంగం నుంచి మిగులును పన్నుల రూపంలో వసూలు చేసి పోగుచేశారు. దాంతో పట్ణ ప్రాంతాల విస్తరణ మొదలైంది. మొదట్లో డిల్లీ పట్టణం అంతా కుతుబ్‌మినార్ చుట్టూ విస్తరించివుండేది. ఆ తర్వాత ఈ ప్రాంతం జనాభా బాగా పెరిగిపోయింది. దాంతో యమున ఒడ్డున మరొక నగరం పెరగనారంభించింది. ఇప్పుడు దానినే నిజాముద్దీన్ అని అంటున్నారు. అప్పట్లో దానికి కిలోఖ్రీ అనేవారు. అల్లావుద్దీన్ ఖిల్జీ కాలంలో సిరి అనే మరొక నగరం రూపొందింది. ఘయాసుద్దీన్ కాలంలో తుగ్లఖాబాద్ అనే మరొక నగరనిర్మాణాన్ని చేపట్టాడు. మహమ్మద్ తుగ్లఖ్ జహాపనా అనే మరొక ప్రాంతాన్ని నగరంగా నిర్మించాడు. ఇలా డిల్లీ చుట్టుపక్కల నగరాలు పెంపొందాయి. (చూ. మ్యాప్ 2.1)

1398కి ముందు కుతుబ్–డిల్లీ, జహాపనా, సిరి, తుగ్లఖాబాద్ కలిసిన ప్రాంతం 3.7 చ.కి.మీ. విస్తీర్ణంలో ఉండేది. ఆ ప్రాంతంలో సుమారు 1,10,000 నుండి 1,48,000 మధ్య జనాభా ఉండేవారు. ఇక ఘయాస్పూర్, కిలోఖ్రీ కూడా కలిపితే సుమారు 3,50,000 మంది ఉండివుండవచ్చు. ఆ కాలంలో డిల్లీకి సరితూగే స్థాయిలో ఉన్న మరో నగరం ఏదన్నా ఉందంటే అది దక్కన్‌లో ఉన్న దౌలతాబాద్ మాత్రమే. దానినే దేవగిరి అని కూడా అంటారు. ఇక ఆ కాలంలో తక్కిన నగరాల్లో హుగ్లీ ఒడ్డున శతగావ్, సిర్సా, కనూజ్, గ్వాలియర్, గాంధార్, మంగుళూరు, పుదుపట్టణ, మదురై వంటివి ప్రస్తావించ బడ్డాయి. బహుశా ఈ కాలంనాటికి పట్టణ జనాభా మొత్తం జనాభాలో 9 శాతం వరకూ ఉండివుండొచ్చు.

(సశేషం)

# ట్రంప్ చైనా పర్యటన నేర్పుతున్న పాఠాలు



రచయిత ప్రముఖ చరిత్రకారుడు, పాత్రికేయుడు. 40 పుస్తకాలవరకు రాశారు. 'ట్రైకాంటినెంటల్:ఇన్‌స్టిట్యూట్ ఫర్ సోషల్ రిసెర్చ్" ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్. న్యూ ఢిల్లీలోని లెఫ్ట్ వర్డ్ బుక్స్ ప్రధాన సంపాదకులు

**విజయ ప్రసాద్**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల చైనా పర్యటించి సి జిన్‌పింగ్‌తో శిఖరాగ్ర సమావేశం జరిపినప్పుడు పశ్చిమ దేశాల మీడియా ఎప్పటిలాగే బ్రహ్మాండమైన స్వాగత సత్కారాల గురించీ, విలాసవంతమైన విందుల గురించీ, సైనిక వందనాలు, సాదర పలకరింపుల గురించీ ఊదరగొట్టాయి. అమెరికా అధ్యక్షుల వారి మనసును దోచేందుకే ఇవన్నీ ఏర్పాటు చేయబడ్డాయన్న విషయం అందరికీ తెలుసు. కానీ ఈ వేడుకలన్నిటి వెనుక కఠినమైన, ప్రభావ వంతమైన ఒక వాస్తవం దాగుంది. అమెరికా ఈ శిఖరాగ్ర సభకు ఆత్మవిశ్వాసంతో కూడిన స్థానంలో ఉండి రాలేదు. దుర్భల స్థితిలో వచ్చింది. తనకు తానుగా నెత్తికి తెచ్చుకున్న అనేక సమస్యలతో అది చైనా రాజధానిలో అడుగుపెట్టింది. ఇజ్రాయిల్‌తో కలిసి అమెరికా ఇరాన్‌పై ప్రారంభించిన ప్రమాదకరమైన, చట్టవిరుద్ధమైన యుద్ధం, ప్రపంచ ఆర్థిక అస్థిరత, వర్ధమాన దేశాలతో దౌత్య సంబంధాల్లో ఒంటరిపాటు కావడం, తరిగిపోతున్న అమెరికా పారిశ్రామిక, సాంకేతిక ఆధిపత్యం పట్ల పెరుగుతున్న ఆందోళన...వీటన్నిటినీ మోసుకుని ట్రంప్ బీజింగ్‌లో అడుగుపెట్టారు. మరోవైపు చైనా ఈ చర్చల్లో స్థిర చిత్తంతో పాల్గొంది. చరిత్ర మారుతున్నదని నిరూపించడానికి చైనాకు నాటకీయ అభివ్యక్తీకరణలేమీ అవసరం లేదు.

ఆఫ్రికా, ఆసియా, లాటిన్ అమెరికా ఖండాల్లోని అనేక దేశాలు ఇప్పటికే తెలుసుకున్న ఒక సత్యాన్ని – అంటే అమెరికా సైనికంగా ఇంకా ప్రమాదకరంగానే ఉండొచ్చుగాక కానీ దానికి తిరుగులేని రాజకీయ ఆధిపత్యం ఇంక ఏమాత్రం లేదు అన్న విషయాన్ని ఈ శిఖరాగ్ర సభ మరోసారి వెల్లడించింది. శిఖరాగ్ర సభలో చైనా వ్యవహరించిన తీరు ఈ కొత్త ప్రపంచ బలాబలాల తీరును ప్రతిబింబించింది. పశ్చిమ దేశాల్లోని పాలక పార్టీల కొమ్ముకాసే రాజకీయ విశ్లేషకులు కూడా ఈ మార్పును గమనించారు. "చైనా పైచేయి సాధించబోతోంది" అని సమావేశానికి ముందే అమెరికాకు చెందిన విదేశీ వ్యవహారాల మండలి పేర్కొంది. అమెరికా రూపొందించిన ప్రపంచ క్రమానికి చైనా లోబడి ఉండాలని అమెరికా అనేక దశాబ్దాలుగా పట్టుపడుతూ వచ్చింది. కానీ చైనా రాజధాని బీజింగ్‌లో వాస్తవం తిరగబడింది. చైనాను ఆదేశించడానికి ట్రంప్ రాలేదు, సహాయం కోరడానికి వచ్చారు.

ఇరాన్ సమస్య ఈ వాస్తవాన్ని మరింత స్పష్టంగా వెల్లడించింది. పశ్చిమాసియాలో అంతులేని సైనిక కార్యకలాపాల్లో అమెరికా చిక్కుకున్నది. గత పాతికేళ్లుగా అది చేసిన యుద్ధాలు – ఇరాక్, సిరియాల నుండి నేడు ఇరాన్‌పై జరుగుతున్న యుద్ధం వరకు అమెరికాను వ్యూహాత్మకంగా బలహీన పరిచాయి. అదే సమయంలో ఈ యుద్ధాలు ఈ ప్రాంతాన్ని తీవ్రమైన ఈతిబాధల్లోకి నెట్టాయి. తానొక్కటే పరిస్థితిని చక్కదిద్దలేనని అమెరికా ప్రభుత్వానికి ఇప్పుడు తెలిసొచ్చింది. చైనాకు ఇరాన్‌తో ఉన్న ఆర్థిక సంబంధాలు, ఈ ప్రాంతంలో దానికి పెరుగుతున్న దౌత్య ప్రతిష్ట ఇవన్నీ దానికి ప్రతిష్టను ఇస్తున్నాయి. అమెరికా ఆ ప్రతిష్టను కోల్పోయింది.

అమెరికా ప్రభుత్వం చైనా మీద ఆధారపడిపోయిందని విశ్లేషకులు బహిరంగంగానే చెబుతున్నారు. "ఇరాన్‌ను వెనక్కు తగ్గేట్లు చేయడంలో చైనా పెద్ద పాత్ర వహించగలదు" అని ఆల్ జజీరా పేర్కొంది. "ఇరాన్‌లో జరుగుతున్న ప్రస్తుత యుద్ధం నుండి బయటపడేయడానికి సహాయం చేయాల్సిందిగా అమెరికా చైనాను కోరుతుందా" అన్న విషయాన్ని తెలుసుకోడానికి పరిశీలకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు అని ఈశాన్య విశ్వవిద్యాలయ విశ్లేషకులు పేర్కొన్నారు. శిఖరాగ్ర సభకు సంబంధించి ట్రంప్ స్వంత ఎజెండా కూడా అది చైనాపై ఆధారపడిన విషయాన్ని తెలియజేస్తోంది. హార్ముజ్ జలసంధిపైనా, ఇరాన్ అణు కార్యక్రమంపైనా, ప్రాంతీయ స్థిరత్వంపైనా చర్చలు కేంద్రీకరించబడ్డమే దీనికి నిదర్శనం. ఇది చాలా కీలకమైన విషయం: దశాబ్దాలపాటు తను తిరుగులేని శక్తినని చెప్పుకున్న అమెరికా ఇప్పుడు తను సృష్టించిన సంక్షోభం నుండి బయటపడేయడానికి చైనా సహాయం కోరుతోంది.

### నిమ్మళంగా ఉన్న చైనా

ఈ వాస్తవాన్ని చైనా గుర్తించింది గనుక దానికనుగుణంగానే ప్రవర్తించింది. చైనా అధ్యక్షుడు సి జిన్‌పింగ్ ఎటువంటి హావభావాలు వ్యక్తం చేయలేదు. నాటకీయ హెచ్చరికలు చేయలేదు. ఈనాడు అమెరికా రాజకీయ సంస్కృతిలో భాగం అయిపోయిన ఆవేశపూరిత అస్థిర ప్రకటనలు చేయలేదు. ఆయన చాలా స్థితప్రజ్ఞతతో వ్యవహరించారు.

తైవాన్ విషయంలో సి జిన్‌పింగ్ భావోద్వేగం ప్రదర్శించ లేదు, స్థిరంగా ఉన్నారు. ఈ విషయాన్ని సరిగ్గా పరిష్కరించకపోతే "యుద్ధాలు" సంభవిస్తాయి అని ఆయన చెప్పినట్లు శిఖరాగ్ర సభనుండి వచ్చిన వార్తలు తెలిపాయి. ఇదేమీ భయాందోళనతో కూడిన భాష కాదు.

ఇది వ్యూహాత్మకమైన స్పష్టత ఉన్న భాష. ఈ రోజు ప్రపంచ రాజకీయాల్లో తీవ్రమైన ప్రమాదం ఆత్మగౌరవాన్ని కోరుకునే ఎదుగుతున్న దేశాల నుండి రాదు, తన పరిమితులను తెలుకోడానికి నిరాకరించే దిగజారిపోతున్న ప్రపంచ శక్తి (అంటే అమెరికా) నుండే వస్తుంది అనేది చైనా ప్రభుత్వ అవగాహన. వర్ధమాన ప్రపంచానికి ఈ తేడా చాలా అవసరమైనది. సామ్రాజ్యవాద అస్థిరత్వంతో వ్యవహరించే టప్పుడు అనేక వర్ధమాన దేశాలకు ఈ అనుభవం ఎదురైంది. సామ్రాజ్యాలు కూలిపోతున్న సమయంలో చాలా అస్తవ్యస్థంగా ప్రవర్తిస్తాయన్న విషయం వాటికి తెలుసు. ఆ విషయాన్ని దృష్టిలో పెట్టుకునే సి జిన్‌పింగ్ ఈ శిఖరాగ్ర సమావేశంలో "థుసిడైడ్స్" అనే మాట ఉపయోగించారు. దిగజారిపోతున్న శక్తి ఎదుగుతున్న శక్తుల పట్ల దుందుడుకుగా వ్యవహరిస్తుంది అని ఈ మాటకు అర్థం. ప్రపంచంలో అందరూ శాంతియుతంగా అభివృద్ధి చెందాలంటే ఈ రకమైన వైఖరిని విడనాడాలని ఆయన కోరారు. ఆర్థిక తిరోగమనం తరచూ సైనికీకరణకు దారితీస్తుంది. రాజకీయ విచ్ఛిన్నం విదేశీ దండయాత్రలకు దారితీస్తుంది. నేటి అమెరికా సరిగ్గా ఈ లక్షణాలనే ప్రదర్శిస్తోంది. అమెరికా ఉన్నత వర్గాలు నిరంతరం "పోటీ" గురించీ, "నిలువరించడం" గురించీ మాట్లాడుతున్నారు. మరోవైపు దాని దేశీయ సంస్థలు తీవ్రమైన ఆమోదయోగ్యతకు సంబంధించిన సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి.

అందువల్ల ఈ శిఖరాగ్ర సభలో చైనా ప్రవర్తన తూర్పు ఆసియా దేశాలకే కాక ఇతర దేశాలకు కూడా ఒక రాజకీయ పాఠాన్ని నేర్పుతోంది. ఎటువంటి లొంగుబాటు లేకుండా, ఎటువంటి నాటకీయత లేకుండా అమెరికా ఒత్తిడిని ప్రతిఘటించడం సాధ్యమే అని సి జిన్‌పింగ్ చూపించారు. భావోద్వేగపూరిత ఖండనమండనలు, లేదా గొప్పలు పోవడాలు... ఇటువంటివేమీ లేవు. చైనా అమెరికా ముందు ఒక సమాన సార్వభౌమ దేశంగా వ్యవహరించింది. ఆ సమానత్వాన్ని ప్రశాంతంగా ప్రదర్శించింది. వర్ధమాన దేశాలకు ఇటువంటి ప్రవర్తన చాలా అవసరం. ఎందుకంటే వీటిలో చాలా దేశాలు తమ దేశాలకు సంబంధించిన అభివృద్ధి ప్రాజెక్టులు చేపట్టేటప్పుడు విపరీతమైన ఒత్తిడిని ఎదుర్కొంటుంటాయి. తాత్కాలిక స్థిరత్వం కోసం అమెరికా ముందు సాగిలపడే పాత పద్ధతికి కాలం చెల్లి పోతోంది. ఆఫ్రికా, లాటిన్

"అందువల్ల ఈ శిఖరాగ్ర సభలో చైనా ప్రవర్తన తూర్పు ఆసియా దేశాలకే కాక ఇతర దేశాలకు కూడా ఒక రాజకీయ పాఠాన్ని నేర్పుతోంది. ఎటువంటి లొంగుబాటు లేకుండా, ఎటువంటి నాటకీయత లేకుండా అమెరికా ఒత్తిడిని ప్రతిఘటించడం సాధ్యమే అని సి జిన్‌పింగ్ చూపించారు. భావోద్వేగ పూరిత ఖండనమండనలు, లేదా గొప్పలు పోవడాలు... ఇటువంటివేమీ లేవు. చైనా అమెరికా ముందు ఒక సమాన సార్వభౌమ దేశంగా వ్యవహరించింది."



బీజింగ్‌లో అమెరికా అధ్యక్షుడు ట్రంప్, చైనా అధ్యక్షుడు సి జిన్‌పింగ్ కరచాలనం

అమెరికా, ఆసియాలోని అనేక దేశాల ప్రభుత్వాలు ఇప్పుడు ప్రాంతీయ సమైక్యత, పేద దేశాల మధ్య సహకారం, వైవిధ్యమైన వాణిజ్య సంబంధాలు, వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి వంటి ప్రత్యామ్నాయాలను వెదుక్కుంటున్నాయి. ఇటువంటి స్వయంప్రతిపత్తి కేవలం ఒక ఆశ కాదు, భౌతికంగా సాధ్యమే అని ఈ శిఖరాగ్రసభ నిరూపించింది.

ప్రపంచ ఆర్థిక వ్యవస్థ బలాబలాల్లో వస్తున్న మార్పులను కూడా ట్రంప్ ప్రతినిధివర్గం ప్రపంచానికి చాటి చెప్పింది. అమెరికాకు చెందిన ప్రధానమైన కార్పొరేట్ ఎగ్జిక్యూటివ్‌లు అందరూ అమెరికా అధ్యక్షునితోపాటు చైనా వచ్చారు. వాళ్లంతా చైనా మార్కెట్ కోసం తహతహలాడిపోయారు. వ్యవసాయ సరుకుల కొనుగోళ్లు, బోయింగ్ అమ్మకాలు, అరుదైన ఖనిజాలు, టెక్నాలజీ మీద జరిగిన చర్చలు ఒక లోతైన వాస్తవాన్ని వెల్లడించింది: అదేమంటే, అమెరికాకు చైనా అవసరమైనంతగా చైనాకు అమెరికా అవసరం లేదు. అమెరికా వ్యవసాయోత్పత్తులను కొనుగోలు చేయడానికి చైనా అంగీకరించింది. ట్రంప్ సృష్టించిన వాణిజ్య యుద్ధం వల్ల నష్టపోయిన అమెరికా రైతులకు ఇది గొప్ప ఉపశమనం కలిగిస్తుంది. విచిత్రమైన పరిస్థితి ఇది. అమెరికా బలాన్ని ప్రదర్శించడం కోసం ఆ దేశ ప్రభుత్వం రూపొందించిన వాణిజ్య యుద్ధం ఏ రకమైన పరిస్థితిని సృష్టించిందంటే ఇప్పుడు అమెరికానే దాని నుండి ఉపశమనం కోరుకుంటున్నది.

ఈలోగా చైనా ఎంతో ఓర్పుతో తన దీర్ఘకాలిక పారిశ్రామిక సామర్థ్యాన్ని, సాంకేతిక పురోగమనాన్ని, యురాసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాల్లో దౌత్య సంబంధాలను నిర్మించుకుంటున్నది. సైనిక కూటములు కట్టడం చైనా వ్యూహం కాదు. ప్రాధమిక సదుపా యాలు,

**"శిఖరాగ్ర సభలో చైనా ప్రతిస్పందన కేవలం దౌత్యపర మైనది మాత్రమే కాదు, అందులో బోధనాశాస్త్ర పరమైన (పెడగోజికల్) అంశాలు చాలా ఉన్నాయి. ఒక సామ్రాజ్యవాద శక్తిని ఎదుర్కొనేటప్పుడు భయాందోళనలు వదిలేయాలి, సార్వభౌమా ధికారాన్ని నిలుపుకోవాలి, అగౌరవపరిస్తే అంగీకరించకూడదు, దీర్ఘకాలిక సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలి, అన్నిటికీ మించి చరిత్ర ముందుకు పోతున్నదన్న విషయాన్ని గుర్తించుకోవాలి."**

వాణిజ్యం, ఆర్థిక కార్యకలాపాలు, అభివృద్ధి ద్వారా సంబంధాలు ఏర్పరచుకోవడం దాని వ్యూహం. ఈ వ్యూహం గురించి ఎవరైనా విమర్శించ వచ్చు. కానీ ఇది ప్రశ్నన్న యుద్ధం దగ్గరినుండి అమెరికా విదేశాంగ విధానంలో ఒక భాగమైపోయిన శాశ్వత యుద్ధ వ్యూహానికి భిన్నమైన వ్యూహం.

దీనంతటి అర్థం చైనాలో వైరుధ్యాలు లేవని కాదు, లేక ప్రపంచ రాజకీయాలన్నీ శాంతియుతంగా పురోగమిస్తున్నాయనీ కాదు. అదెంతమాత్రం కానే కాదు. కానీ ఈ శిఖరాగ్ర సభ ఒక చారిత్రకాభివృద్ధి సారాన్ని స్పష్టం చేసింది. అదేమంటే, ఎదురులేని అమెరికా ఆధిపత్యం అంతమైపోయింది. అమెరికా వద్ద ఇప్పటికీ విపరీతమైన సైనిక శక్తి ఉంది. అది తలుచుకుంటే వినాశకరమైన హింసను సృష్టించగలదు. అటువంటి ప్రమాదరకమైన సామర్థ్యం దానికున్న మాట వాస్తవం. కానీ ఒక నాడు అమెరికాలో ఉన్న రాజకీయ స్థైర్యం నేడు దానిలో తరిగిపోయింది. అమెరికా రానురాను బెదిరింపులు బుజ్జగింపుల మధ్య, నిర్బంధాలు సహాయం కోసం విజ్ఞప్తుల మధ్య కొట్టుమిట్టాడుతోంది. ఈ వైరుధ్యాలు నేడు అందరికీ కనిపిస్తున్నాయి.

అందువల్ల శిఖరాగ్ర సభలో చైనా ప్రతిస్పందన కేవలం దౌత్యపరమైనది మాత్రమే కాదు, అందులో బోధనాశాస్త్ర పరమైన (పెడగోజికల్) అంశాలు చాలా ఉన్నాయి. ఒక సామ్రాజ్యవాద శక్తిని ఎదుర్కొనేటప్పుడు భయాందోళనలు వదిలేయాలి, సార్వభౌమాధికారాన్ని నిలుపుకోవాలి, అగౌరవపరిస్తే అంగీకరించకూడదు, దీర్ఘకాలిక సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలి, అన్నిటికీ మించి చరిత్ర ముందుకు పోతున్నదన్న విషయాన్ని గుర్తించుకోవాలి. సి జిన్‌పింగ్ ప్రదర్శించిన ప్రశాంత చిత్తత ఇతర వర్ధమాన దేశాలకు ఇదే విషయాన్ని చెబుతోంది. బీజింగ్‌లో జరిగిన శిఖరాగ్ర సభ చైనా శతాబ్దం వస్తుందనడానికి సంకేతం కాదు. ఎందుకంటే, చరిత్ర అటువంటి నినాదాలకన్నా చాలా సంక్లిష్టమైనది. కానీ ఈ శిఖరాగ్ర సభ మాత్రం ప్రపంచ చైతన్యంలో వస్తున్న మార్పును సూచించింది. దిగజారిపోతున్న సామ్రాజ్యవాది చుట్టూ భయాందోళనలు పెంచుకోవడం ద్వారా మనం భవిష్యత్తును నిర్మించుకోలేమన్న విషయానిన మరిన్ని దేశాలు నేడు గుర్తిస్తున్నాయి.

ఈ గుర్తింపు వల్లనే వర్ధమాన దేశాల్లో "కొత్త మానసిక స్థితి" ఏర్పడుతోంది. ఒకనాడు పశ్చిమ దేశాల విధానాల్లో కేవలం కీలుబొమ్మలుగా పరిగణించబడిన వర్ధమాన దేశాలు నేడు రాను రాను చరిత్రలో కర్తలుగా మారుతున్నాయి. అవి నేడు ఆధిపత్యం స్థానంలో భాగస్వామ్యం కోరుకుంటున్నాయి. సైనికీకరణ స్థానంలో అభివృద్ధి కోరుకుంటున్నాయి. అధారపడే స్థానంలో ఆత్మగౌరవాన్ని కోరుకుంటున్నాయి. బీజింగ్ శిఖరాగ్ర సభలో సి జిన్‌పింగ్ ఈ మానసిక స్థితిని ఎంతో గొప్ప క్రమశిక్షణతో ఇముడ్చుకున్నాడు. అమెరికా సహాయం అడగడానికి వచ్చింది. చైనా ధీమా కోల్పోకుండా వ్యవహరించింది. తమను దిగువస్థాయిలో చూస్తున్న శక్తుల ఎదుట ఏదో ఒకనాడు తామూ అటువంటి సమాన భాగస్వాములుగా నిలబడగలమనే ఆశతో దీన్ని వర్ధమాన దేశాలు జాగ్రత్తగా గమనించాయి.

(అనువాదం : ఎస్. వెంకట్రావు)

# మోడీకి త్యాగాలు కావాలి, ఆర్థిక వ్యవస్థకు జవాబులు కావాలి

(6వ పేజీ తరువాయి)

సంక్షోభాలను చూసింది. ప్రపంచానికి కూడా సంక్షోభం కొత్తది కాదు. కాకపోతే తేడా ఏమంటే ఈ దేశ నాయకుడు సంక్షోభానికి నెపాన్ని ప్రతిపక్షం మీద కాకుండా మొత్తం ప్రపంచం మీద నెడుతున్నాడు. ఇటీవలి సంవత్సరాల్లోనే కచ్చితంగా చెప్పాలంటే 2008లో ప్రపంచం తీవ్రమైన ద్రవ్య సంక్షోభాన్ని చవి చూసింది. ఈ సంక్షోభంలో ప్రపంచం 50 లక్షల కోట్ల డాలర్లు నష్టపోయింది. వాస్తవానికి ఈ సంక్షోభం ఆధారంగానే నరేంద్ర మోడీ ప్రధాన మంత్రి పీఠాన్ని అధిరోహించారు. ప్రజలందరికీ గొప్ప భవిష్యత్తునిస్తాననే దివ్యమైన హామీతో గద్దెనెక్కారు.


ఒక దశాబ్దం దిగువకు పోతే మనం మరికొన్ని సంఘటనలను కూడా చూస్తాం. నోట్ల రద్దు, భారత అసంఘటిత ఆర్థిక వ్యవస్థమీద దాని విపరీత పర్యవసానం, చైనా పాకిస్థాన్‌లతో సరిహద్దు ఘర్షణలు, ఒకటి కాదు రెండు సార్లు భారత కార్మికవర్గం బలవంతపు వలసల్లోకి నెట్టివేయబడ్డం, అన్నిటికీ మించి తీవ్రమైన నిరుద్యోగం వీటన్నిటినీ అంతకు ముందు దశాబ్దంలో చూశాం. ఇవేవీ కూడా ప్రపంచ పరిణామాల వల్ల వచ్చినవి కావు.

భారత దేశంలో ఏం నష్టం జరిగినా అదంతా ఎనాడో పాలించిన ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ వల్లే జరిగిందని దబాయిస్తుండడం చూశాం.

కానీ చేదు అనుభం ఏమిటంటే, ఆనకట్ట బద్దలైంది. రూపాయి పతనం దాన్ని చూపిస్తోంది. భారత దేశం నుండి బయటకు పెట్టుబడుల ప్రవాహం దాన్ని నిర్ధారిస్తోంది. ఈ సంక్షోభం రాకుండా గత దశాబ్దం లేక అంతకు కొద్ది సంవత్సరాల ముందు సరిదిద్దడానికి ఏ ప్రయత్నాలూ జరగలేదు. కాకపోతే సంక్షోభం వచ్చినప్పుడల్లా దాని నుండి తప్పించుకోడానికి తపేళాలు, పళ్లేలు మోగించాం, పెద్ద నోట్లను ఇచ్చేసి రూ. 500 నోట్లు పట్టుకు రావడానికి క్యూల్లో నిలబడ్డాం. భారత దేశ నాయకులు మాత్రం పెద్ద పెద్ద హామీలతో కాలక్షేపం చేస్తూ వచ్చారు. కానీ ప్రస్తుత సంక్షోభం నుండి బయటపడేసే బాధ్యత ప్రజలది కాదు. 12 ఏళ్ల క్రితం అధికారం చేపట్టి పరిస్థితుల్ని ఈ అధోగతికి తెచ్చిన ప్రభుత్వానిదే ఈ బాధ్యతంతా.

మతతత్వం

# మతంతో ముడిపడిన 21వ శతాబ్దపు ఫాసిజం



రచయిత పోర్చుగీసు సామాజిక వేత్త, వామపక్ష మేధావి, కోయింబ్రా యూనివర్శిటీలో సోషియాలజీ విభాగానికి ప్రొఫెసర్ ఎమిరిటస్

బోవెంటురా డిసౌజా శాంటోస్

సమాజాన్ని సైద్ధాంతికంగా, ఆచరణాత్మకంగా మార్చాలని ప్రతిపాదించిన లౌకికవాదానికి వ్యతిరేకంగా జరిగిన తిరుగుబాటే 20వ శతాబ్దపు ఫాసిజం అని కొందరు మేధావులు చేసిన విశ్లేషణ ఫాసిజాన్ని గురించి చేసిన అధ్యయనాలలో ముఖ్యమైనది. మతాన్ని రాజకీయాలతో కలగాపులగం చేయటం కోసం ఈ తిరుగుబాటు వివిధ రకాలైన ముసుగులను ధరించింది. ఈ విశ్లేషణ తీవ్రమైన చర్చకు దారి తీసింది. ప్రస్తుతం మనం ఫాసిజానికీ, మతానికీ మధ్య ఉన్న సంబంధాన్ని విశ్లేషించానికి పరిమితమౌదాం. గతంలో ఉన్న, భవిష్యత్‌లో రానున్న ఫాసిజాన్ని గురించి మాత్రమే చర్చిస్తే ప్రస్తుతం ఫాసిజం లేదనీ, ఫాసిజం అంటే ఏకశిలా సదృశ్యమైనదని భావించటానికి దారితీస్తుంది. సాధారణంగా ఫాసిజం అంటే రాజకీయపరమైనదనే భావాన్ని వ్యక్తం చేస్తారు. కానీ అందుకు భిన్నంగా రాజకీయ రంగంతోపాటు సామాజిక ఫాసిజం కూడా ఉన్నది. మొదటిది రాజకీయ విధానాల ద్వారా ఉనికిలోకి వస్తే, రెండవది సామాజికంగా అనుసరిస్తున్న విధానాలతో ఉనికిలోకి వస్తుంది.

**20వ శతాబ్దంలో ఫాసిజం-మతం**

20వ శతాబ్దం మొదటి అర్ధభాగంలో రాజకీయరంగంలో ఫాసిజానికీ, మతానికీ మధ్య సంబంధాలు సంక్లిష్టంగా ఉండేవి. ఆధునిక సమాజంలో లౌకికవాదం (మతాన్ని రాజకీయాల నుండి పూర్తిగా వేరు చేయటం) ఆధిపత్య దేశాలలో మాత్రమే అమలు జరిగింది. వలసలుగా ఉన్న దేశాలలో అమలు జరగలేదు. ఫలితంగా సమాజంలో తమ స్థానం కోసం రాజకీయాలు, మతం పోటీ పడటంతో వివిధ రకాల వైరుధ్యాలు, వివాదాలు, చిక్కు సమస్యలకు దారి తీసింది. ఇవి రెండూ ఒకదానిని మరొకటి పరస్పరం వినియోగించుకున్నాయి. రాజకీయాలు, ఫాసిస్టు గుర్తులను మతపరమైన కార్యక్రమాలతో కలిపి ఇటాలియన్ ఫాసిజం రూపుదిద్దుకున్నది.

రాబ్స్‌పెయిరి వలె కాకుండా ఫాసిస్టు రాజ్యానికి తన స్వంత మత భావాలు లేవనీ, కానీ దానికి తన స్వంత నైతిక సూత్రాలు ఉన్నాయని 1932లో ముస్సోలిని చెప్పాడు.

ఫాసిస్టు రాజకీయ ఎత్తులకు చిత్తైన ప్రజలను అణగిమణిగి ఉండేలా చేయటానికి కావలసిన విధంగా సాంప్రదాయకంగా వస్తున్న మతాన్ని వినియోగించుకున్నారు. నూతన తరాలను విద్యావంతులను చేయటంలో తనకున్న గుత్తాధిపత్యాన్ని వదులుకోవటానికి ఫాసిజం సిద్ధం కాకపోవటంతో, విద్యారంగంలో కేథలిక్, లౌకికవాద మతాల మధ్య తీవ్రమైన వాద వివాదాలు జరుగుతుండేవి. కానీ ఎల్లప్పుడూ మతం- రాజకీయాల మధ్య ఉన్న హద్దులను చెరిపివేయటమే లక్ష్యంగా ఉండేది. ఇదేమీ కొత్త విషయం కాదు.

15వ శతాబ్దం నుండి ప్రజలకు మరింత సన్నిహితంగా ఉండేలా మతాన్ని మార్చటం కోసం రహస్య సమాజాల నుండి జాకొబియనిజం, పాజిటివిజాల వరకు వివిధ రకాల ఉద్యమాలు జరిగాయి. సోషలిజానికి వ్యతిరేకంగా పోరాడటానికి, జాతి, జాతీయవాద భావాలను పెంచటం మార్గంగా ఎంచుకున్నారు. ఇటలీలో ముస్సోలిని అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరాలలో సమాజం విప్లవాత్మకమైన సోషలిస్టు, శాస్త్రీయ భావాల కంటే విశ్వాసంపై ఎక్కువగా అధారపడింది. "మానవజాతికి ఒక విశ్వాసం అవసరం" అని ముస్సోలిని తరచుగా చెప్పేవాడు. దేశంలోని ప్రజలు అనుసరిస్తున్న మతంతో విశ్వాసాన్ని జోడించాడు. మతమే దేశభక్తి అని ప్రచారం చేశారు. "జీవితాన్ని సజీవమైనదిగా చూసినంత వరకు" ఫాసిజానికి మతపరమైన స్వభావం ఉంటుందని, " దేశ జీవితం నుండే అది ఒక ఉద్యమంగా ముందుకొస్తుందని" జియోవన్ని జెన్‌టైల్ చెప్పాడు. నైతిక సూత్రాల ఆధారంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయటం దాని లక్ష్యం.

రాజకీయాలతో మతాన్ని జోడించటంతో పాటు యుద్ధం, హింస కూడా అవసరమైనవేనని ప్రచారం చేశారు. యుద్ధోన్మాదాన్ని, భయాన్ని పెంచటానికి అన్నింటిని బలి చేశారు. అమరులను, హీరోలను కీర్తించటం ద్వారా చావును కూడా గొప్పగా ప్రచారం చేశారు. "మంచి ఫాసిస్టు, మతంతో ముడిపడి ఉంటాడని" 1932లో ఫాసిస్టు వార్తాపత్రికలో రాశారు. కేథలిక్ చర్చిలో క్రైస్తవాన్ని ఉపదేశించినట్లుగానే ఫాసిస్టు కార్యకలాపాలలో భాగస్వాములం అవుతామని యువకుల చేత ప్రతిజ్ఞలు చేయించేవారు. దీక్ష, జెండా వందనాలు, ప్రతిజ్ఞలతో పాటు చనిపోయిన వారి గౌరవార్థం ప్రతి నగరంలోనూ బహిరంగ కార్యకలాపాలు నిర్వహించేవారు. ఇటలీ నాగరికత, పితృదేశ గొప్పతనం, రోమ్ నగరం ఏర్పడిన ఉత్సవాలు, రోమన్ దినోత్సవాలు, లాటిన్ ఆత్మ తదితర పేర్లతో కార్యక్రమాలు జరిపేవారు.

విజయం సాధించిన బోల్షివిక్‌లకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటంలో వివిధ మత ప్రవంతులకు చెందినవారు భాగస్వాములయారు. గతంలో సోషలిస్టుల ఆధ్వర్యంలో నడిచిన కమ్యూనిటీని తిరిగి తమ పెత్తనంలోకి తెచ్చుకోవటానికి ఫాసిస్టు పద్ధతులను వినియోగించుకున్నారు. ఫాసిజాన్ని ఒక మతంగా ప్రచారం చేసి, ఈ వాదనతో విబేధించేవారు మత వ్యతిరేకులని ముద్రవేశారు. ప్రభుత్వం,

> **❝ ఫాసిస్టు జీవన విధానం గురించి ఈ మధ్యకాలంలో విభిన్నమైన విశ్లేషణలు చేస్తున్నారు. ఫాసిజానికి కట్టుబడి ఉండటానికి పౌరాణిక గాథలు, తర్కవిరుద్ధమైన దృక్పథం, స్వలాభానికి ప్రయత్నం చేయటం, ఇతరులను బెదిరించటం తదితరాలు సరైన కారణాలు కావని కొందరు చెబుతున్నారు. సామాజిక జీవితంలో ఫాసిస్టు ధోరణులు నిరంతరం ఉంటాయని మరికొందరు విశ్లేషించారు. ❞**



**1940లో మ్యూనిచ్‌లో ఇటలీ, జర్మనీ ఫాసిస్టు నాయకులు ముస్సోలినీ, హిట్లర్**

మతం యొక్క భావాలు పరస్పరం కలిసిపోయాయి. మత వ్యతిరేకులను విద్రోహులుగా ముద్రవేసి, ప్రజా జీవితం నుండి బహిష్కరించారు. 1926-30లలో ఫాసిస్టు పార్టీ కార్యదర్శిగా పనిచేసిన టురాటి, ప్రభుత్వం చెబుతున్న దానిని యువకులు గుడ్డిగా నమ్మాల్సిన అవసరం ఉందని బోధించాడు. దేవుడ్ని నమ్మినంత గుడ్డిగా ఫాసిజాన్ని కూడా నమ్మాలని చెప్పాడు. అవి తప్పని మనకు తెలిసినా వాటిని ఏ మాత్రం ప్రశ్నించకుండా నమ్మాలి. ''నమ్మండి, ఆచరించండి, పోరాడండి'' అన్నది సుగ్రీవాజ్ఞ అని చెప్పారు.

**భిన్న విశ్లేషణలు**

ఫాసిస్టు జీవన విధానం గురించి ఈ మధ్యకాలంలో విభిన్నమైన విశ్లేషణలు చేస్తున్నారు. ఫాసిజానికి కట్టుబడి ఉండటానికి పౌరాణిక గాథలు, తర్క విరుద్ధమైన దృక్పథం, స్వలాభానికి ప్రయత్నం చేయటం, ఇతరులను బెదిరించటం తదితరాలు సరైన కారణాలు కావని కొందరు చెబుతున్నారు. సామాజిక జీవితంలో ఫాసిస్టు ధోరణులు నిరంతరం ఉంటాయని మరికొందరు విశ్లేషించారు. చారిత్రకంగా ఫాసిజానికి కాలం చెల్లిందనే దృక్పథాన్ని ఇది తిరస్కరిస్తున్నది. ఫాసిజం ఏ విధంగా తిరిగి వచ్చిందన్న విశ్లేషణ కాకుండా, ఫాసిజం వివిధ రకాలుగా, వివిధ శక్తులలో ఎలా కొనసాగుతూ వస్తున్నదనే అంశాన్ని సిద్ధాంతీకరించటమే ఇది. ఈ మధ్య రాసిన "అంతర్గత ప్రమాదం - ప్రపంచ ఫాసిజం సైద్ధాంతిక విశ్లేషణ" పుస్తకంలో వ్లదిమీర్ సపాట్లే ఈ దృక్పధాన్ని బలపరిచాడు.

ఈ దృక్పధానికి సామాజిక, రాజకీయ వాస్తవికత ఉన్నది. ప్రపంచ వ్యాపితంగా ఫాసిస్టు రాజకీయ విధానాలను బోధిస్తున్న మితవాద శక్తులు అధికారంలోకి వచ్చినపుడు ఫాసిజాన్ని అమలు చేయటానికి పూనుకుంటున్నాయి. ప్రజాస్వామ్యానికి వ్యతిరేకులుగా ఉన్న ఫాసిస్టులు అధికారంలోకి రావటానికి ఉదారవాద ప్రజాస్వామ్యాన్ని బాగా ఉపయోగించుకున్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికైన ఈ రాజకీయ నాయకులు, అధికారానికి వచ్చిన తర్వాత ప్రజాస్వామ్య విధానాలను ఏ మాత్రం అమలు చేయరు. ప్రజాస్వామ్య వ్యతిరేక శక్తులు అమలు చేస్తున్న విధానాల వలన ఫాసిజం ప్రజాస్వామ్య వ్యవస్థలోకి బొట్టుబొట్టుగా ఇంకుతున్నది. ఇదేమీ కొత్త విషయం కాదు. 1932 ఎన్నికల తర్వాత హిట్లర్ ఇలాగే వ్యవహరించాడు. కానీ అది విస్తరిస్తున్న వేగం, కారణాలు ఈ పరిమాణానికి ఒక నూతన గుణాన్ని ఇస్తున్నవి. వేగంగా విస్తరిస్తున్న రాజకీయ ఫాసిజం మరొక రకమైన ఫాసిజంపైన అంటే సామాజిక ఫాసిజంపైన ఆధారపడి పెరుగుతుంది.

తీవ్రమైన అధికార అసమతుల్యతపై మొత్తం సామాజిక సంబంధాలు ఆధారపడి ఉంటాయి. బలహీనమైన పార్టీ జీవించటాన్ని, అవకాశాలను వినియోగించుకోవటాన్ని బలమైన పార్టీ నిరోధిస్తుంది. వ్యక్తులు, సమూహాలు ప్రజాస్వామ్య వ్యవస్థలోనే జీవిస్తున్నప్పటికీ, వారికి ఏ విధమైన హక్కులు, రక్షణలు ఉండవు. ఏకపక్షంగా అధికారం చెలాయిస్తున్న గ్రూపుల దయపై ఆధారపడి ఉంటారు. సామాజికంగా వారిని వేరు చేయటం, అధికారం, మార్కెట్ల ఆధిక్యతతో మానవ జీవితాన్ని పూర్తిగా విలువ లేనిదిగా చేస్తారు. రాజకీయ ఫాసిజం వలె కాకుండా సామాజిక ఫాసిజం బహుముఖమైనది. సామాజిక ఫాసిజంలోని ఐదు ముఖ్య లక్షణాలను పేర్కొంటాను:

1. ప్రైవేటు వ్యక్తుల ప్రయోజనాలను ప్రభుత్వంతో ముడివేసే ఫాసిజం: అదెంత అన్యాయమైనప్పటికీ, తను కొనసాగటానికి అవకాశాలు లేకుండా చేస్తున్నప్పటికీ బలమైన పార్టీ షరతులను అంగీకరించటం మినహా బలహీనమైన పార్టీకి గత్యంతరం ఉండదు.

2. సామాజికంగా విభజించే ఫాసిజం: దూరం పెట్టబడిన ప్రజలు అన్ని రకాలైన హింసాకాండకు బలౌతూ పట్టణాలలోనే పట్టణీకరణకు దూరంగా ఉన్న ఘెట్టోలలో (మురికివాడల్లో) జీవిస్తుంటారు.

3. రాజ్యం అమలుజరిపే అర్ధ ఫాసిజం: శిక్షింపబడతామనే భయం లేకుండా ఏ మాత్రం రక్షణలేని ప్రజలపై క్రమబద్ధంగా నేరాలు చేయటానికీ, అత్యంత తీవ్రమైన హింసాకాండను అమలు జరపటానికీ కొన్ని సాయుధ గ్రూపులకు రాజ్యం అవకాశం ఇస్తుంది.

4. ద్రవ్య ఫాసిజం: అత్యంత శక్తివంతమైన ద్రవ్య పెట్టుబడిదారీ సంస్థలు ప్రభుత్వ సహకారంతో, అత్యధిక వడ్డీరేట్లతో మధ్య తరగతి ప్రజల ఆదాయంలో అత్యధిక భాగాన్ని కాజేస్తాయి.

5. రక్షణ లేదనే భయాన్ని కలిగించే ఫాసిజం: తీవ్రమైన అభద్రతను కలిగించే ప్రమాదాలు, తీవ్రమైన వాతావరణ ప్రభావం, తదితరాలకు ఏ విధమైన బీమా లేదా ప్రభుత్వం సహకారం లేని వాటిని ఉపయోగించుకుంటుంది.

ప్రపంచ పెట్టుబడిదారీ విధానంలో నయా-ఉదారవాదం ఆధిపత్య స్థానంలో

ఉండటం వలన వివిధ తరహాల ఫాసిజం తీవ్రమౌతుంది. నూతన తరహా రాజకీయ ఫాసిజానికి అవకాశం కల్పించటం కోసమే ఈ తరహా ఫాసిజం తీవ్రస్థాయికి చేరుతున్నది. దీనిలో ఏ విధమైన దృఢత్వం లేదు. ప్రజాస్వామిక వాదులను ఆధిపత్య స్థానాలలోకి రాకుండా చేయటమే దాని ప్రధాన లక్ష్యంగా ఉన్నది.

**"మతపరంగా చూసినపుడు 20వ, 21వ శతాబ్దాల ఫాసిజం మధ్య గణనీయమైన వ్యత్యాసం ఉన్నది. 20వ శతాబ్దపు ఫాసిజం లౌకికవాద మతాన్ని సృష్టించి, సాంప్రదాయక మతాలతో సహకా రం, ఘర్షణ వైఖరిని కొనసాగించింది. అందు వలన సాంప్రదాయక మతాలకు కొంతమేరకు స్వేచ్ఛ ఉండేది. 21వ శతాబ్దపు ఫాసిజం క్రైస్తవ మతపరమైన తీవ్రవాదంతో, బైబిల్ ఆధిక్యతను ప్రభోధిస్తూ, తనకు సన్నిహితంగా ఉన్న పెంతెకోస్టల్ గ్రూపులను విలీనం చేసుకొంటున్నది."**

### క్రైస్తవాన్ని ఉపయోగించుకుంటున్న 21 శతాబ్దపు ఫాసిజం

గత ఫాసిజం వలె కాకుండా ప్రస్తుతం ఉనికిలోకి వస్తున్న ఫాసిజం మతపరంగా మరింత తీవ్రవాద దృక్పథంతో వ్యవహరిస్తున్నది. అది హింసను సర్వవ్యాప్తం చేయటంతో పాటు, కొందరు వ్యక్తులను గొప్పవారిగా ముద్ర వేస్తున్నది. క్రైస్తవ మత వ్యతిరేకుల వలన రానున్న కాలంలో ఊహించని కష్టాలు ఎదురవుతాయనే ప్రచారంతో అది విస్తరిస్తున్నది. ప్రధానంగా అమెరికాలోనే ఉన్నప్పటికీ, అది త్వరగా విస్తరించే శక్తి కలిగివున్నది. ప్రస్తుత సమాజంలో మంచికి- చెడుకు మధ్య చావు బతుకుల పోరాటం జరుగుతున్నదని, దీనిలో రాజీలకు, విరామాలకు అవకాశం లేదని, బలహీనమైన వారిని లొంగదీసుకొని, నాశనం చేయాలని క్రైస్తవ మతం పేరు వినియోగించుకొంటున్న నయా-ఫాసిజం చెబుతున్నది. సమాజం నిరంతరం యుద్ధంలో మునిగి ఉన్నదనీ, జాతి, మతపరంగా ఆత్యధికులకు ప్రాతినిధ్యం వహించే ప్రభుత్వం అత్యున్నత సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ప్రజలను అదుపులో ఉంచాలనీ, లేకపోతే రానున్న కాలంలో ప్రపంచం అంతమైపోతుందనీ ప్రచారం చేస్తున్నారు.

మతపరంగా చూసినపుడు 20వ, 21వ శతాబ్దాల ఫాసిజం మధ్య గణనీయమైన వ్యత్యాసం ఉన్నది. 20వ శతాబ్దపు ఫాసిజం లౌకికవాద మతాన్ని సృష్టించి, సాంప్రదాయక మతాలతో సహకారం, ఘర్షణ వైఖరిని కొనసాగించింది. అందువలన సాంప్రదాయక మతాలకు కొంతమేరకు స్వేచ్ఛ ఉండేది. 21వ శతాబ్దపు ఫాసిజం క్రైస్తవ మతపరమైన తీవ్రవాదంతో, బైబిల్ ఆధిక్యతను ప్రభోధిస్తూ, తనకు సన్నిహితంగా ఉన్న పెంతెకోస్టల్ గ్రూపులను విలీనం చేసుకొంటున్నది. రాజకీయ పార్టీ, మత ప్రభోధం చేస్తున్న శక్తులు పూర్తిగా విలీనం కానప్పటికీ, వాటి మధ్య సన్నిహిత సంబంధాలు పెరుగుతున్నాయి.

హిట్లర్, ముస్సోలిని భావాలలో ఉన్న సోషలిజం అంత గొప్పగా భవిష్యత్ సమాజం



భారత దేశంలో మతతత్వ రూపంలో పనిచేస్తున్న ఫాసిస్టు సంస్థ ఆర్ఎస్ఎస్

ఉండాలన్న ప్రాతిపదికపై ఫాసిజం 20వ శతాబ్దంలో మనుగడ సాగించింది. ఇందుకు భిన్నంగా కమ్యూనిజం, సోషలిజం మాత్రమే కాక ప్రజాస్వామ్యం కూడా క్రైస్తవ మతానికి వ్యతిరేకంగా ఉన్నదని ప్రస్తుత ఫాసిస్టులు ప్రచారం చేస్తున్నారు. గతంలో సాధించలేక పోయిన అభివృద్ధిని ఇపుడు సాధించటానికి, దానిని సాకారం చేసే సాంకేతిక ప్రగతికి ప్రజాస్వామ్యం ప్రభోధించే సహ జీవనం అడ్డుగా ఉన్నదని 21 శతాబ్దపు ఫాసిజం చెబుతున్నది. విద్వేషాలను రెచ్చగొట్టటం తద్వారా అంతర్గత పోరాటాలను పెంచుతున్న రాజకీయ పార్టీలకు రాజకీయ శత్రువులంటూ ఉండరు. నిర్మూలించాల్సిన శత్రువులు మాత్రమే ఉంటారు.

20వ శతాబ్దపు ఫాసిజం వలె కాకుండా 21వ శతాబ్దపు ఫాసిజానికి విధ్వంసకర స్వభావం ఉండటం వలన ఉన్నత తరగతులకు చెందిన వారు, శత కోటీశ్వరులు మద్దతిస్తున్నారు. ఇది ఏ మాత్రం ఆశ్చర్యం కలిగించదు. ప్రజాస్వామ్యాన్ని క్షీణించిపోతున్న వ్యవస్థగా 20వ శతాబ్దపు ఫాసిజం పరిగణించగా, మానవ హక్కుల వలెనే ప్రజాస్వామ్యం కూడా 21వ శతాబ్దపు ఫాసిజానికి శత్రువుగా ఉన్నది. కాబట్టి పెట్టుబడి కేంద్రీకరణ, అందుకు కారణమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించటానికి ఆటంకం కలిగించే పర్యావరణ పరిరక్షణ పోరాటాలు, ఇతర డిమాండ్లను కూడా అది వ్యతిరేకిస్తుంది.

21వ శతాబ్దపు ఫాసిజం, యూదు జాతీయోన్మాదం (జియోనిజం) గురించి ప్రత్యేకంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. 20వ శతాబ్దపు ఫాసిజం యూదు వ్యతిరేకమైనది. జాత్యాహంకారంతో యూదులను నిర్మూలించటానికి తీవ్రంగా ప్రయత్నం చేసింది. ఆ సమయంలో యూదులకు ప్రత్యేక దేశాన్ని ఏర్పాటు చేయాలని యూదు జాతీయోన్మాదులు చేస్తున్న ప్రచారానికి వారిలో తక్కువ మంది మాత్రమే మద్దతిచ్చారు. రష్యా, తూర్పు యూరప్ దేశాలలో ఉన్న యూదులు ఎక్కువ మంది ఈ వాదనకు మద్దతు తెలిపారు. యూదులను పాలస్తీనాకు తరలించటానికి, ఇజ్రాయిల్ దేశాన్ని

> **“చారిత్రకంగా సంపా దించిన జ్ఞానం, నిర్మాణం, మానవజాతి, భూగోళాన్ని అంతం చేయటానికి, అసమానతలకు దారితీస్తున్న పరిస్థితులకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నవారిని క్రైస్తవ మత వ్యతిరేకులుగా ముద్ర వేస్తున్నారు. ప్రజాస్వామ్య వ్యతిరేకుల నుండి ప్రజాస్వామ్యాన్ని కాపాడకపోతే, సామ్రాజ్యవాదం అంతర్జా తీయ చట్టాలను ఖాతరు చేయకపోతే అపుడు వివాదాలను పరిష్క రించుకోవటానికి యుద్ధం, మానవ మారణకాండ, వనరులను దోపిడి చేయటం తదితరాలు మాత్రమే మిగులుతాయి.”**

ఏర్పాటు చేయటానికి వివిధ యూదు సంస్థలు నాజీలతో ఒప్పందం చేసుకున్నాయి.

రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత యూదు జాతీయోన్మాదం ప్రమాదాన్ని, ఫాసిజం, నాజీయిజంతో దానికి ఉన్న పోలికలను గురించి యూదు మేధావులు హెచ్చరించారు. ఈ రోజు లికుడ్ పార్టీగా ఉన్న నాటి మెనాచెం బెగిన్ పార్టీ ఫాసిస్టు లక్షణాలను గురించి 1948లో న్యూయార్క్ టైమ్స్‌కు రాసిన లేఖపై ప్రఖ్యాత శాస్త్రవేత్త అల్‌బర్ట్ ఐన్‌స్టీన్, అన్నా అరెండ్‌లు సంతకాలు చేశారు. ఇపుడు ఇజ్రాయిల్ ప్రభుత్వంపై పట్టు కలిగివున్న యూదు జాతీయోన్మాదులు సమాజ విధ్వంసం గురించి బైబిల్‌లో చెప్పిన మితవాద భావాలను ప్రచారం చేస్తున్నారు. విస్తృతమౌతున్న క్రైస్తవ–యూదు జాతీయోన్మాదం ఈ శతాబ్దంలో ప్రపంచంలో ఫాసిజం బలపడటానికి దారితీసింది.

రాబర్ట్ ఫుల్లర్ చెప్పినట్లు క్రైస్తవ వ్యతిరేకత అనేది అమెరికన్ భావజాలంలో ఉన్నది. పేపాల్, పలంటిర్ సంస్థలను స్థాపించిన పీటర్ థేల్ క్రైస్తవ వ్యతిరేక శక్తులతో చేస్తున్న పోరాటంలో కృత్రిమ మేధను వినియోగిస్తున్నాడు. ఇరాన్ నాయకుడు ఆయతుల్లా ఖమేనీ, మినాబ్‌లోని షాద్‌జరేహ్ తయ్యాబ్ పాఠశాలకు చెందిన 208 మంది విద్యార్థినులు చనిపోవటానికి అతడు ఉపయోగించిన సాంకేతిక పరిజ్ఞానమే కారణం.

గత 200 సంవత్సరాల పాటు పోరాడి సాధించిన రాజకీయ, ప్రజాస్వామ్య వ్యవస్థల అభివృద్ధితోపాటు, ఈ ప్రపంచమే క్రైస్తవ మత వ్యతిరేకుల వలన ధ్వంసమయిపోతుందని పీటర్ థేల్ ప్రచారం చేస్తున్నాడు. పెట్టుబడిదారీ, వలసవాద, పితృస్వామిక వ్యవస్థలలో పక్కకు నెట్టివేయబడిన వర్గాలు, సామాజిక గ్రూపులు ఈ కాలంలో కొంత మేరకు తమ గౌరవాన్ని పునరుద్ధరించుకున్నాయి. సామాజిక విధానాల (ప్రజారోగ్యం, విద్య, ఇళ్ళు ఇవ్వటం తదితరాలు) ద్వారా కనీసంగా అయినా సంపదలను పున:పంపిణి చేయటం జరుగుతున్నది. సమాజంలో శాంతియుతంగా కలిసిమెలిసి జీవిస్తూ పెట్టుబడిదారి దోపిడిని కొంత వరకు అదుపు చేస్తున్నారు. అత్యధిక శాతం ప్రజల గౌరవ మర్యాదలను మంట కలిపి, కొద్దిమంది మాత్రవే అభివృద్ధి సాధించిన సమాజాలలో మానవ హక్కులు, గౌరవ ప్రదమైన జీవనం కోసం పోరాటాలు చేస్తున్నారు. సమాజానికి అత్యవసరమైన ప్రకృతి క్రమాన్ని పునరుద్ధరించటం కోసం, పర్యావరణాన్ని పరిరక్షించటం కోసం పోరాటాలు చేస్తున్నారు. మేధావులు రూపొందించిన కృత్రిమ మేధ మాత్రమే సాధించే పరిష్కారాలకు ఇవన్నీ ఆటంకంగా నిలుస్తాయి. కృత్రిమ మేధ, అణ్వాయుధాలు, అణు సాంకేతికత, పర్యావరణ మార్పులు తదితరాల వలన కాకుండా, తమ విధానాలకు ఎదురౌతున్న ప్రతిఘటన మానవ ఉనికికి ప్రమాదకరంగా ఉన్నదని వీరు భావిస్తారు. ఇవి మానవజాతి ఉద్ధారకుడైన దేవునికి వ్యతిరేకంగా జరుగుతున్నాయనీ, ఈ జగత్తును అంతం చేస్తాయని ప్రచారం చేస్తున్నారు.

సామాజిక, చారిత్రక, పర్యావరణ, జాతి, లైంగిక అసమానతలను నిర్మూలించ టానికి, చారిత్రకంగా సంపాదించిన జ్ఞానం, నిర్మాణం, మానవజాతి, భూగోళాన్ని అంతం చేయటానికి దారితీస్తున్న పరిస్థితులకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నవారిని క్రైస్తవ మత వ్యతిరేకులుగా ముద్ర వేస్తున్నారు. ప్రజాస్వామ్య వ్యతిరేకుల నుండి ప్రజాస్వామ్యాన్ని కాపాడకపోతే, సామ్రాజ్యవాదం అంతర్జాతీయ చట్టాలను ఖాతరు చేయకపోతే అపుడు వివాదాలను పరిష్కరించుకోవటానికి యుద్ధం, మానవ మారణకాండ, వనరులను దోపిడి చేయటం తదితరాలు మాత్రమే మిగులుతాయి. క్రైస్తవ మత వ్యతిరేకులు గత 200 సంవత్సరాల నుండి సాధించుకున్న చారిత్రక జ్ఞానంతో సమాజం స్థంభించిపోయిందని ఫాసిస్టులు భావిస్తున్నారు. సాంకేతిక పరిజ్ఞానం ద్వారా సాధించాల్సిన అభివృద్ధికి ఇది ఆటంకం అన్న అభిప్రాయంతో వారు ఉన్నారు.

క్రైస్తవ మత వ్యతిరేకులను ఎదుర్కోవటం పేరుతో తీవ్ర అస్తిత్వవాద–క్రైస్తవ–యూదు జాతీయోన్మాద పునాదిపై అభివృద్ధి చెందిన ఫాసిజం యూరప్ కేంద్రంగా ఉనికిలోకి వచ్చినదే. ప్రతి నాగరికతకు దానికి ప్రత్యేకమైన “ఆటవికత” ఉంటుంది. యూరోపియన్ పద్ధతిలోని ఈ ఫాసిజాన్ని పరీక్షించటానికి యూరోపియన్ మహా నగరాలకు బయట, పశ్చిమాసియా (ఇరాక్, పాలస్తీనా, సిరియా, ఇరాన్, లెబనాన్) నగరాలను పరీక్షా కేంద్రాలుగా మారుస్తున్నారు. కానీ ఇది ఎక్కడ అంతమౌతుందో ఎవరికీ తెలియదు.

**‘మార్క్సిస్టు’కు మీ సందేహాలు రాయండి!**


‘మార్క్సిస్టు’ సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకు నేందుకు ప్రశ్నలను పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్, మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి , పిన్ : 522501, గుంటూరు జిల్లా.**

**సెల్: 9490099333** email: venkataraosankarapu@gmail.com

# కొత్త టెక్నాలజీ కొత్త సమాజం

సంజయ్ రాయ్




సాంకేతిక అభివృద్ధి, ఆవిష్కరణలు మానవ నాగరికతకు చోదకశక్తిగా ఉంటాయి. టెక్నాలజీలో వచ్చే మార్పులతో, ఉత్పత్తి ప్రక్రియ, శ్రమ ప్రక్రియ, సామాజిక ఉత్పత్తికి మానవ తోడ్పాటును కొలిచే పద్ధతులూ మారతాయి. అన్నిటికీ ఉపయోగపడే టెక్నాలజీగా అభివృద్ధి చెందుతున్న కృత్రిమ మేధ (ఏఐ)తో కూడిన ప్రస్తుత డిజిటల్ టెక్నాలజీ కూడా ఉత్పత్తి ప్రక్రియను సమూలంగా మార్చబోతోంది. సాంకేతిక ఆవిష్కరణలు ఇప్పటికే ఉన్న వస్తువుల, సేవల ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడం, కొత్త ఉత్పత్తులను ఆవిష్కరించడం లేదా ఇంతకుముందు లేని కొత్త వినియోగ విలువలను సృష్టించడం వంటివి చేస్తాయి. అంతేకాకుండా, లావాదేవీలు లేదా రవాణా ఖర్చులను తగ్గించడం ద్వారా వస్తువులు, సేవల సరఫరా సమయాన్ని కూడా తగ్గించవచ్చు. ఇవన్నీ ఏదో ఒక విధంగా ఉత్పత్తి, పంపిణీ ప్రపంచంలో ప్రత్యక్ష మానవ కృషిని లేదా శ్రమను తగ్గిస్తాయి.

ఇటీవల సాంకేతిక రంగంలో అనేక మార్పులు చోటుచేసుకోవడాన్ని మనం గమనిస్తున్నాం. ఇదొక కొత్త దశ. టెక్నాలజీ అభివృద్ధి తార్కిక పురోగతి గురించి మార్క్స్ మహాశయుడు ముందే ఊహించాడు. 'గ్రండ్రిస్సే' అన్న తన గ్రంథంలో భారీ పరిశ్రమల గురించిన ప్రస్తావనలో ఆయన ఈ విషయాన్ని నొక్కి చెప్పాడు. ఉత్పత్తి ప్రక్రియలో ప్రత్యక్ష మానవ శ్రమ తీవ్రంగా తగ్గే అవకాశం గురించి చర్చించాడు. మానవులు ఒక యాంత్రిక ప్రక్రియకు పరిశీలకులుగా, పర్యవేక్షకులుగా మారినపుడు సామాజిక ఉత్పత్తిలో మానవ సహకారానికి కొలమానంగా ప్రత్యక్ష మానవ శ్రమ ఉండదు.

నిర్దిష్ట నైపుణ్యాలు, ఉత్పత్తిచేయడం ద్వారా నేర్చుకోడానికి బదులు, విజ్ఞాన శాస్త్రం, సాధారణ జ్ఞానం లేదా 'సాధారణ మేధస్సు' వంటివి పెట్టుబడిదారీ విధానంలో కీలక ఉత్పాదక శక్తి పాత్ర పోషిస్తాయి. 'గ్రండ్రిస్సే'లో మార్క్స్ ఇలా వాదిస్తాడు : 'నిజమైన సంపద అనేది, వెచ్చించిన శ్రమ కాలానికి, దాని ఉత్పత్తికి మధ్య ఉన్న భయంకరమైన అసమానతలో వ్యక్తమవుతుంది... భారీ పరిశ్రమ దీనిని వెల్లడిస్తుంది... కేవలం ఒక అమూర్త భావనగా కుదించబడిన శ్రమకు, అది పర్యవేక్షించే ఉత్పత్తి ప్రక్రియ శక్తికి మధ్య ఉన్న గుణాత్మక అసమతుల్యతలోనూ ఇది వ్యక్తమవుతుంది.

**జ్ఞాన ఆర్థిక వ్యవస్థ**

సాధారణ అవసరాలకు సైతం ఉపయోగించే టెక్నాలజీగా ఆవిర్భవిస్తున్న కృత్రిమ మేధతో కూడిన ప్రస్తుత నూతన సాంకేతిక పరిజ్ఞాన తరంగం జ్ఞానాధారితమైనది. దీని అర్థం, మునుపటి సాంకేతికతల ఉత్పత్తికి జ్ఞానం అవసరం లేదని కాదు. ఇక్కడ గమనించాల్సిన ఓ ముఖ్యమైన అంశమేమిటంటే, ఉత్పత్తి ప్రక్రియలో జ్ఞానం భాగస్వామ్యంలో వచ్చిన మార్పు. మునుపటి సాంకేతికతలు భౌతిక శ్రమకు బదులు యంత్రాలను ప్రవేశపెట్టాయి. కొత్త జ్ఞాన యంత్రాలు భౌతిక శ్రమను భర్తీ చేయడమే కాకుండా, మానసిక శ్రమలోని కొంత భాగాన్ని కూడా తమలో ఇముడ్చుకుంటాయి. అన్నిటికన్నా ముఖ్యంగా, వినియోగ విలువల పరివర్తనా ప్రక్రియ. ఇది ఉత్పత్తి భౌతిక లక్షణాల్లో మార్పుతో చాలా తక్కువ సంబంధం కలిగి ఉంటుంది. అంతేకాదు, ఇది మానసిక ప్రక్రియకు కొన్ని అదనపు ప్రత్యేకతలను జోడిస్తుంది. మార్క్స్ తన 'గ్రండ్రిస్సే' గ్రంథంలో, పనిముట్లు, రసాయనాలు లేదా యంత్రాల జ్ఞానోత్పత్తి ప్రాముఖ్యత క్రమేణా తగ్గుతుందని, విజ్ఞానశాస్త్రం , సాధారణ మేధస్సే అత్యంత ముఖ్యమైన ఉత్పాదక శక్తిగా మారతాయని వాదించాడు. ఈ ప్రక్రియలో, యంత్రాలను, వనరులను పెట్టుబడి నియంత్రించడమే కాకుండా, విజ్ఞానశాస్త్రానికి, జ్ఞానానికి కీలక వనరు అయిన డేటాపై పట్టు బిగించడం ద్వారా వాటిని లోబరచుకుంటుంది. డిజిటల్ సాంకేతిక యుగంలో, డేటా మానవ నాగరికతకు కొత్త ఇంధనంగా ఆవిర్భవిస్తోంది. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లతో సహా, మానవ పరస్పర సంభాషణల ద్వారా డేటా ప్రవాహం ఉద్భృతమవుతుంది. ప్రజలు సోషల్ మీడియాలో పరస్పరం సంభాషించుకోవడం ద్వారా ఉచితంగా భారీ మొత్తంలో డేటాను సృష్టిస్తారు. ఈ డేటాను, వినియోగదారుల ఎంపికల సరళిని గుర్తించడానికి ముడిసరుకుగా వాడుకుంటారు. అందువల్ల, బిగ్ డేటాపై నియంత్రణ అంటే వర్తమాన, భవిష్యత్తు మానవ ఎంపికలపై పెట్టుబడి తన పట్టును బిగించడమే. కాబట్టి, పెట్టుబడిదారీ విధానంలో కొత్త టెక్నాలజీ అంతిమ లక్ష్యం, పెట్టుబడి ప్రయోజనాలకు సేవ చేయడానికి మానవ మేధస్సును వశపరచుకోవడమే.

జ్ఞాన వస్తువుల ఉత్పత్తిలో ఇమిడివున్న మేధోపరమైన శ్రమ కొన్నిసార్లు సాంప్రదాయ శ్రమకు భిన్నంగా వ్యక్తమవుతుంది. ఇది నిరాకారమైనదేమీ కాదు, ఎందుకంటే ఇందులో కండరాలు, నరాలు, మెదడు కూడా తగు పాత్ర పోషిస్తాయి. జ్ఞానం శూన్యం నుండి పుట్టదు. మేధో శ్రమ ఒక ప్రత్యేక లక్షణాన్ని కలిగివుంది. దీనిని పూర్తిగా అర్థం చేసుకోడానికి శ్రమ కాలం

> **“ జ్ఞానం స్వభావరీత్యా పోటీ లేనిది. ఇది ఇతర వనరులన్నిటికీ భిన్నమైనది, ఎందుకంటే దీనిని ఉపయోగించడం వల్ల అది తరిగి పోదు. ఒక పుస్తకాన్ని చదివినంత మాత్రాన దానిలోని విషయం తగ్గిపోదు. పైగా, చదివేవారు ఇప్పటికే ఉన్న పుస్తకానికి మరికొన్ని కోణాలను జోడించి, అందులో పరిగణనలోకి తీసుకోని వాటిపైనా బాష్యాలు తీయవచ్చు. అందువల్ల, పంచుకోవడం, పరస్పర సంభాషణలు జ్ఞాన వృద్ధికి చాలా అవసరం. ”**

అనే కొలమానం ఒక్కటే చాలదు. కొత్త వినియోగ విలువలను ఉత్పత్తి చేయడంలో మానసిక ప్రక్రియ సాపేక్షంగా ప్రాధాన్యతను సంతరించుకునే కొద్దీ, పని కాలానికి, పనియేతర కాలానికి మధ్య ఉన్న విభజన మరింతగా మసకబారుతుంది. ఒక డిజైనర్, ఒక సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామ్ లేదా ఒక ఏఐ నిపుణుడు పని గంటల తర్వాత కూడా ఆలోచించడాన్ని ఎవరూ ఆపలేరు. వాస్తవానికి, అటువంటి పనికి సంబంధించిన నైపుణ్యం, పనియేతర సమయంలో ఆలోచించడం, నేర్చుకోవడం అనే ఒక ప్రత్యేక ప్రక్రియ ద్వారా పెంపొందించ బడుతుంది. మరీ ముఖ్యంగా, ఉత్పత్తి ప్రక్రియలో జ్ఞాన తీవ్రత పెరిగేకొద్దీ ఉత్పత్తి 'సాధారణ మేధస్సు'పై ఆధారపడటం పెరుగుతుంది. జ్ఞానం అంతకంతకూ సామాజికమవుతుంది. ఇంటర్నెట్‌ను ఉపయోగించి, ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తి అయ్యే అనంతమైన డేటా, ఆలోచనల ప్రవాహాన్ని ఎవరైనా పొందవచ్చు. ఉత్పత్తి అంతకంతకూ సామాజికీకరించబడుతోంది. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు మానవ పరస్పర సంభాషణలకు అనంతమైన అవకాశాన్ని కల్పిస్తాయి, దీనిని జ్ఞాన వస్తువుల ఉత్పత్తిలో ఉపయోగిస్తారు. అయితే, జ్ఞానోత్పత్తి ద్వారా సమకూరిన లాభాలు, రాబడులు భారీడేటా ప్రవాహాన్ని సొంతం చేసుకున్న కొన్ని టెక్ దిగ్గజాల చేతుల్లోకి పోతున్నాయి. బొగ్గు, చమురు, ఇనుప ఖనిజం లేదా ఇతర ఖనిజాలు వంటి వనరులు నిర్దిష్ట భౌగోళిక ప్రాంతాలలో ఉంటాయి. ఆ వనరులపై గుత్తాధిపత్యం సాధించడానికి, ఆ ప్రదేశం లేదా ప్రాంతంపై నియంత్రణ సాధిస్తే సరిపోయేది. కానీ, డేటా ప్రపంచవ్యాప్తంగా ప్రవహిస్తుంది, కాబట్టి దానికి ప్రపంచవ్యాప్త నియంత్రణ అవసరం. ప్రస్తుత సాంకేతిక అభివృద్ధి దశలో మూలధన కేంద్రీ కరణ, ఏకీకరణ అసాధారణ స్థాయికి చేరుకుంటున్నందున ఇది మరింత అవసరం.

### నూతన సమాజం దిశగా

జ్ఞానం స్వభావరీత్యా పోటీ లేనిది. ఇది ఇతర వనరులన్నిటికీ భిన్నమైనది, ఎందుకంటే దీనిని ఉపయోగించడం వల్ల అది తరిగిపోదు. ఒక పుస్తకాన్ని చదివినంత మాత్రాన దానిలోని విషయం తగ్గిపోదు. పైగా, చదివేవారు ఇప్పటికే ఉన్న పుస్తకానికి మరికొన్ని కోణాలను జోడించి, అందులో పరిగణనలోకి తీసుకోని వాటిపైనా బాష్యాలు తీయవచ్చు. అందువల్ల, పంచుకోవడం, పరస్పర సంభాషణలు జ్ఞాన వృద్ధికి చాలా అవసరం. కొత్త టెక్నాలజీ కూడా ఒక ఫీడ్‌బ్యాక్ యంత్రాంగంపై ఆధారపడి ఉంటుంది, ఈ ప్రక్రియలో వినియోగదారుల నుండి కొత్త సమాచారం వచ్చి చేరుతుంది. దీనివల్ల ఉత్పత్తి సామాజికీకరణ మరింతగా పెరుగుతుంది. ఇది పని, పనియేతర వేళల సాంప్రదాయ విభజనలను అధిగమిస్తుంది. ఉత్పత్తి అంతకంతకూ సహకారంతో కూడుకున్నదిగా మారుతుంది. వ్యక్తిగత నైపుణ్యాలపై ఆధారపడటానికి బదులుగా, అది సాధారణ ఉత్పాదక శక్తిని, సామూహిక జ్ఞానాన్ని వినియోగించుకోవడంపై ఎక్కువగా కేంద్రీకరిస్తుంది. అలాగే, సాంకేతిక పరిజ్ఞానం వాడకం ప్రత్యక్ష మానవ శ్రమ వినియోగాన్ని గణనీయంగా తగ్గిస్తుందని ఒక అంచనా. టెక్నాలజీ ఉద్దేశమూ ఇదే. అయితే, మానవ శ్రమను తగ్గించడం వల్ల ఉపాధి తగ్గించాల్సిన అవసరం లేదు. వాస్తవానికి, తక్కువ ప్రత్యక్ష మానవ శ్రమతో అదే ఉత్పత్తిని సాధించవచ్చని ఇది నిర్ధారిస్తుంది. అటువంటి మార్పు వాస్తవానికి అవసరమైన పని కాలాన్ని తగ్గించి, 'విశ్రాంతి సమయాన్ని' పెంచాలి. వేగంగా పనిచేసే కొత్త సాంకేతికతను ఉపయోగించడం ద్వారా ఒక రోజులోని పని గంటలను లేదా ఒక వారంలోని పని దినాలను తగ్గించవచ్చు. కానీ పెట్టుబడిదారీ విధానంలో కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించినప్పుడు ఇది చాలా అరుదుగా జరుగుతుంది. పెట్టుబడి సంబంధాలు పూర్తిగా భిన్నమైన ఫలితానికి దారితీస్తాయి: తక్కువ సంఖ్యలో కార్మికులు అంతే లేదా అంతకంటే ఎక్కువ పని గంటలు పనిచేస్తుంటారు. ఈ ప్రక్రియలో చాలా మంది కార్మికులు ఉద్యోగాలు కోల్పోతారు. ఎందుకంటే, సాంకేతిక పరిజ్ఞానాన్ని కలిగి ఉన్న పెట్టుబడిదారుడు, ఇప్పటికే ఉన్నవాటిని అధిగమించగల కొత్త తరం సాంకేతిక పరిజ్ఞానం ఆవిర్భవిస్తుందనే భయంతో, పెట్టుబడి విలువను వీలైనంత వేగంగా రాబట్టుకోవాలన్న యావలో ఉంటాడు. అందువల్ల, మిగులును వీలైనంత వేగంగా రాబట్టడానికి, కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రవేశపెట్టడంతో పని గంటలు తగ్గడం అటుంచి, బహుశా పెరగవచ్చు. మరోవైపు, సాంకేతిక పరిజ్ఞానం, వనరులు సామాజిక యాజమాన్యంలో ఉంటే, సాధారణ మేధస్సు వినియోగం లాభార్జన అనే సంకుచిత ప్రయోజనాలకు దూరంగా ఉంటుంది. అవసరమైన పని గంటలు తగ్గుతాయి , మానవుల తీరిక సమయం పెరుగుతుంది. జ్ఞానాధారిత సాంకేతిక పరిజ్ఞానాన్ని వ్యక్తిగత లాభాల వేట నుండి విముక్తి చేయగలిగిన నాడు టెక్నాలజీ మరింత వేగంగా అభివఅద్ధి చెందుతుంది. అలాగే, సామాజిక యాజమాన్యం కింద ఉత్పత్తి ప్రక్రియలో ప్రత్యక్ష మానవ శ్రమను తగ్గించడం వల్ల మెజారిటీ ప్రజల నిరుద్యోగానికి, దు:ఖానికి దారితీయకుండా, సృజనాత్మక శక్తిని పెంపొందించే తీరిక సమయానికి వీలేర్పడుతుంది. అందువల్ల, జ్ఞాన ఆధారిత ఉత్పత్తి అనేది సహకారం, పంచుకోవడంపై ఎక్కువగా ఆధారపడే ఉత్పత్తి సంబంధానికి అనుగుణంగా ఉంటుంది. అటువంటి సమాజం, ఏమి ఉత్పత్తి చేయాలో, ఏమి చేయకూడదో ప్రజాస్వామ్యబద్ధంగా నిర్ణయించుకోవడానికి ప్రత్యక్ష ఉత్పత్తిదారుల స్వయంప్రతిపత్తిని నిలుపుకోవాలి. సంఘీభావ సూత్రాల ఆధారంగా లాభాల పంపిణ జరగాలి. అయితే, టెక్నాలజీలు సమాజాలను మార్చవు. అవి కేవలం అటువంటి మార్పు ఆవశ్యకతను మాత్రమే సృష్టిస్తాయి. ప్రైవేట్ ఆస్తిపై ఆధారపడిన పెట్టుబడి సంబంధాన్ని సమూలంగా మార్చి, దాని స్థానంలో సామాజికరించిన ఉత్పత్తి , పంపిణీని ప్రవేశపెట్టడం ద్వారా మాత్రమే సామాజిక మార్పు సాధ్యమవుతుంది. ఇది క్రమంగా తమ భవిష్యత్తును తామే నిర్ణయించుకునే సంఘటిత ఉత్పత్తిదారుల సముదాయం పెరగడానికి తోడ్పడుతుంది.

# ఉన్నత విద్యావ్యవస్థ నోరునొక్కడం ప్రజాస్వామ్యాన్ని బలహీనపరచడమే



రచయిత భూవిజ్ఞాన శాస్త్రవేత్త. విజ్ఞాన శాస్త్రం, రాజకీయాలు, పర్యావరణం, విద్య అంశాలపై వ్యాఖ్యాత కూడా

**సిపి రాజేంద్రన్**

వెరైటీస్ ఆఫ్ డెమొక్రసీ సంస్థ (విడిఐ) –2026 నివేదిక ప్రకారం భారత దేశంలో ఎన్నికలు జరుగుతున్నా అది నిరంకుశ పాలన (ఎలక్టోరల్ ఆటోక్రసీ) కొనసాగుతున్న దేశంగా గుర్తింపబడి. ఈ విషయంలో ప్రపంచ దేశాల వరుసలో దిగువ భాగాన స్థానం పొందింది. ముఖ్యంగా భావ ప్రకటన స్వేచ్ఛ, మీడియా స్వతంత్రత, పౌర సమాజ స్వేచ్ఛ, ప్రజాస్వామ్య హక్కులు భారత్‌లో క్రమంగా క్షీణిస్తున్నాయని ఆ నివేదిక పేర్కొంది. అలాగే బాధ్యతాయుత పాలన, బహుళత్వాన్ని నిలబెట్టే సంస్థలు, ప్రజాస్వామ్య ప్రమాణాలు క్రమంగా నిర్వీర్యం అవుతున్నాయని, అందువల్ల భారత్ “అత్యంత వేగంగా నిరంకుశత్వం వైపు సాగుతున్న దేశాల”లో ఒకటిగా ఉందని పేర్కొంది.

ఈ పరిణామంపై అంతర్జాతీయ స్థాయిలో కూడా ఆందోళన పెరుగుతోందని నివేదిక పేర్కొంది.

‘స్కూల్స్ ఎట్ రిస్క్ ఫ్రీ టు థింక్ 2024’ అనే మరో నివేదికలో భారత్‌లో అకాడెమిక్ (విద్యా విషయ) స్వేచ్ఛ “చాలా పరిమితంగా ఉందని” పేర్కొన్నారు. రాజకీయ జోక్యం పెరగడం, విద్యాసంస్థలపై ఒత్తిడి అధికమవడం వల్ల విశ్వవిద్యాలయాల స్వయం ప్రతిపత్తి క్షీణిస్తోందని ఆ నివేదిక తెలిపింది. ముఖ్యంగా ఉన్నత విద్యా వ్యవస్థలో హిందుత్వ జాతీయవాద అజెండాను వ్యవస్థీకరణ చేస్తున్నారని అది ప్రస్తావించింది. పాఠ్యాంశాలలో మార్పులు చేయడం, పరిశోధనా స్వేచ్ఛను పరిమితం చేయడం, మేధో చర్చకు అవకాశం ఇవ్వకపోవడం వంటి ఆందోళనకర పరిణామాలను ఆ నివేదిక ప్రస్తావించింది. ఇదొక్కటే కాదు, వెరైటీస్ ఆఫ్ డెమొక్రసీ ఇన్‌స్టిట్యూట్ నుండి ఫ్రీడమ్ హౌస్ వరకు వరుసగా వివిధ సంస్థలు రూపొందించిన ప్రపంచస్థాయి నివేదికల్లో భారతదేశంలో ప్రజాస్వామ్యం క్షీణిస్తోందని తెలుపుతున్న విస్తృత ధోరణికి ఇది అనుగుణంగా ఉంది. ఒకప్పుడు విమర్శనాత్మక ఆలోచనలకు, బహుళాభిప్రాయ చర్చలకు వేదికలుగా పేరొందిన భారత విశ్వవిద్యాలయాల్లో బోధించే స్వేచ్ఛ, నేర్చుకునే స్వేచ్ఛ, ప్రశ్నించే హక్కులకు ఏమాత్రం గ్యారంటీ లేకుండా పోతోంది.

అయితే, అకాడెమిక్ స్వేచ్ఛ క్షీణించడం ప్రజాస్వామ్యాన్ని ఎలా బలహీనపరుస్తుందనే అంశంపై తక్కువ చర్చ జరుగుతోంది. ఎన్నికలు, ఓటు హక్కులు, చట్టాలు మాత్రమే కాదు, బలమైన పౌర సమాజం, ఆధారాలతో కూడిన సమాచారం అందరికి పొందే అవకాశం, నిజమైన ప్రజా చర్చలకు స్థానం కల్పించడం ఇవన్నీ ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యానికి అవసరం. కానీ ఇప్పుడు ఈ రంగాలన్నీ, ముఖ్యంగా ఉన్నత విద్యా వ్యవస్థలో కుదించుకుపోతున్నాయి. వీటన్నింటిపై పడుతున్న ఒత్తిడి ఉన్నత విద్యారంగంలో స్పష్టంగా కనపడుతోంది. పరిశోధన, చర్చలను ప్రోత్సహించాల్సిన విశ్వవిద్యాలయాలు నిధుల కోతలు, నియంత్రణ, పెరుగుతున్న స్వీయ సెన్సార్ నిబంధనల కారణంగా తమ స్వయంప్రతిపత్తిని కోల్పోతున్నాయి. ప్రతిపాదిత వికసిత భారత్ శిక్షా అధిష్టాన్ బిల్లు ఈ తరహా నియంత్రణలను మరింత కేంద్రీకరించే దిశగా ఉందనీ, అకాడెమిక్ స్వేచ్ఛ కంటే విధేయతకే ప్రాధాన్యం ఇస్తోందనీ విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటువంటి స్వేచ్ఛాయుత వేదికలు కుంచించుకుపోతే, విమర్శనాత్మకంగా ఆలోచించే సామర్థ్యం, ప్రజాస్వామ్యంలోని బహుళత్వాన్ని నిలబెట్టే శక్తి కూడా సమాజంలో క్రమంగా బలహీనపడుతాయి.

### ఆందోళనకర ధోరణి

ది వైర్ కథనం ప్రకారం, 2014–26 మధ్యకాలంలో 62 మంది ఉన్నత విద్యావేత్తలు తమ అభిప్రాయాలు లేదా రాజకీయ వైఖరుల కారణంగా శిక్షాత్మక చర్యలను ఎదుర్కొన్నారు. అధ్యాపకులను ‘ప్రభుత్వ ఉద్యోగులు’గా నిర్వచించే సేవా నిబంధనలను ఉపయోగిస్తూ క్యాంపస్‌లలో భావ ప్రకటనా స్వేచ్ఛను అణచివేస్తున్నారు. నేచర్ పత్రికలో 2024 ఏప్రిల్‌లో ప్రచురితమైన వ్యాసంలో యామిని అయ్యర్, ఇండియా అకాడమిక్ ఫ్రీడమ్ నెట్‌వర్క్ నివేదికను ఉదహరిస్తూ, అనేక విద్యా కార్యక్రమాలను అడ్డుకోవడం, అధ్యాపకులు, విద్యార్థులను అరెస్టు చేయడం, విదేశీ పరిశోధకులకు వీసా ఇబ్బందులు సృష్టించడం వంటి పరిణామాలను ప్రస్తావించారు. 1960ల ప్రారంభంలో భారత పౌరసత్వం స్వీకరించి ఇక్కడ పనిచేస్తూనే ప్రభుత్వాన్ని బహిరంగంగా విమర్శించిన బ్రిటిష్ శాస్త్రవేత్త జెబిఎస్ హాల్డేన్ పరిస్థితితో పోలిస్తే, నేటి పరిస్థితి చాలా భిన్నంగా ఉంది. అకాడెమిక్ రంగంలో భిన్నాభిప్రాయాలకు ఉన్న స్థలం ఎంతగా కుచించుకుపోయిందో ఇది స్పష్టం చేస్తోంది. 2024–26 కాలానికి సంబంధించిన వివరాలు చూస్తే, విద్యార్థులు, పరిశోధకులు, అధ్యాపకులను లక్ష్యంగా చేసుకుంటూ అకాడెమిక్ స్వేచ్ఛపై పెద్దఎత్తున దాడి కొనసాగుతున్నట్టు తెలుస్తోంది. రాజకీయ ఒత్తిళ్లు, సంస్థాగత వైఫల్యాలు, సామాజిక పక్షపాతాలు కలిసి కొన్ని అంశాలను చర్చించరానివిగా, కొన్ని గొంతులను ప్రమాదకరమైనవిగా ముద్ర వేస్తున్నాయి. జ్ఞానాన్వేషణ కూడా రాజకీయ అనుకూలతకు తలవంచాల్సిన పరిస్థితిని ఈ ధోరణులు సూచిస్తున్నాయి.

ఒక స్థిరమైన, ఆందోళనకర ధోరణి స్పష్టంగా కనిపిస్తోంది. నేరాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవడంలో సంస్థలు విఫలమవుతున్నాయన్న ఆరోపణలు పెరుగుతున్నాయి. పర్యవేక్షణ, న్యాయం

> **“ విద్యార్థులు, అధ్యాపకులను రక్షించాల్సిన వ్యవస్థలే మౌనం వహించడం లేదా నిర్వీర్యం చెందినప్పుడు భయానక వాతావరణం మరింత తీవ్రమవుతోంది. విశ్వాసం క్షీణిస్తుంది. అధికారాన్ని మాత్రమే కాపాడుతారనీ, దానిని ప్రశ్నించే గొంతు లకు స్వేచ్ఛాయుత ఆలోచనలకు పెంపొందించా ల్సిన విద్యా సంస్థల గోడల మధ్య కూడా ఆశ్రయం ఉండదన్న సందేశం మాత్రం స్పష్టంగా ఉంది. ఈ చర్యలు పాలకులను జవాబుదారు లుగా నిలదీయగల పౌర సమాజం, విద్యాసంస్థల సామర్థ్యాన్ని బలహీనపరుస్తున్నాయి. ”**

అందించాల్సిన అంతర్గత ఫిర్యాదుల కమిటీలను నిర్వీర్యం చేస్తున్నారని విమర్శకులు చెబుతున్నారు. అవి నిజమైన జవాబుదారీతనం కోసం కాకుండా, కేవలం నిబంధనల రూపకల్పనకే పరిమితమయ్యాయని చెబుతున్నారు. విద్యార్థులు, అధ్యాపకులను రక్షించాల్సిన వ్యవస్థలే మౌనం వహించడం లేదా నిర్వీర్యం చెందినప్పుడు భయానక వాతావరణం మరింత తీవ్రమవుతోంది. విశ్వాసం క్షీణిస్తుంది. అధికారాన్ని మాత్రమే కాపాడుతారనీ, దానిని ప్రశ్నించే గొంతులకు స్వేచ్ఛాయుత ఆలోచనలకు పెంపొందించాల్సిన విద్యాసంస్థల గోడల మధ్య కూడా ఆశ్రయం ఉండదన్న సందేశం మాత్రం స్పష్టంగా ఉంది. ఈ చర్యలు పాలకులను జవాబుదారులుగా నిలదీయగల పౌర సమాజం, విద్యాసంస్థల సామర్థ్యాన్ని బలహీనపరుస్తున్నాయి. తద్వారా భారత ప్రజాస్వామ్యానికి అత్యవసరమైన విజ్ఞాన రంగపు పునాదులను దెబ్బతీస్తున్నాయి. హింసకు శిక్ష లేకపోయినప్పుడు, కుల–మత పక్షపాతాలను ప్రశ్నించాల్సిన సంస్థలే వాటిని పునరుత్పత్తి చేస్తున్నప్పుడు, లైంగిక దాడులకు పాల్పడిన వారిని రక్షిస్తున్నప్పుడు, భిన్నాభిప్రాయాలను నేరాలుగా ముద్ర వేసినప్పుడు, ప్రతిఘటనా స్వరాలు కూడా స్పష్టంగా వినిపిస్తున్నాయి.

పౌర–రాజకీయ హక్కులపై అంతర్జాతీయ ఒప్పందం (ఇంటర్నేషనల్ కోవెనెంట్ ఆన్ సివిల్ అండ్ పోలిటికల్ రైట్స్ – ఐసిసిపిఆర్)కు సంబంధించిన మొదటి ఆప్షనల్ ప్రోటోకాల్‌పై సంతకం చేయడానికి భారత దేశం నిరాకరించిందంటేనే ఈ హక్కుల విషయంలో దాని వైఖరేమిటో స్పష్టమవుతోంది. 1979 నుంచే భారత్ ఐసిసిపిఆర్ ఒప్పందంలో భాగస్వామ్య దేశంగా ఉన్నప్పటికీ, ఐక్యరాజ్యసమితి ఫిర్యాదు పరిష్కార వ్యవస్థను మాత్రం అంగీకరించలేదు. అంటే, దేశీయ న్యాయపరమైన మార్గాలన్నీ వినియోగించిన తరువాత కూడా హక్కుల ఉల్లంఘనలకు గురైన పౌరులకు అంతర్జాతీయ స్థాయిలో న్యాయం కోరే అవకాశంఉండదు. ఇందులో తీవ్రమైన వైరుధ్యం కనిపిస్తోంది. భారత రాజ్యాంగంలోని 14, 19, 21 అధికరణలు ఐసిసిపిఆర్‌లో పొందుపరిచిన అనేక హక్కులను హామీ ఇస్తున్నాయి. భారత సుప్రీంకోర్టు కూడా ప్రాథమిక హక్కులను విశదీకరించేందుకు, విస్తరించేందుకు అంతర్జాతీయ మానవ హక్కుల ప్రమాణాలను అనేక సందర్భాల్లో ఆధారంగా తీసుకుంది. అయినప్పటికీ, దేశీయ న్యాయస్థానాలు విఫలమైనప్పుడు, ముఖ్యంగా మానవ హక్కుల ఉల్లంఘనలకు అధికంగా గురయ్యే అట్టడుగు వర్గాల ప్రజలకు అంతర్జాతీయ స్థాయిలో న్యాయం కోరే అవకాశం కల్పించే ఫిర్యాదు వ్యవస్థను మాత్రం ప్రభుత్వం అంగీకరించడం లేదు.

ఈ అంశాన్ని రవి నాయర్ రాసిన 'ది ఉమర్ ఖాలిద్ అండ్ షర్జీల్ ఇమామ్ కేస్: యాన్ ఇంటర్నేషనల్ క్యాంపెయిన్ వితిన్ ది ప్రిజమ్ ఆఫ్ పాసిబిలిటీ' అనే విశ్లేషణాత్మక వ్యాసం (జనవరి 7, 2026) స్పష్టంగా ప్రస్తావించింది. యువ అకాడెమిక్‌లు ఉమర్ ఖలీద్, షర్జీల్ ఇమామ్‌లు గత ఐదేళ్లుగా విచారణ ఖైదీలుగా జైలులోనే ఉన్నారు. జనవరి 6న సుప్రీంకోర్టు వారి బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించడమే కాకుండా, మరో ఏడాది పాటు బెయిల్ కోసం దరఖాస్తు చేయకుండా ఆంక్షలు విధించింది. ఈ నిర్ణయం అనేక మంది న్యాయ నిపుణులను ఆశ్చర్యానికి గురిచేసింది. పత్రికా రచయిత ఇర్ఫాన్ మెహ్రాజ్ , మానవతావాది సోనమ్ వాంగ్‌చుక్ (ఆయనను కూడా ప్రభుత్వం జైల్లో పెట్టింది. అయితే ఆయన ఇప్పుడు విడుదలయ్యారు) వంటి వారు బెయిల్ కోసమే దీర్ఘకాల న్యాయపోరాటాలు చేయాల్సి వస్తున్న వేళ, తీవ్రమైన నేరారోపణలు ఎదుర్కొంటున్న కొందరు ప్రముఖ ఆధ్యాత్మిక గురువులు మాత్రం పదేపదే పెరోల్ లేదా బెయిల్ పొందుతున్నారు. ఇది చాలా స్పష్టమైన సంకేతాన్ని ఇస్తోంది. ఒకవైపు న్యాయం, గౌరవం, ప్రజాస్వామ్య హక్కుల కోసం స్వరం వినిపించే వారిని ముప్పుగా చూస్తున్నారు. మరోవైపు తీవ్రమైన నేరారోపణలు ఎదుర్కొంటున్న వారికి సడలింపులు లభిస్తున్నాయి. ఎవరి స్వేచ్ఛలను రక్షిస్తున్నారు? ఎవరి హక్కులను నిశ్శబ్దంగా వదిలేస్తున్నారు? అనే ఆందోళనకర సత్యం ఈ అసమానతలో ముందుకువస్తోంది.

### ఏకరూప ఆలోచనల మూల్యం

తనను తాను 'ప్రజాస్వామ్యానికి మాతృభూమి' గా ప్రకటించుకునే దేశం, భిన్న ఆలోచనలు చేసే స్వేచ్ఛ కంటే ఒకేరకమైన ఆలోనలకే ఎందుకు ప్రాధాన్యం ఇస్తోంది? ఉన్నత విద్యా సంస్థలు ఎప్పటినుంచో సంప్రదాయ భావజాలాన్ని ప్రశ్నించే వారికీ, కొత్త ఆలోచనలను సృష్టించే వారికీ ఆశ్రయాలుగా నిలిచాయి. ఇది విశ్వవిద్యాలయ విధానంలో లోపం కాదు. నిజానికి అదే


**చదవండి! చదివించండి!!**

# Marxist

**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) సైద్ధాంతిక త్రైమాస ఆంగ్ల పత్రిక**

వెల: ఒక ప్రతి రూ. 50


ప్రతులకొరకు


**The Manager,**

The Manager, Marxist, A. K. Gopalan Bhawan
27-29 Bhai Vir Singh Marg, New Delhi 110001
Phone: (91-11) 23348725; Email: pdpbln@gmail.com

అసలు లక్షణం. మెజారిటీ అభిప్రాయాలను ప్రశ్నించాల్సి వచ్చినా, ఇలాంటి చర్చలు, విభిన్న ఆలోచనల సంఘర్షణల ద్వారానే ప్రజాస్వామ్యాలు కొత్త శక్తిని పొందుతాయి. చరిత్ర ఒక హెచ్చరికను కూడా ఇస్తోంది. నిరంకుశత్వం ఎప్పుడూ ఒక్కసారిగా ఎక్కడినుండో ఊడిపడినట్టుగా రాదు. చాలా సందర్భాల్లో అది ప్రజాస్వామ్య అంతర్భాగం నుంచే నెమ్మదిగా, నిశ్శబ్దంగా, చివరకు ప్రజాస్వామ్య వ్యవస్థలోని ప్రజల సమ్మతితోనే పెరుగుతుంది. అది ఒక్కసారిగా ఏర్పడదు. కృత్రిమ బాధిత భావన

> **“ అకాడెమిక్ ఫ్రీడమ్ ఇండెక్స్‌లో నమోదైన ఈ క్షీణత కేవలం ఒక గణాంకం మాత్రమే కాదు. అది భారత ప్రజాస్వామ్య ఆరోగ్యాన్ని కొలిచే ప్రమాణం. మేధావులు, ఉద్యమకారులు, విద్యార్థుల స్వరాలను అణచివేసినప్పుడు, భిన్నాభిప్రాయాలను నేరంగా పరిగణించినప్పుడు, రాజకీయ ప్రయోజనాలు విద్యాసంస్థలను తమ ఆధీనంలోకి తీసుకున్నప్పుడు, ప్రజాస్వామ్య జవాబుదారీతనానికి ఆధారమైన పునాదులను క్రమబద్ధంగా నిర్వీర్య మౌతాయి. ”**




లను సృష్టించడం, భయాన్ని పెంపొందించడం, ప్రజాస్వామ్య ప్రమాణాలను క్రమంగా క్షీణింపచేయడం ద్వారా సమాజాన్ని అలవాటు చేయడం వల్ల ఉద్భవిస్తుంది. ఈ ప్రక్రియలో పౌరులు, సంస్థలు తమ స్వేచ్ఛలను తామే నిర్వీర్యం చేసుకునే ప్రక్రియలో నిదానంగా భాగస్వాములవుతారు. తాము కోల్పోతున్న రక్షణలే, ప్రజాస్వామ్యానికి అసలు పునాదులని వారు గ్రహించే సమయానికి చాలా ఆలస్యమై పోతుంది.

అకాడెమిక్ ఫ్రీడమ్ ఇండెక్స్‌లో నమోదైన ఈ క్షీణత కేవలం ఒక సారాంశం యొక్క గణాంకం కాదు. అది భారత ప్రజాస్వామ్య ఆరోగ్యాన్ని కొలిచే ప్రమాణం. మేధావులు, ఉద్యమకారులు, విద్యార్థుల స్వరాలను అణచివేసినప్పుడు, భిన్నాభిప్రాయాలను నేరంగా పరిగణించినప్పుడు, రాజకీయ ప్రయోజనాలు విద్యాసంస్థలను తమ ఆధీనంలోకి తీసుకున్నప్పుడు, ప్రజాస్వామ్య జవాబుదారీతనానికి ఆధారమైన పునాదులను క్రమబద్ధంగా నిర్వీర్య మౌతాయి. ఇది మనం మౌనంగా చూస్తూ ఉన్న సమయంలోనే ఒకదాని తరువాత ఒకటిగా ఒకొక్క ఇటుకను తీసివేస్తూ ప్రజాస్వామ్యాన్ని కూల్చివేయడమే! గణాంకాలు ఒక విషయం చెబుతాయి. అయితే, ఒకప్పుడు ప్రశ్నలతో, చర్చలతో మారుమోగిన స్వరాలు ఇప్పుడు గుసగుసలుగా మారిపోవడంలో, న్యాయం క్రమంగా అధికార ప్రభావానికి లోనవుతున్న న్యాయస్థానాల్లో, ఒకప్పుడు ధైర్యంగా మాట్లాడినవారి ప్రస్తుత నిశ్శబ్దంలో, ఆ నిశ్శబ్దం రోజురోజుకూ మరింతగా విస్తరించడంలో, రాజ్యవ్యవస్థ మరింత అధికార యంత్రాంగ ఆధారితంగా, శిక్షాత్మకంగా, నియంత్రణల ఆధారంగా మారడంలో అసలు కథ మన కళ్ల ముందే ఆవిష్కృత మౌతుంది. ఇప్పుడు సంస్థలు ఇదే దారిలో ముందుకు సాగుతాయా? లేక తమ అసలు లక్ష్యాన్ని తిరిగి స్వీకరిస్తాయా? విమర్శనాత్మక ఆలోచనకు అవకాశం కల్పించే, అధికారాన్ని ప్రశ్నించే, న్యాయం, పాలన అంశాలపై అర్థవంతంగా సాగే చర్చల్లో యువత పాల్గొనేలా చేసే వేదికలను మనం రక్షించుకుంటామా లేదా అన్నవే మన ముందు, సమాజం ముందున్న ప్రశ్నలు.

**(అనువాదం: పొగడ దొరువు)**

రాజకీయ పరిణామాలు

# అమెరికా కంపెనీల లాభాల కోసం ప్రజలపై భారాలు

ఎ కోటిరెడ్డి



రచయిత మార్క్సిస్టు ఎడిటోరియల్ బాధ్యులు

ఐదు రాష్ట్రాలలో ఎన్నికలు పూర్తి అయిన తర్వాత కేంద్ర ప్రభుత్వం ప్రజలపై వరుసగా భారాలు వేస్తున్నది. ఎన్నికలయిన 15 రోజుల్లో పెట్రోలు, డీజిల్‌పై లీటరుకు 7.50 రూపాయల చొప్పున ధరలు పెంచింది. ప్రస్తుతం హైదరాబాద్‌లో లీటరు పెట్రోలు 115.73, డీజిల్ 103.82 రూపాయలకు పెరిగాయి. 14.2 కిలోల వంటగ్యాస్ సిలిండర్ ధర 965 రూపాయలు కాగా, వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్న వంటగ్యాస్ 19 కిలోల సిలిండర్ ధర మే నెలకు ముందు 2,105 రూపాయలు ఉండగా ఇపుడు 3,315 రూపాయలకు అంటే 60 శాతానికి పైగా పెరిగింది. వాహనాలకు వినియోగిస్తున్న సిఎన్‌జి కిలో 91 నుండి 97 రూపాయలకు పెరిగింది.

2025-26 సంవత్సరంలో భారతదేశం 12,180 కోట్ల డాలర్ల ముడి చమురును దిగుమతి చేసుకున్నది. అంతకు ముందు సంవత్సరం 13,720 కోట్ల డాలర్ల ముడి చమురును దిగుతమతి చేసుకోగా, పశ్చిమాసియా పరిణామాల నేపథ్యంలో 2025-26 లో దిగుమతుల బిల్లు తగ్గింది. 2025లో మనదేశ ముడి చమురు అవసరాలలో సగం రష్యా నుండి దిగుమతి చేసుకున్నాం. సంవత్సరం చివరికి వచ్చేసరికి అమెరికా టారిఫ్‌లు, రష్యా సంస్థలపై విధించిన ఆంక్షల వలన ఇది 38 శాతానికి తగ్గింది. ఇరాన్ నుండి దిగుమతులను పూర్తిగా నిలిపివేసింది. ఈ రెండు దేశాలు మనకు తక్కువ ధరకు పెట్రోలియం ఉత్పత్తులను సరఫరా చేయటంతో బాటు మనం రూపాయలలోనే చెల్లింపులు చేస్తున్నాం. దానితో మనకు డాలర్ల అవసరం తగ్గింది. డాలర్ల అవసరం ఎంతగా తగ్గితే రూపాయి విలువ అంత స్థిరంగా ఉంటుంది. ఇపుడు అనుసరిస్తున్న దిగుమతుల విధానం వలన పెట్రోలియం ఉత్పత్తులతో పాటు నిత్యావసరాల ధరలన్నీ పెరగటంతో ప్రజలు అల్లాడుతున్నారు.

ఇరవై రోజుల వ్యవధిలో పెట్రోలు, డీజిల్ ధరలు ఏడు శాతంపైగా పెరగటం సామాన్య ప్రజలకు భారంగా పరిణమిస్తున్నది. మోడి నాయకత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం స్వతంత్ర ఆర్థిక విధానాలకు తిలోదకాలిస్తూ, అమెరికా ఆదేశాలకు అనుగుణంగా వ్యవహరిస్తున్నది. మనకు మిత్రదేశాలుగా ఉండి, తక్కువ ధరకు ముడి చమురు సరఫరా చేస్తున్న రష్యా నుండి దిగుమతులను తగ్గించింది. ఇరాన్ నుండి దిగుమతులను పూర్తిగా ఆపివేసింది. ఇరాన్‌పై దాడితో హెర్మూజ్ జలసంధిలో ముడి చమురు రవాణాకు ఆటంకాలు ఏర్పడ్డాయి. ముడి చమురు కొరత, భవిష్యత్‌పై భయాలతో అతలాకుతలమౌతున్న ప్రపంచ మార్కెట్లను కాపాడుకోవటం కోసం రష్యా, ఇరాన్ ముడి చమురు దిగుమతులకు ఆమోదించక తప్పని పరిస్థితి అమెరికాకు ఎదురైంది. ఫలితంగా ఈ దేశాల నుండి కొంత మేరకు పెట్రోలియం ఉత్పత్తులను దిగుమతి చేసుకుంటున్నప్పటికీ, ఈ దిగుమతులను తగ్గించిన మేరకు అమెరికా కంపెనీల నుండి ఎక్కువ మొత్తం ముడి చమురు దిగుమతి చేసుకుంటున్నది. అమెరికా కంపెనీలు మనదేశానికి పెట్రోలియం ఉత్పత్తులను అధిక ధరలకు సరఫరా చేస్తున్నాయి. అమెరికా కంపెనీలకు అదనంగా చెల్లిస్తున్న మేరకు పెట్రోలు, డీజిల్, వంటగ్యాస్, సిఎన్‌జి ధరలను పెంచి, కేంద్ర ప్రభుత్వం ఆ భారాన్నంతా ప్రజలపై వేస్తున్నది. దీనికి పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ వాతావరణాన్ని సాకుగా చూపుతున్నది. మోడీ ప్రభుత్వం అమెరికా ఆదేశాలకు లొంగిపోకుండా రష్యా, ఇరాన్‌ల నుండి పెట్రోలియం ఉత్పత్తుల దిగుమతులను కొనసాగించినట్లైతే ప్రజలు అధిక ధరలు చెల్లించాల్సిన అవసరం ఉండేది కాదు. కేవలం అమెరికాకు లొంగిపోయిన మోడీ ప్రభుత్వం అమెరికా ఆయిల్ కంపెనీలకు లాభాలను పెంచటం కోసం మన ప్రజలపై భారాలు వేస్తున్నది. ఈ ప్రభుత్వం అనుసరిస్తున్న విదేశాంగ విధానం ప్రజల జీవితాలను కల్లోల భరితం చేస్తున్నది.

**ధరలు పెంచుతుంటే పొదుపెలా చేయాలి?**

ప్రజలందరూ పొదుపు చేయాలని మోడిగారు ప్రజలకు సందేశం ఇచ్చారు. కానీ మరోవైపున ప్రభుత్వమే ధరలు పెంచుతుంటే ప్రజలు పొదుపెలా చేయాలి అన్న సందేహం సామాన్యులను పీడిస్తున్నది. యుద్ధం పేరుతో వేస్తున్న భారాలు, పెరుగుతున్న ధరలతో జీవనవ్యయం పెరగటంతో వస్తున్న అత్తెసరు ఆదాయంతో కనీసావసరాలు కూడా తీరటం లేదు. ఇక పిల్లల విద్య, ఆరోగ్య వ్యయం భరించలేని స్థాయికి పెరుగుతున్నాయి. పెరుగుతున్న వ్యయాన్ని తగ్గించటంతో పాటు ప్రభుత్వం ఈ రంగాలకు ఎక్కువ నిధులను కేటాయించాలనీ, ప్రభుత్వమే ప్రధానపాత్ర నిర్వహించాలని చేస్తున్న విజ్ఞప్తులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవటం లేదు. ఫలితంగా ఎక్కువ కుటుంబాలు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాయి.

ప్రజలు పొదుపు విధానాలు పాటించాలని చెబుతున్న ప్రభుత్వం ధరలు పెంచటంతో పాటు ప్రజల ఆదాయాలను తగ్గించే విధానాలను అమలు చేస్తున్నది. కోట్లాది మంది గ్రామీణ పేదలు, నిరుద్యోగులకు గ్యారంటిగా పని కల్పిస్తున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామి చట్టాన్ని రద్దుచేసి, దాని స్థానంలో ఏ మాత్రం పని గ్యారంటి లేని విబి రామ్‌జి పథకాన్ని ప్రవేశపెట్టటం, కార్మికుల ఉపాధి అవకాశాలను, జీతాలను తగ్గించటానికి దారితీసే లేబర్ కోడ్‌లను అమలు చేయటం ఇందుకు స్పష్టమైన ఉదాహరణలు.

"నోటితో మాట్లాడుతూ నొసటితో వెక్కిరించిన" విధంగా ప్రపంచంలోని దేశాల అధ్యక్షులు, ప్రధానమంత్రులు, అరబ్ దేశాలలో ఆయిల్ డబ్బుతో మునిగితేలుతున్న సుల్తాన్‌లు ఎవ్వరూ ధరించనంత ఖరీదైన సూట్లు మోడిగారు ధరిస్తున్నారు. కనీసం ప్రజలకు పొదుపును బోధించటం ప్రారంభించిన తర్వాత

కూడా ఈ ఖర్చులను ఏ మాత్రం తగ్గించలేదు. ప్రధానమంత్రికి ఏ మాత్రం సంబంధం లేని విదేశీ పర్యటనలు–విదేశీ వ్యవహారాలు చక్కబెట్టటానికి విదేశాంగశాఖమంత్రి ఉన్నారు. ముఖ్యమైన సందర్భాలలో మాత్రమే ప్రధానమంత్రులు, దేశాధ్యక్షులు విదేశీ పర్యటనలు చేస్తారు. కానీ మోడీ మాత్రం అదాని వ్యవహారాలు చక్కబెట్టటం కోసం ప్రభుత్వ ధనంతో విదేశీ పర్యటనలు చేయటం మానలేదు. "ఎదుటి వారికి చెప్పేటందుకే నీతులు ఉన్నాయి" అన్న సామెతకు మోడీగారి పనితీరు సరిగ్గా సరిపోతుంది.

**రైతాంగానికి నష్టం కలిగించే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు**

అమెరికా, న్యూజిలాండ్ దేశాలతో చేసుకుంటున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు మన వ్యవసాయ, పారిశ్రామిక రంగాలను ధ్వంసం చేస్తాయి. ద్వైపాక్షిక ఒప్పందంలో భాగంగా రానున్న ఐదు సంవత్సరాలలో అమెరికా నుండి 50,000 కోట్ల డాలర్ల (47 లక్షల కోట్ల రూపాయల) సరుకులను దిగుమతి చేసుకుంటామని ప్రభుత్వం అంగీకరించింది. అంటే సగటున సంవత్సరానికి 10,000 కోట్ల డాలర్ల (9,60,00 కోట్ల రూపాయల) సరుకులను అమెరికా నుండి మనదేశం తప్పనిసరిగా దిగుమతి చేసుకోవాలి. 2025 వ సంవత్సరంలో అమెరికా– భారత్‌ల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం 14,940 కోట్ల డాలర్లు (14,34,240 కోట్ల రూపాయలు). ఇందులో మనదేశం నుండి అమెరికా చేసుకుంటున్న దిగుమతులు 10,380 కోట్ల డాలర్లు. అంతకు ముందు సంవత్సరం కన్నా 18.9 శాతం పెరిగాయి. అమెరికా నుండి మనదేశం చేసుకుంటున్న దిగుమతులు 4,560 కోట్ల డాలర్లు. అంతకు ముందు సంవత్సరం కన్నా 9.8 శాతం పెరిగాయి. అమెరికా వాణిజ్యలోటు 5,820 కోట్ల డాలర్లు, 27.1 శాతం పెరిగింది.

ఈ విధంగా పోల్చుకున్నపుడు అమెరికా మనకు ఎగుమతి చేసిన సరుకుల విలువ కన్నా వాణిజ్య లోటు ఎక్కువగా ఉన్నది. ఇది మనదేశానికి అనుకూలమైన పరిస్థితి. ఇటువంటి సానుకూలమైన పరిస్థితిని వదులుకొని, అమెరికా వాణిజ్యలోటును మనం భరించే విధంగా ఒప్పందం చేసుకోవటం మనదేశ ప్రయోజనాలకు గొడ్డలి పెట్టుగా పరిణమిస్తుంది. అమెరికా నుండి దిగుమతులు పెరిగితే మన దేశానికి వచ్చే డాలర్లు తగ్గి, రూపాయి విలువ మరింత వేగంగా పతనమౌతుంది.

**❝ అమెరికా, న్యూజిలాండ్ దేశాలతో చేసుకుంటున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు మన వ్యవసాయ, పారిశ్రామిక రంగాలను ధ్వంసం చేస్తాయి. ద్వైపాక్షిక ఒప్పందంలో భాగంగా రానున్న ఐదు సంవత్సరాలలో అమెరికా నుండి 50,000 కోట్ల డాలర్ల (47 లక్షల కోట్ల రూపాయల) సరుకులను దిగుమతి చేసుకుంటామని ప్రభుత్వం అంగీకరించింది. అంటే సగటున సంవత్సరానికి 10,000 కోట్ల డాలర్ల (9.6 కోట్ల రూపాయల) సరుకులను అమెరికా నుండి మనదేశం తప్పనిసరిగా దిగుమతి చేసుకోవాలి. ❞**




అమెరికాతో చేసుకుంటున్న ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంలో ఆ దేశం నుండి దిగుమతి అయ్యే వ్యవసాయ, పారిశ్రామిక ఉత్పత్తులపై దిగుమతి సుంకాలను పూర్తిగా రద్దుచేయటం లేదా బాగా తగ్గించటానికి ప్రభుత్వం అంగీకరించింది. పాలు, పాల ఉత్పత్తులు, కొన్ని రకాల పండ్లు కూడా ఈ జాబితాలో ఉన్నాయి. ఈ సరుకులను ఉత్పత్తిదారులు అమెరికా ప్రభుత్వం నుండి భారీగా సబ్సిడీలు పొందుతున్నారు. అంత భారీగా సబ్సిడీలు పొందుతున్న ఉత్పత్తులు ఎటువంటి సుంకాలు లేకుండా మనదేశంలోకి ప్రవేశిస్తే మన రైతులు పోటీకి తట్టుకోలేరు. దేశంలో సగం మందికి పైగా ప్రజలకు ఉపాధి కల్పిస్తున్న వ్యవసాయం, అనుబంధ రంగాలు తీవ్రమైన సంక్షోభంలో చిక్కుకుంటాయి.

> ❝ నరేంద్రమోడి నాయకత్వంలో బిజెపి ప్రభుత్వం కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ విధానాలను పూర్తిగా తల్లకిందులు చేశారు. అభ్యుదయ శక్తులు, ప్రభుత్వాలకు మద్దతివ్వటం నుండి అభివృద్ధి నిరోధక ప్రభుత్వాలతో చెలిమి చేసే విధంగా మన విదేశాంగ విధానంలో మార్పులు తీసుకొచ్చారు. అమెరికా ఎం చెబితే దానికి తల ఊపుతున్నారు. ❞

మన రైతుల ప్రయోజనాలను గాలికొదిలేసి, అమెరికా ఉత్పత్తులకు ద్వారాలు తెరిచే ఈ విధానం రైతులను నాశనం చేస్తుంది. ప్రభుత్వం 2047 నాటికి సాధిస్తామని గొప్పగా ప్రకటిస్తున్న ఆర్థిక లక్ష్యాలకు విఘాతం కలిగిస్తుంది.

**అంతర్జాతీయంగా ప్రాధాన్యతను కోల్పోయిన భారతదేశం**

అమెరికన్ సామ్రాజ్యవాదుల అడుగులకు మడుగులొత్తుతున్న బిజెపి ప్రభుత్వం అంతర్జాతీయంగా భారత దేశ ప్రాధాన్యతను తగ్గించేస్తోంది. స్వాతంత్ర్యానంతరం భారతదేశం సామ్రాజ్యవాదులకు లొంగకుండా స్వతంత్రంగా వ్యవహరించటం, అభ్యుదయ శక్తుల పక్షాన నిలబడటం, అభివృద్ధి చెందుతున్న దేశాలకు మద్దతిచ్చే విధానాలతో అంతర్జాతీయంగా ప్రతిష్ఠ సంపాదించుకున్నది.

నరేంద్రమోడి నాయకత్వంలో బిజెపి ప్రభుత్వం కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ విధానాలను పూర్తిగా తల్లకిందులు చేశారు. అభ్యుదయ శక్తులు, ప్రభుత్వాలకు మద్దతివ్వటం నుండి అభివృద్ధి నిరోధక ప్రభుత్వాలతో చెలిమి చేసే విధంగా మన విదేశాంగ విధానంలో మార్పులు తీసుకొచ్చారు. అమెరికా ఎం చెబితే దానికి తల ఊపుతున్నారు. గాజా, వెస్ట్‌బ్యాంక్‌లో వేలాది మంది పాలస్తీనీయులను ఊచకోత కోస్తూ, లెబనాన్‌పై దాడులు జరుపుతున్న నరహంతక ఇజ్రాయెల్ ప్రభుత్వానికి పూర్తి మద్దతు ఇస్తున్నది. మోడి ఇజ్రాయెల్‌లో పర్యటించిన మరుచటి రోజే ఆ దేశం అమెరికాతో కలిసి ఇరాన్‌పై దాడులు ప్రారంభించటం అనేక సందేహాలను రేకెత్తిస్తున్నది. సాంప్రదాయకంగా మనకు మిత్రదేశంగా ఉన్న ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడులను ఖండించకపోగా, ఆ దేశ అత్యున్నత నేత ఆయతుల్లా అలీ ఖమేని హత్యకు కనీసం సంతాపం కూడా తెలుపలేదు. తనపై జరుగుతున్న దాడులకు ప్రతిగా గల్ఫ్ దేశాలలోని అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్ చేస్తున్న దాడులను మాత్రం ఖండించింది. ఈ విధంగా అమెరికా తాబేదారుగా వ్యవహరిస్తున్న మోడీ ప్రభుత్వం అంతర్జాతీయంగా దేశానికి ఉన్న గౌరవ ప్రతిష్ఠలను, అభ్యుదయ శక్తుల మద్దతును పోగొడుతున్నది.

**ప్రజా పోరాటాలపై విదేశీ ముద్ర**

తమ జీవితాలను దిగజారుస్తున్న మోడీ విధానాలను ప్రజలు ప్రతిఘటిస్తున్నారు. దేశ రాజధాని చుట్టుపక్కల కార్మికులు తమ జీతాల పెంపుదల కోసం, పని పరిస్థితుల మెరుగుదల కోసం పోరాటాలు చేశారు. మద్దతు ధరలు పెంచాలని, స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తు రైతులు పోరాటాలు చేస్తున్నారు. మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన వి బి గ్రామ్‌జి పథకాన్ని రద్దు చేసి, మహాత్మాగాంధి జాతీయ గ్రామీణ ఉపాధి హామి చట్టాన్ని పునరుద్ధరించాలని వ్యవసాయ కార్మికులు, గ్రామీణ పేదలు పోరాటాలు చేస్తున్నారు.

ప్రజలు చేస్తున్న న్యాయమైన పోరాటాలకు సమాధానం చెప్పలేక, విదేశీశక్తుల జోక్యంతో ఈ పోరాటాలు జరుగుతున్నాయని, టెర్రరిస్టులు చొరబడ్డారని మోడి ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేస్తున్నది. అమెరికన్ సామ్రాజ్య వాదుల అభిమతానికి అనుగుణంగా వ్యవహరిస్తున్న మోడి ప్రభుత్వం విదేశీ శక్తుల జోక్యంతో ప్రజా పోరాటాలు జరుగుతున్నాయని ప్రచారం చేయటం హాస్యాస్పదంగా ఉన్నది. ఎన్ని తప్పుడు ప్రచారాలు చేసినప్పటికీ తమ జీవితాలను మెరుగు చేసుకోవటం, హక్కులను సాధించుకోవటం కోసం దేశప్రజలు చేస్తున్న పోరాటాల ముందు మోడి ప్రభుత్వం తలవంచక తప్పదు. *

---

# అరాచక సంస్కృతిపై సమరం

(35వ పేజీ తరువాయి)

,నిజంగా చేస్తున్న దానికి మధ్య వైరుధ్యం పెరుగుతుంది. ఉత్పత్తి శక్తుల అభివృద్ధి అనేది ఉపరితల లోపాలను బయటపెట్టి, అదే సమయంలో అనుత్పాదక పాలకవర్గం ఆ ఉపరితలాన్ని అంటిపెట్టుకునేలా చేస్తుంది. పాలక వర్గం ప్రతిఘాత విప్లవానికి, ఫాసిజానికి కోటగా మారి పోరాటాన్ని తీవ్రతరం చేస్తుంది. ఉత్పత్తి శక్తులను నిర్వహిస్తున్న పీడిత వర్గాలు తిరగబడి ఉపరితలాన్ని ముక్కలు చేసినప్పుడు విప్లవం వస్తుంది. విప్లవాన్ని అనుసరించి వచ్చే ఉపరితల మార్పులు

వివాదాస్పద కూల్చడం కాదని ,కొత్త ఉత్పత్తి సంబంధాల్లో నాటికే అంతర్గతంగా ఉన్న కొత్త సంబంధాలు సాకారం అవటం అని మార్క్స్ చూపగలిగాడు. ఆచరణకు దూరమైన పాలకవర్గం యొక్క స్వీయభ్రాంతికి, పనికిరమాలిన తనానికి మరియు అభివృద్ధి చెందే సైన్స్ కు మధ్య వైరుధ్యం పెరుగుతుంది. సైన్స్ ఇచ్చే ప్రాపంచిక దృక్పథం సమగ్రతను కోల్పోయి, విడివిడి శాస్త్ర విజ్ఞానాలుగా, పేదగా మిగిలిపోతాయి.

పెట్టుబడిదారీ వర్గం అధికారహీనమై , కార్మిక వర్గం సిద్ధాంతం –ఆచరణల మధ్య మౌలిక విభజనను రద్దుచేసి ప్రతి నవ కల్పన ఉపరితలాన్ని ప్రభావితం చేసేలా చేస్తుంది. చరిత్ర భవిష్యత్తుకు మార్గదర్శి అవుతుంది. అది కేవలం రికార్డులు ,శాసనాల అధ్యయనం కాకుండా పొరుగు వారి పట్ల బాధ్యత, మానవ గమ్యం, వస్తుగత సత్యం, సౌందర్యం విలువ, చెడు నిజమా అనే ప్రశ్నలకు జవాబు ఇచ్చే సాధనం అవుతుంది.

గతాన్ని నిశితంగా విశ్లేషించి, పాతలో దాగివున్న వర్తమానాన్ని వేరు చేస్తుంది. చారిత్రక భౌతికవాదం అనేది గడ్డ కట్టిన గతకాల జ్ఞానం కాదు. అది వర్తమానంలో చురుకుగా ఉన్న గతం. భావి నిర్మాణంలో మనిషికి చురుకైన సహాయకారి. నేటి ప్రపంచానికి కావలిసింది. పర లోక వ్యామోహంలో జనాల్ని ముంచి, ప్రజలను ఇహలోక సమస్యా పరిష్కారానికి దూరం చేసే దోపిడీ వర్గ భ్రాంతి కాదు. సమ సమాజ స్థాపనకు తోడ్పడే అధునాతన సైద్ధాంతిక మార్గం. *

# అరాచక సంస్కృతిపై సమరం

(2వ పేజీ తరువాయి)

బూర్జువా సంస్కృతి పరిధిలో ఒక సైన్స్‌గా ఉండదు.

పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలో ఏకస్వామ్యం వల్ల దేశీయ మార్కెట్ పరిమితమై, లాభాలు బలహీనమయిన బాహ్య మార్కెట్లోకి దిగుమతి అయ్యి నూతన విచ్ఛిన్న కారకం కావాలి. ఈ బయటి అవ్యవస్థ నేడు ఆర్థిక జాతీయవాదం, ఫాసిజాల్లో , కొత్త సామ్రాజ్యవాద యుద్ధాలలో చూడవచ్చు. దీనినే బూర్జువా సంస్కృతిలో కూడా చూడవచ్చు. ఎంతో వ్యవస్థీకృతమైన సైన్స్ లేదా దాని విభాగాలు (బయాలజీ ఫిజిక్స్, సైకాలజీ, ఆంత్రోపాలజీ, ఇంజనీరింగ్, ఎస్థెటిక్స్, ఫిలాలజీ మొదలగునవి) సమగ్ర ప్రపంచ దృక్పథాన్ని ఇవ్వలేవు. వాటి అంతర్గత వ్యవస్థీకరణ అత్యధికంగా పెరగటం వల్ల సంస్కృతి మొత్తంలో అవ్యవస్థ (disorganization) ఏర్పడుతుంది. ఆర్థిక వ్యవస్థలో లాగా సంస్కృతిలో కూడా తీవ్ర విచ్ఛిన్నత ఏర్పడుతుంది .

మనిషి కూడా ప్రకృతిలో భాగమే. ప్రకృతిని స్వాధీనం చేసుకోవాలంటే విడి విడిగా ఉన్న వ్యక్తులు కాక వ్యవస్థీకృతమైన మనుషుల సహకారంతోనే అది సాధ్యం అవుతుంది. లేదంటే మానవుల పరస్పర విరుద్ధ ఇచ్ఛల మధ్య యుద్ధం లేదా మాంద్యం

వంటి అనూహ్య ఫలితాలు వస్తాయి. ప్రకృతి ఏ ఒక్క ప్రత్యేక ఇచ్ఛను కాక ఆచరణలో అన్ని ఇచ్ఛల చారిత్రిక ఫలితాన్ని ఇస్తుంది. కాబట్టి మనుషులు తమ లక్ష్య సాధనకు మానవేతర అవసరాల (అంటే పదార్థ) జ్ఞానమే కాక సహకార అవసరాలు సైతం తెలుసుకోవాలి. ఆ జ్ఞానం పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థను కూలదోసి, దాని స్థానంలో కమ్యూనిస్టు ఆర్థిక వ్యవస్థను స్థాపించాలన్న ఆలోచనను కలిగిస్తుంది.

వర్గ సమాజంలో ఒక వైపు పాలకవర్గం సమాజాన్ని తన ఇచ్ఛకు అనుగుణంగా వంచేందుకు పూనుకుంటుంది. దాని వల్ల మిగతా సమాజానికి కలిగే పరిణామాలను అది పట్టించుకోదు. దాంతో స్వేచ్ఛ పరిమితం అవుతుంది. పాలక వర్గం తమ అధికారాన్ని, స్వేచ్ఛను శాంతియుతంగా వదులుకోదు. సామాజిక ఉత్పత్తిపై దాని అధికారం వ్యక్తులుగా పెరిగే కొద్దీ, అదే స్థాయిలో తన అధికార రక్షణ కోసం పోరాటం ఎక్కువ అవుతుంది. అయితే పాలక వర్గ వ్యతిరేక ధృవంవద్ద బానిసత్వ శక్తులు ఏకమవుతాయి.

మార్క్స్ , ఎంగెల్స్‌లు చెప్పిన చారిత్రక భౌతిక వాదం సమాజాన్ని మార్చే సాధనం. పెట్టుబడిదారీ సంస్కృతి అంతమైనప్పుడు, నూతన వ్యవస్థ ఏర్పడి కమ్యూనిస్టు సంస్కృతి వచ్చినప్పుడు ఆ సంస్కృతిలో అన్ని సైన్సులు సమగ్ర దృక్పథాన్ని ఇస్తాయి. సొంత లాభం కనుమరుగవుతుంది. చరిత్ర పునర్వికాసం అంటే అన్ని జ్ఞానాలను కలగాపులగం చేయడం కాదు. అంతకంతకు సంస్కృతిని వక్రీకరించే అజ్ఞాత శక్తిని అంతం చేయడం. దానితో సమాచార మార్పిడి, చరిత్రను అర్థం చేసుకోవడం, నవోదయాలు సాధ్యం అవుతాయి. చరిత్ర అర్థం కావడం అంటే చరిత్రకు పూర్వ చివరి దశ లక్షణమైన ఆవశ్యకత క్షేత్రం నుంచి స్వేచ్ఛ క్షేత్రానికి కదలడం అన్నమాట. కార్మిక వర్గం అన్ని వర్గాలను అంతం చేసే వర్గంగా తలెత్తడమన్న మాట. అలా చారిత్రక నాగరికత ప్రారంభం కావడమన్న మాట.

బూర్జువా సంస్కృతి మనిషిని వ్యవస్థకు ఎదురుగా నిలబెడుతుంది. వైరుధ్యాలలో కూరుకు పోతుంది. అది వ్యక్తిగతం అని చెప్పే లక్షణాలు అన్నీ అది సృష్టించిన వ్యవస్థకు వ్యతిరేకం. ఆ వ్యవస్థ సృష్టించిన పరిస్థితి – లక్షణాలు లేని, స్వేచ్ఛ లేని మనిషి – ఒక వ్యవస్థ కోల్పోతే లేదా మనిషి మనిషిగా లేని మృగ దశలో ఉన్నట్లు ఉంటాడు. దీనిలో ఇంకా ఉన్నది ఏమిటంటే బూర్జువా విలువైన వ్యక్తిత్వాల కోసం పోరాడుతూనే , తనకే ఆశ్చర్యం కలిగేలా ఉన్నతర ఆర్గనైజేషన్ సృష్టిస్తూ, దానికి వ్యతిరేకంగా పోరాడుతూ వ్యక్తిత్వ నష్టాన్ని కలిగిస్తాడు. తాను గుడ్డిగా పోరాడుతున్నందున ప్రతిదీ అనూహ్యంగా, అరాచకంగా ఉత్పత్తి చేస్తాడు.

ఆర్థిక ఉత్పత్తి మనిషిని జంతువు నుంచి వేరు చేస్తుంది. మనిషి, ప్రకృతిల పరస్పర చర్య ఫలితం పర్యావరణీకరించబడిన మనిషి, మానవీకరించబడిన పర్యావరణం. మనిషి ప్రత్యేక లక్షణాలు – సైన్సు, కళ, సామాజిక సంబంధాలు, భాష అన్నీ పర్యావరణం

కిందకు వస్తాయి. మానవ అభివృద్ధి అంటే ప్రకృతి దశ నుంచి వేరు అవడం కాదు. ప్రకృతితో మరింత పెనవేసుకు పోవడం. చరిత్ర అంటే పోరాటం ద్వారా మనిషి , పర్యావరణాల మధ్య మరింతగా పరస్పరం కలిసిపోవడం. అది విడదీయలేని సంబంధాల అభివృద్ధి యొక్క అధ్యయనం. అది మనుష్యులు చేసే వస్తువులు ప్రకృతిపై జరిపే చర్య, ప్రతి చర్యల అధ్యయనం.

ప్రకృతిని మనిషి ఒంటరిగా కాకుండా ఒక వ్యవస్థీకృతమైన సమాజంగా ఉత్పత్తిలో ఒకరికి మరొకరు సహకరించే మానవులుగా ఎదుర్కొంటారు. సమాజం ప్రకృతిని మార్చినా, మారిన ప్రకృతి కూడా సమాజంపై తాజా పద్ధతుల్లో కొత్త వ్యవస్థను విధిస్తుంది. ప్రజలు కేవలం నేపథ్యంలో ఉండి చరిత్రను మార్చేవారు కాదు .వారి చర్యల నుంచే గొప్ప వ్యక్తులు, గొప్ప సందర్భాలు, గొప్ప సంస్కృతులు పుడతాయి. పర్యావరణం అనేది తన లక్షణాల బట్టి మనిషిపై, ప్రధానంగా అతని సామాజిక వ్యవస్థ పై ఆధారపడి ఉంటుంది. తగు వ్యవస్థ, టెక్నిక్ లేనిదే పర్యావరణం అలా ఉండదు. ప్రతి దశలో మనిషి కొరకు పర్యావరణం నిర్ణయాత్మకంగా ఉంటుంది. దానికి కారణం సమాజంలోనే వెతకాలి.

చరిత్ర మానవుల చైతన్యపూరిత చర్యల వల్ల నిర్మించబడినా, ఆ చైతన్యం చారిత్రకంగా అభివృద్ధి చెందిన చైతన్యంలో భాగంగా , ఆర్థిక ఉత్పత్తి , శ్రమ విభజన అభివృద్ధి ఫలితంగా చూడాలి. ఉనికి భావాలకు ముందు ఉంటుంది. సంఘటనల గురించి మనుషుల అభిప్రాయాలు, ఎంత తిరిగి ప్రాణం పోసుకున్నా, అవి నిజమైన చరిత్ర కాదు. ఎందుకంటే ఒక వ్యక్తి శీలం అతని సొంత అభిప్రాయాలను బట్టి ఎలా తెలుసుకోలేమో, ఒక శకం లక్షణాలు నాటి మనుజుల అభిప్రాయాలు బట్టి తెలుసుకోలేము. చారిత్రక నియమాలను వస్తు గత చైతన్యం అధ్యయనం ద్వారా మాత్రమే తెలుసుకోగలం. చరిత్ర కూడా మిగిలిన సైన్స్ పద్ధతుల నుంచి తప్పించుకోలేదు. నూతన చైతన్యం (కొత్త సిద్ధాంతం, ప్రతిపాదన,జ్ఞాన వ్యవస్థ) ఆచరణ, ప్రయోగం, నేటి చైతన్యాన్ని అధిగమించే వాస్తవికతతో సంబంధం వల్ల వస్తుంది. చారిత్రక పరిణామంలో క్రమానుగత మార్పులే కాక కొన్ని కాలాల్లో వేగవంతమైన మార్పు వచ్చి, చట్టాలు , సైన్స్ ,కళలు ,హక్కులు ,పంపిణీ పద్ధతులు ఒక గొప్ప పేలుడుకు గురవుతాయని మార్క్స్ కనుగొన్నాడు. ఇది ఒక బాంబు స్లో మోషన్‌లో పేలి ఒకటి, రెండు శతాబ్దాలు ఉండటం.

పాలకవర్గం తక్కువ ఉపయోగకరంగా, ఎక్కువ పరాన్నజీవిగా, ఆలోచనలో ,భావవాద పరంగా ఉంటే , పీడితులు సమాజ ఉత్పత్తి శక్తులపై అంతకంతకు ఏకైక అదుపు సాధిస్తారు. అదే సమయంలో ఆ సమాజ ఉత్పత్తుల నుంచి దూరం అవుతారు. మనిషి చేయగలిగిన దానికి


(మిగతా 34వ పేజీలో)

*

Date of Publication : 30th of every month. Date of Posting : 5th & 7th of every month.
Postal Regd. No. D/VJ/172/2024-26, Marxistu Monthly Magazine, Volume 22, issue: 1 Vijayawada
RNI Reg. No. APTEL/2006/17554 - Rs. 15/- Total Pages : 36

# ఫాసిజానికి వ్యతిరేకంగా జరిగే పోరాటం నిర్దిష్ట పరిస్థితులకు అనుగుణంగా ఉండాలి!

– జార్జి డిమిట్రోవ్



ఫాసిజం సాధారణ లక్షణాలను మనం ఎంత ఖచ్చితంగా చెప్పగలిగినప్పటికీ దాని అభివృద్ధికి సంబంధించిన నిర్దిష్ట లక్షణాలనూ, వివిధ దేశాల్లో ఫాసిస్టు నిరంకుశత్వం తీసుకునే వివిధ రూపాలనూ, ఇంకా దానికి సంబంధించిన వివిధ దశలనూ అధ్యయనం చేసి, ఆ నిర్దిష్ట అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రతి దేశంలో ఆ దేశపు నిర్దిష్ట పరిస్థితుల్లో ఫాసిజం పనిచేసే తీరును పరిశోధించి, ఆ జాతీయ నిర్దిష్ట పరిస్థితుల్లో ఫాసిజాన్ని ఎదుర్కొనేందుకు నిర్దిష్ట పోరాట రూపాలను చేపట్టాలి.

'ఎత్తుగడల నియమాలు, పోరాట నియమాలను నిర్ణయించడంలో మూసపోత పద్ధతులు' అనుసరించ రాదని లెనిన్ నిరంతరం హెచ్చరిస్తూ వచ్చారు. ముఖ్యంగా శత్రువు జాతీయ సెంటిమెంట్లనూ, ప్రజల్లో ఉన్న అపోహలనూ, పెట్టుబడిదారీ వ్యవరేకతనూ బడా పెట్టుబడికోసం ఎంతో నేర్పుగా, మోసకారితనంగా ఉపయోగించుకుంటున్న తరుణంలో ఈ హెచ్చరికను మరింత సీరియస్‌గా తీసుకోవాలి. అటువంటి శత్రువు గురించి అన్ని కోణాల్లో కచ్చితంగా అంచనా వేయాలి. శత్రువు వేసే వివిధ రకాల ఎత్తుగడలపై ఎప్పటికప్పుడు ఆలస్యం లేకండా ప్రతిస్పందిస్తుండాలి. అతని రహస్య ఎత్తులను కనిపెట్టాలి. ఏ క్షణంలోనైనా, ఏ వేదికమీదనైనా అతన్ని తిప్పికొట్టడానికి మనం సిద్ధంగా ఉండాలి. శత్రువు మెడను మరింత త్వరగా, మరింత సమర్ధవంతంగా పట్టుకోడానికి మనకు ఉపయోగపడుతుందనుకుంటే మనం శత్రువునుండి కూడా నేర్చుకోడానికి వెనుకాడకూడదు.

ఫాసిజం అభివృద్ధికి సంబంధించి అన్ని దేశాలకూ, ప్రజలందరికీ వర్తించే సర్వసాధారణమైన సూత్రం ఉందనుకుంటే చాలా పొరపాటు పడినట్టే. అటువంటి సూత్రం మనకు ఉపయోగపడకపోగా, నిజమైన పోరాటం చేయడానికి అడ్డుపడుతుంది. అన్నిటికీ మించి ఇటువంటి తప్పుడు సూత్రీకరణల వల్ల మనం ఫాసిజానికి వ్యతిరేకంగా జరిగే పోరాటంలో ఏదో ఒక దశలో మనతో కలిసి వచ్చే, లేక తటస్థంగా ఉండిపోయే ప్రజల్లోని ఒక భాగాన్ని ఆ ఫాసిస్టు శిబిరంలోకి నెట్టే ప్రమాదం ఏర్పడుతుంది.

**(1935 ఆగస్టు 13న కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ ఏడవ ప్రపంచ మహాసభ ముగింపులో "ఫాసిజానికి వ్యతిరేకంగా కార్మికవర్గ ఐక్యత" అనే అంశంపై జార్జి డిమిట్రోవ్ చేసిన ప్రసంగం నుండి ఈ వాక్యాలను సంగ్రహించడం జరిగింది.)**

**చిరునామా**

**మేనేజర్,**

**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి , పిన్ : 522501, గుంటూరు జిల్లా. సెల్: 94900 99422**

**చందా వివరాలు**

విడిపత్రిక: **రూ.15,** సంవత్సర చందా:**రూ.150,** పోస్టు ద్వారా **రూ. 180**
**పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు. లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి. ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.**

**చందాదారుని చిరునామా**

**పోస్టు స్టాంపు**

**ఇంటి నెంబరు**...............................................
**వీధి**...............................................
**గ్రామం**...............................................
**మండలం లేదా పట్టణం**...............................................
**జిల్లా**...............................................

email: marxistap@gmail.com
venkataraosankarapu@gmail.com

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed at Prajasakti Printers & Publishers Private Ltd. D .No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt. 94900 99422.
Editor : S. Venkatarao.